ఆంధ్రభూమి

సంపుటి: 30 . సంచిక: 234 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | గురువారం 24 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: బహుళ చవితి రా.2.19
వర్జ్యం: ఉ.8.41 నుండి 10.10 వరకు, తిరిగి రా.తె.6.25 నుండి
దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు, మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు

ఈబీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో పిటిషన్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 23: అగ్ర వర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు(ఈబీసీ) విద్య,ఉపాధి అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్ట సవరణ చేయడాన్ని సవాల్ చేస్తూ బీసీ సమైక్య జాతీయ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేంద్రం ప్రభుత్వం ఎలాంటి అధ్యయనం లేకుండా అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తే రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతింటుందని ఆ పిటిషన్‌లోపేర్కొన్నారు. సామాజికంగా వెనుకబాటు తనం, గతంలో సమాజంలో సామాజిక వివక్షకు గురయ్యారా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలా రిజర్వేషన్లు కల్పిస్తారని ఆ పిటిషన్‌లో వెల్లడించారు. అలాగే ఏ కులానికి రిజర్వేషన్లు కల్పించిన సామాజిక ఆర్థిక సర్వే,జనభా గణన జరగాలని వీటన్నింటి జరపకుండా ఎలా అగ్రవర్ణాల్లో పేదాలకు రిజర్వేషన్లు కల్పిస్తారని తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు.

రైల్వే ఉద్యోగాల్లో ఈబీసీ కోటా అమలు


- ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల్లో భర్తీ
- ఉద్యోగాల కోసం ఇప్పటికే నోటిఫికేషన్



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 23: రైల్వేశాఖలో ఖాళీ ఉద్యోగాల భర్తీ చేయడానికి ఈనెల ప్రారంభంలో ప్రకటించిన నోటిఫికేషన్‌లో భాగంగా కేంద్రం తాజాగా ప్రకటించిన 10 శాతం ఈబీసీ కోటాను అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రైల్వేశాఖలో దాదాపు 14వేల ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయడానకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెల్సిందే. రైల్వేశాఖలో జూనియర్ ఇంజనీర్, జూనియర్ ఇన్ఫర్మేషన్, డీఎంఎస్, సీఎంఎస్ వంటి ఉద్యోగాల్లో నియామక ప్రక్రియను పూర్తి చేయనున్నారు. నిరుద్యోగ యువతీయువకు ఉద్యోగాల కోసం ఈనెల 31వ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని రైల్వే శాఖ సూచించింది. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో పరీక్షలు ఉంటాయని వివరించింది. జారీ చేసిన నోటిఫికేషన్‌లోని మిగతా అంశాల్లో మార్పు లేదని, ఈబీసీ కోటాను అమలవుతుందనే విషయాన్ని చేర్చుకోవాలని పేర్కొంది.

ఘనగామా



ఇంతకీ మన పార్టీ వీకన్నట్టా... స్ట్రాంగన్నట్టా... సార్!!



యూపీ తూర్పు విభాగం ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక

ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు

- కీలక బాధ్యతలు అప్పచెప్పిన ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాయబరేలి నుంచి పోటీ ?
- బీఎస్పీ, ఎస్పీకి చెక్
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సాహం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 23: యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కూతురు ప్రియాంకా గాంధీ వద్రా ఎట్టకేలకు ప్రత్యక్ష రాజకీయాలోకి అరంగేట్రం చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) వంటి మిత్రపక్షాలు సైతం తమను పక్కన పట్టడంతో భయపడిపోయిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన సోదరి ప్రియాంకను ప్రత్యక్ష రాజకీయాలలోకి తీసుకురావటంతోపాటు, దేశంలోని అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లోని తూర్పు భాగానికి ఆమెను ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శిగా నియమించారు. లోక్‌సభ ఎన్నికలకు కేవలం తొంబై రోజుల ముందు ప్రియాంకను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించటం చర్చనీయాంశమైంది. రాహుల్ ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం ఒక ప్రకటన జారీ చేశారు. ఉత్తర యూపీ ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి గులాం నబీ ఆజాద్‌ను హర్యానా ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో తూర్పు ఉత్తర ప్రదేశ్‌కు ప్రియాంకా గాంధీని, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌కు జ్యోతిరాధిత్య సింధియాను ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శిగా నియమించారు. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి బాధ్యతలను కేరళకు చెందిన లోక్‌సభ సభ్యుడు వేణుగోపాల్‌కు ఇచ్చారు.

ఆయన కర్నాటకతోపాటు కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతారు. ఉత్తర ప్రదేశ్‌లో దాదాపు సగ భాగానికి ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శిగా నియమితురాలైన ప్రియాంక ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి తమ బాధ్యతలు చేపడతారు. ఆమె ఇంత వరకు ప్రత్యక్ష రాజకీయాలు నిర్వహించకపోయినా, చాలా కాలం నుండి ఆమె సోదరుడు రాహుల్ లోక్‌సభ నియోజకవర్గం అమేథీ, తన తల్లి సోనియా గాంధీ లోక్‌సభ నియోజకవర్గం రాయబరేలీ లోక్‌సభ నియోజకవర్గం బాధ్యతలు నిర్వహించటం అందరికి తెలిసిందే. ఇప్పుడు ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రియాంక ఇక మీదట ప్రత్యక్ష రాజకీయాలు నిర్వహిస్తూ రాహుల్‌కు

- మిగతా 6లో

తలచినదే జరిగినదీ
పోలికలిందరవిగాగ పోడిమితోడన్
గెలుపును కాంగ్రెస్‌కీయగ
ఆలనపాలన ప్రియాంక అందలమెక్కెన్



బీజేపీ భయపడుతోంది

ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 23: ప్రియాంకా గాంధీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావటం బీజేపీకి భయం కలిగిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ప్రియాంక, జ్యోతిరాధిత్య సింధియా లాంటి యువ నాయకులు కాంగ్రెస్‌లో కొత్త రక్తం నింపుతారని, దీనితో పార్టీ ఎంతో బలపడుతుందని ఆయన బుధవారం మధ్యాహ్నం విలేఖరులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. ప్రియాంక, జ్యోతిరాధిత్య ఎంతో బలమైన నాయకులని, వీరి వలన కాంగ్రెస్ మరింతగా పుంజుకుంటుందని వ్యాఖ్యానించారు. వీరిద్దరు యువ నాయకుల నాయకత్వంలో యూపీ రాజకీయాలను పూర్తిగా మార్చివేయాలని అనుకుంటున్నట్టు రాహుల్ ప్రకటించారు. ఎస్పీ, బీఎస్పీతో ఒప్పందం కుదరనందుకే ప్రియాంకను రాజకీయాలలోకి తెస్తున్నారా? అని అడుగగా అలాంటిదేదీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతిని తానెంతో గౌరవిస్తానన్నారు. వారు తమ తమ రాజకీయాలు

- మిగతా 6లో

కాపులకు 5 శాతం కోటాపై అభ్యంతరం ఏమిటి?

కులాల్లో చిచ్చుకు బీజేపీ, వైకాపా కుటిలయత్నాలు

- అవినీతిని నియంత్రించామని మోదీ అనడం హాస్యాస్పదం
- ఈవీఎంలపై చర్చను పక్కదారి పట్టించే యత్నం
- టీడీపీ నేతలతో టెలీకాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చు పెట్టాలని బీజేపీ, వైకాపా ప్రయత్నిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, అభ్యంతరం ఏమిటని ఆ రెండు పార్టీలను ప్రశ్నించారు. అవినీతిని నియంత్రించామని ప్రధాని మోదీ చెప్పడం హాస్యాస్పదం అంటూ ధ్వజమెత్తారు. ఉండవల్లిలోని సీఎం నివాసం నుంచి బుధవారం టీడీపీ ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కమిటీల బాధ్యులతో బుధవాం చంద్రబాబు టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టాలన్న ప్రతిపక్షాల కుట్రను తిప్పికొట్టాలన్నారు. అగ్రకులాల్లో కాపులు సగానికిపైగా ఉన్నారని, కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాల శాతమే అధికమని

- మిగతా 6లో



పీయూష్‌కు ఆర్థిక శాఖ మంత్రిగా తాత్కాలిక బాధ్యతలు



న్యూఢిల్లీ, జనవరి 23: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అమెరికాలో వైద్య చికిత్స చేయించుకుంటున్నారు. మరో కొద్ది రోజుల్లో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలో ఈ మార్పు జరిగిందని కేంద్రవర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాదికి తాత్కాలిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టనున్నారు. పీయూష్ గోయల్‌కు ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రపతి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

టీడీపీ, జనసేన కలిస్తే తప్పేంటి?

- రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్
- వ్యాఖ్యలపై ఆగ్రహించిన ముఖ్యమంత్రి



మీడియాతో మాట్లాడుతున్న టీజీ వెంకటేష్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: టీడీపీ, జనసేన కలిస్తే తప్పేంటి అంటూ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వేడి పుట్టించాయి. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం వద్ద బుధవారం టీజీ మీడియాతో టీజీ మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ కలిసినప్పుడు, ఏపీలో టీడీపీ, జనసేన కలిస్తే తప్పేమిటంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి కుర్చీపై ఆశ లేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ గతంలో చాలా సార్లు చెప్పారని గుర్తు చేశారు. టీడీపీతో జనసేన కలిసేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. టీడీపీ, జనసేన మధ్య పెద్దగా విభేదాలు లేవన్నారు. కేవలం కేంద్రంపై పోరాటం చేసే విషయంలోనే రెండు పార్టీలకు అభిప్రాయ భేదాలు ఉన్నాయని వివరించారు. వచ్చే ఎన్నికల్లో గెలిచే వాళ్లకే తమ పార్టీ సీట్లు ఇస్తారని, ఈ క్రమంలో తన కుమారుడికి కూడా అవకాశం వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డితో కలిసి ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. కర్నూలు అసెంబ్లీ సీటు విషయంలో

- మిగతా 6లో

ఏపీలో ఒంటరిగానే పోటీ

- రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి ఊమెన్ స్పష్టీకరణ
- ప్రత్యేక హోదా బంద్‌కు మద్దతు: రఘువీరా

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్ చాందీ స్పష్టం చేశారు. దేశంలో నెలకొన్న ప్రస్తుత అస్తవస్య రాజకీయ పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా తెలుగుదేశంతో సహా ఎక్కడికక్కడ స్థానిక ప్రాంతీయ పార్టీలతో కాంగ్రెస్ కలిసినప్పటికీ ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం టీడీపీ సహా ఏ రాజకీయ పార్టీతోనూ పొత్తు లేకుండా ఒంటరిగానే పోటీ చేయనున్నామని చాందీ స్పష్టం చేశారు. ఆంధ్రరత్నభవన్‌లో ఆయన బుధవారం రాష్ట్ర ముఖ్య నేతలతోను ఆపై రాష్ట్ర

- మిగతా 6లో



విలేఖరులతో మాట్లాడుతున్న ఊమెన్‌చాందీ, రఘువీరా తదితరులు



నేడే నింగిలోకి పీఎల్‌ఎల్‌వీ-సీ 44 రాకెట్

ప్రారంభమైన కౌంట్‌డౌన్

సూళ్లూరుపేట, జనవరి 23: మరో వినూత్న ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సర్వం సిద్ధం చేసింది. నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ కేంద్రం నుంచి గురువారం అర్ధ రాత్రి 11:37 గంటలకు పీఎస్‌ఎల్‌వీ-సీ 44 రాకెట్ ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగానికి సంబంధించిన చివరి మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్‌ఆర్) డాక్టర్ సురేష్ అధ్యక్షతన షార్‌లో బుధవారం జరిగింది. ఎంఆర్‌ఆర్ అనంతరం షార్ డైరెక్టర్ ఎస్.పాండ్యన్ ఆధ్వర్యంలో లాంచింగ్ అథరైజేషన్ బోర్డు వారు

- మిగతా 6లో

Gripper



హైకోర్టు భద్రతపై సమీక్షిస్తున్న ఉన్నతాధికారులు

నూతన హైకోర్టుకు పటిష్ట భద్రత

జీఏడీ కార్యదర్శి శ్రీకాంత్ ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: నూతన హైకోర్టుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను సాధారణ పరిపాలనా విభాగం (జీఏడీ) కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ ఆదేశించారు. హైకోర్టు భవనాల ప్రారంభోత్సవం, భద్రతా తదితర చర్యలపై బుధవారం వెలగపూడి సచివాలయంలో ఆయన సమీక్షించారు. ఫిబ్రవరి 3న నూతన హైకోర్టు భవనాలను ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైర్ సర్వీసులు, ట్రాఫిక్, పార్కింగ్, ప్రముఖుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులకు భద్రత కల్పించడంతో పాటు వారి రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని హోం శాఖ కార్యదర్శి అనూరాధ ఆదేశించారు. వీఐపీల వాహనాలకు, ఇతర వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. భవనాలకు బయోఫెన్సింగ్ సహా పోలీస్ అవుట్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రారంభోత్సవానికి దాదాపు 5000 మంది హాజరయ్యే అవకాశం ఉందని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు.

వైసీపీలోకి కోట్ల సోదరుడు

జగన్‌తో భేటీ.. ఫిబ్రవరి 6న పార్టీలో చేరిక

కోడుమూరు, జనవరి 23: కేంద్ర మాజీమంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి సోదరుడు కోట్ల హర్షవర్దన్ రెడ్డి వైకాపాలో చేరనున్నారు. కోడుమూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న హర్షవర్దన్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో వైకాపా అధినేత జగన్‌ను కలిసి సుమారు గంట సేపు మాట్లాడారు. ఫిబ్రవరి 6వ తేదీ అనుచరులతో కలిసి వైకాపాలో చేరాలని నిర్ణయించుకున్నట్లు హర్షవర్దన్‌రెడ్డి తెలిపారు. కోట్ల కుటుంబం మనుగడను కాపాడేందుకే వైకాపాలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు.

జగన్ దాడి కేసు వెనుక కుట్ర

★ ఎన్ఐఏ విచారణకు ప్రభుత్వం సహకరించాలి

★ వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, జనవరి 23: ప్రతిపక్షనేత, వైసీపీ అధినేత జగన్‌పై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన దాడి కేసు వెనుక సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, కొందరు పోలీస్ అధికారుల కుట్ర ఉందని వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో బుధ



విశాఖలో మీడియాతో మాట్లాడుతున్న వైసీపీ నేత బొత్స

వారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌పై దాడి కేసును కేంద్ర ప్రభుత్వ ఎన్ఐఏకు అప్పగించడంతో బుధవారం ఎన్ఐఏ కోర్టులో వేసిన అఫిడవిట్‌లో స్పష్టంగా కుట్ర కోణం ఉందని తేల్చడమే నిదర్శనమన్నారు. ఈ కేసును పూర్తిగా నీరుగార్చడానికి ప్రభుత్వం చూస్తోందని, కుట్ర కోణం లేకపోతే ఎందుకు ఎన్ఐఏకు టీడీపీ నాయకులు, అధికారులు సహకరించడం లేదన్నారు. ఈ కేసు విషయంలో కేవలం టీడీపీ నాయకులు కావాలనే రోజుకో మలుపు తిప్పుతున్నారని, ఎన్ఐఏ విచారణ సంస్థకు విశాఖ పోలీసులు ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా విషయంలో తాము అధికారంలోకి వస్తే ఇస్తామనే విషయాన్ని కాగితాలపై చూపిస్తేనే నమ్ముతామన్నారు. అగ్రవర్ణ పేదలకు కేంద్రం ప్రకటించిన పది శాతం రిజర్వేషన్లు కేంద్రం చూపిన మార్గదర్శకాల ప్రకారమే ఇవ్వాలని, కేవలం కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈవీఎంల వాడకంపై చర్చ మంచిదేనని, కానీ టీడీపీ నాయకులు మాత్రం ఏది చెప్పినా ప్రజలంతా వినేస్తారనే భ్రమలో ఉన్నారన్నారు.

మంటల్లో తహశీల్ కార్యాలయం

తగలబడిన రికార్డులు, కంప్యూటర్లు

బనగానపల్లె, జనవరి 23: కర్నూలు జిల్లా బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయం మంటల్లో తగులబడింది. బుధవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించడంతో కార్యాలయంలోని రికార్డులు, కంప్యూటర్లు, ఫర్నిచర్ తగులబడింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. సుమారు రూ.7 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.

శ్రీసిటీలో మరో భారీ పరిశ్రమకు భూమిపూజ

★ 500 టీహెచ్‌కే పరిశ్రమ ఏర్పాటు

★ జనవరి 2020 నాటికి ఉత్పత్తులు ప్రారంభం

తడ/సత్యవేడు, జనవరి 23: నెల్లూరు - చిత్తూరు జిల్లాల సరిహద్దులో ఏర్పాటు చేసిన శ్రీసిటీలో మరో భారీ పరిశ్రమకు బుధవారం భూమిపూజ చేశారు. లీవియర్ మోషన్ గైడ్లు, రవాణా వాహనాల సామగ్రి తయారీలో పేరుగాంచిన జపాన్‌కు చెందిన టీహెచ్‌కె కంపెనీ అనుబంధ సంస్థ టీహెచ్‌కె ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నిర్మాణానికి టీహెచ్‌కే గ్రూప్ అధ్యక్షులు, సీఈవో అఖీహిరో టెరమాసీ, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డిలు భూమిపూజ కార్యక్రమాన్ని లాంఛనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ హైటెక్ ఇంజనీరింగ్ విభాగంలో మరో ప్రముఖ పరిశ్రమ శ్రీసిటీలో ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలో టీహెచ్‌కేకు సంబంధించిన మొట్టమొదటి కర్మాగారం శ్రీసిటీలో ఏర్పాటు చేయడం ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. అనంతరం సీఈవో టెరమాసీ మాట్లాడుతూ వివిధ పరిశ్రమలతో పాటు తమ ఉత్పత్తులను కూడా భారతదేశంలో అందుబాటులోకి తేవడానికి తమ పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్ ఏర్పాటు అవుతోందని, జనవరి 2020 నాటికి ఉత్పత్తులను ప్రారంభిస్తుందన్నారు. దీనివల్ల దాదాపు 400 మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీహెచ్‌కే గ్రూప్ డైరెక్టర్ టకాతి టెరమాసీ, శ్రీసిటీ ప్లాంట్ అధికారి నోజోమిటమాడాలు పాల్గొన్నారు.



శ్రీసిటీలో టీహెచ్‌కే పరిశ్రమకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

జగన్‌పై హత్యాయత్నం కేసులో

ఎన్ఐఏ ప్రిలిమినరీ చార్జిషీటు దాఖలు

★ ఏ1గా శ్రీనివాసరావు ★ విచారణ కొనసాగుతుందని తెలిపిన అధికారులు ★ ఎన్ఐఏకి రికార్డులు ఇవ్వలేమని తేల్చిచెప్పిన సిట్

విజయవాడ (క్రైం), జనవరి 23: ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టులో ప్రిలిమనరీ ఛార్జిషీటు దాఖలు చేసింది. అయితే దాడికి సంబంధించి విచారణ మాత్రం కొనసాగిస్తామని కోర్టుకు ఎన్ఐఏ తెలియచేసింది.

ఇదిలావుండగా మరోవైపు.. కేసుకు సంబంధించి డాక్యుమెంట్లు ఎన్ఐఏకు అప్పగించలేమని ఏపీ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కోర్టుకు తెలిపింది. ఎన్ఐఏ దర్యాప్తుకు వ్యతిరేకంగా ఇప్పటికే హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున ఇవ్వడం సాధ్యపడదని పేర్కొంటూ ఎన్ఐఏ కోర్టులో సిట్ మెమో దాఖలు చేసింది. ఈ రెండు అంశాలపైనా.. ఇటు సిట్, ఎన్ఐఏ, మరోవైపు నిందితుని తరపు న్యాయవాదులు బుధవారం విజయవాడలోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానంలో సుదీర్ఘ వాదనలు వినిపించారు. ప్రత్యేక కోర్టుకు వచ్చిన ఎన్ఐఏ అధికారులు ఛార్జిషీటు పత్రాలను న్యాయమూర్తికి సమర్పించారు.

ఈ కేసులో నిందితుడు శ్రీనివాసరావును ఛార్జిషీటులో మొదటి ముద్దాయిగా పేర్కొన్నారు. అదేవిధంగా శ్రీనివాసరావు జైలులో రాసుకున్న 22పేజీల పుస్తకాన్ని ఛార్జిషీటుతోపాటు ఎన్ఐఏ జత చేసింది. ఛార్జిషీటు కాపీని ఎవరికీ అందకుండా చూడాలని, గోప్యంగా ఉంచాలని కోర్టు సిబ్బందిని ఈ సందర్భంగా న్యాయమూర్తి ఆదేశించారు. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న జనుపల్లి శ్రీనివాసరావును ఛార్జిషీటులో నిందితునిగా పేర్కొనప్పటికీ కుట్రకోణంపై, దాడికి గల కారణాలపై విచారణ కొనసాగిస్తామని కోర్టుకు ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

కాగా ఛార్జిషీటులో పేర్కొన్న అంశాలు మాత్రం ఈనెల 25వ తేదీన బయటకు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న నిందితుడు శ్రీనివాసరావు రిమాండు గడువు ఆ రోజుతో ముగియనుంది. దీంతో తిరిగి అతడిని వాయిదా సందర్భంగా 25న కోర్టులో హాజరుపరచాల్సి ఉంది. కాగా ఎన్ఐఏ దాఖలు చేసిన ఛార్జిషీటును కోర్టు పరిగణనలోకి తీసుకుని నెంబర్ అయిన మీదట కాపీలను నిందితునితోపాటు పలువురికి ఇవ్వాల్సి ఉంటుందని న్యాయవాద వర్గాలు భావిస్తున్నాయి. కాగా ఈ కేసులో పలు పిటిషన్లు ఇప్పటికే పెండింగ్‌లో ఉండగా అత్యవసరంగా ఛార్జిషీటు దాఖలు చేయాల్సిన అవసరం ఏముందని పేర్కొన్న నిందితుని తరపు న్యాయవాది ఛార్జిషీటు కాపీలు కావాలని కోరగా.. ఇప్పుడెందుకు అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు.

డాక్యుమెంట్లు ఇవ్వలేం : సిట్

ఇదిలావుండగా.. కేసుకు సంబంధించి దర్యాప్తు పత్రాలు, సాక్ష్యాలు, డాక్యుమెంట్లు ఎన్ఐఏకు అప్పగించలేమని రాష్ట్ర పోలీసు ప్రత్యేక దర్యాప్తు బృందం చెప్పింది. కేసు దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ తన విచారణకు సిట్ సహకరించడంలేదని గతంలో కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. రికార్డులు ఇవ్వడం లేదని కోర్టు దృష్టికి తీసుకురాగా వెంటనే కేసు దర్యాప్తుకు సంబంధించి అన్ని పత్రాలు ఎన్ఐఏకు అప్పగించాలని ఈనెల 19న సిట్ అధికారి నాగేశ్వరరావును కోర్టు ఆదేశించింది. అయితే దీనిపై అభ్యంతరం తెలుపుతూ ఎన్ఐఏ కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు చేసింది. కేసు దర్యాప్తు ఎన్ఐఏకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉందని, అందువల్ల డాక్యుమెంట్లు ఇవ్వలేమని సిట్ తెలిపింది. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరుగుతున్న వ్యవహారమని, హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, కింది కోర్టుకు ఆదేశించే అర్హత లేదని సిట్ పేర్కొంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఆదేశాలతో ఈనెల 30లోగా కేంద్రం కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది.

ఏపీలో ఉన్నది ప్రజాస్వామ్యమా?.. ఆటవిక రాజ్యమా?

★ ఓటుహక్కు వినియోగించుకుంటే దాడులా?

★ రాష్ట్రపతి, జాతీయ ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్తా

★ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 23: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అవుతున్నా భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోకుండానే, ఓటు హక్కు ఎలా ఉంటుందో తెలియకుండానే దళితులు, అణగారిన వర్గాలు మరణించే దీన, దారుణ స్థితి ఆంధ్రప్రదేశ్‌లో ఉందని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు రాములు అన్నారు. బుధవారం స్థానిక పద్మావతి అతిథిగృహంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ఓటుహక్కు అంటే ఏమిటో తెలియని, ఓటుహక్కును ఇప్పటివరకు వినియోగించుకోని పరిస్థితి ఉందన్నారు.

అగ్రవర్ణాల దాడులు, దౌర్జన్యాలపై తనకు అందిన ఫిర్యాదుతో చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం, పాకాల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించానని అన్నారు. తిరుపతి సమీపంలోని రామచంద్రాపురం మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి, రావిళ్లవారిపల్లి, పారకాల్వ, కొత్తకండ్రిగ గ్రామాలలో ఇప్పటికీ దళితులు, వెనుకబడిన వర్గాలు ప్రాథమిక హక్కును వినియోగించుకోని దుస్థితి ఉందన్నారు. వారు చెప్పిన విషయాలు తనను నిర్ఘాంతపోయేలా చేశాయన్నారు. అగ్రవర్ణాల వారు దళితులు, వెనుకబడిన వర్గాల వారి వేలికి ఇంకు పూసి పంపించి వేసి తమకు ఇష్టమైన వారికి ఓటు వేసుకుంటున్నారని అన్నారు.


అగ్రవర్ణాల వారిని కాదని ఓటు వేసేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై దాడులు జరుగుతాయని మహిళలు తన ముందు వాపోయారన్నారు. దీనినిబట్టి చూస్తే రాష్ట్రంలో ఉన్నది ప్రజాస్వామ్యమా? లేకుంటే ఆటవిక రాజ్యమా? అనే అనుమానం కలుగుతోందన్నారు. ఓటుహక్కు అడిగితే పొలాల్లోకి రానివ్వరని, దారులు ఇవ్వకుండా చేసి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని చెప్పారు. పాకాల మండలం మెగరాల పంచాయతీ కృష్ణాపురంలో ఇదే పరిస్థితి కొనసాగుతోందన్నారు. అగ్రవర్ణాల దాడులతో దళితులు ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితిలో లేరన్నారు. చంద్రగిరి మండలం ముంగిళపట్టు గ్రామంలో అగ్రకులాలను కాదని రాజకీయ నిర్ణయం తీసుకోవాలనుకుంటున్న దళితులపై విచక్షణారహితంగా దాడులు జరుగుతున్నాయన్నారు. దళితవాడలకు చెందిన ఆడపిల్లలను పాఠశాలలకు రానివ్వకుండా హుకుం జారీ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఎవరైనా వస్తే వారు ఉపయోగించే మరుగుదొడ్లకు నీటి సరఫరా ఆపివేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితులను తాను దేశ రాష్ట్రపతి, జాతీయ ఎన్నికల ప్రధానాధికారి, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. అధికారుల సమక్షంలో దళితులు కొన్ని దాడులకు సంబంధించిన వివరాలను చెప్పడంతో సుమోటోగా కేసులు నమోదు చేయాలని పోలీసులను తాను ఆదేశించడం జరిగిందని కమిషన్ సభ్యులు రాములు చెప్పారు. దళితుల ఓటుహక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని, లేకుంటే పక్కనున్న పోలింగ్ బూత్‌ల్లో ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దళితులు స్వేచ్ఛగా ఓటు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు ఆయన చెప్పారు.

తడ వద్ద రూ.6.52 కోట్లు పట్టివేత

★ నరసాపురం నుండి చెన్నై తరలిస్తున్నట్టు పోలీసుల వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

నెల్లూరు, జనవరి 23: రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన నెల్లూరు జిల్లా తడ వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు 6.52 కోట్ల దేశీయ, విదేశీ కరెన్సీ ఉన్న నగదును తడ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్పీ ఐశ్వర్య రస్తోగీ నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నుండి చెన్నైకు నగదు తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో తడ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో నరసాపురం నుండి చెన్నై వైపు వెళుతున్న ఏపి 37 సికె 8280 మారుతీ కారుని నిలిపి వివరాలు అడిగే సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో అనుమానంతో కారును క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులకు కారులో బస్తాలు కనిపించాయి. వీటిని తెరచి చూడగా నోట్ల కట్టలు బయట పడడంతో పోలీసులు నోరెళ్లబెట్టారు. నిందితులను విచారించగా తాము నరసాపురం జైదేవ్ జ్యూయలర్స్ నుండి వస్తున్నామని, తమ యజమాని ప్రవీణ్ కుమార్ జైన్ ఆదేశాల మేరకు చెన్నై తీసుకెళుతున్నట్లు తెలిపారు. వీటిలో ఒమన్, కువైట్, అమెరికా దేశాలకు చెందిన సుమారు రూ.19 లక్షల విలువ చేసే కరెన్సీతో పాటు 55 గ్రాముల బంగారు బిస్కెట్ కూడా ఉండడం గమనార్హం. ఈ నగదుకు సంబంధించి ఎటువంటి బిల్లులు కానీ, సమాచారం కానీ వారి వద్ద లేకపోవడంతో విచారణ నిమిత్తం పోలీసులు స్వాధీనం చేసుకొని ఆదాయపన్ను శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన తడ ఎస్సై వెంకటేశ్వరరావు, ఇతర సిబ్బందిని అభినందించిన ఎస్పీ వారికి రివార్డులు అందచేశారు.



విలేఖర్ల సమావేశంలో తడ వద్ద పట్టుకున్న నగదును చూపి మాట్లాడుతున్న ఎస్పీ ఐశ్వర్య రస్తోగి

పోలవరానికి సందర్శకుల తాకిడి

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 23: బహుళార్ధ సాధక పోలవరం ప్రాజెక్టుకు నిర్మాణ దశలోనే తిలకించేందుకు సందర్శకుల తాకిడి ఎక్కువైంది. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన సందర్శకులతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు పర్యాటక ప్రాంతంగా మారింది. ప్రభుత్వం పనిగట్టుకుని మరీ విద్యార్థులు, రైతులు, డ్వాక్రా సంఘాలకు ఆతిధ్యమిచ్చి మరీ పోలవరానికి ఆహ్వానిస్తోంది. ఆర్టీసీకిదో ఆదాయంగా మారింది. దూర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులను, మహిళలను, డ్వాక్రా మహిళలను ప్రాజెక్టు వద్దకు తీసుకొచ్చి వారికి ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని ఆద్యంతం చూపించి అక్కడనే భోజనం పెట్టి మరీ సందర్శకులను సాగనంపుతున్నారు. ఇక్కడ సందర్శకులకు ప్రాజెక్టుపై వివరించేందుకు జల వనరుల శాఖకు చెందిన కొంత మంది అధికారులు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా భోజనాలు పెట్టేందుకు ప్రత్యేక కాంట్రాక్టు అప్పగించారు. ఈ పోలవరం ప్రాజెక్టుపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకించి విద్యార్థులు, రైతులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రంలోని పదమూడు జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు, రైతులు, స్వయంగా వచ్చిన వారితో కలిపి గత ఏడాది ఏప్రిల్ 23వ తేదీ నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు 330370 మంది సందర్శించారు. అమరావతి నుంచి 576 మంది, అనంతపురం జిల్లా నుంచి 5960 మంది, చిత్తూరు జిల్లా నుంచి 4868, తూర్పు గోదావరి జిల్లా నుంచి 7650 మంది, గుంటూరు నుంచి 56676 మంది, కడప 3934, కృష్ణా 178794, కర్నూల్ జిల్లా నుంచి 3513, నెల్లూరు నుంచి 1694, ప్రకాశం 8814, శ్రీకాకుళం జిల్లా నుంచి 3160, విశాఖపట్నం నుంచి 4230, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 20772, ఇతరులు, విద్యార్థులు కలిపి 12720 మంది వెరసి దాదాపు 3.50 లక్షల మంది వరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని సందర్శించారు. మొత్తం 241 రోజుల్లో 3,50,090 మంది సందర్శించారు. స్థానిక నాయకులు ప్రతీ వారం వారం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి డ్వాక్రా మహిళలను ప్రాజెక్టుకు తీసుకొచ్చి వారికి ప్రాజెక్టు ప్రత్యేకతను వివరించి భోజనాలు పెట్టి పంపిస్తున్నారు. ఇక్కడ భోజన ఏర్పాట్లను నిర్వహించేందుకు రూ. కోట్ల ఖర్చుతో కాంట్రాక్టు అప్పగించినట్టు తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ పోలవరం ప్రాజెక్టు పూర్తవకుండానే పర్యాటక ప్రాంతంగా మారిందని చెప్పొచ్చు. ముఖ్యమంత్రి పాల్గొనే సభల్లో కూడా డ్వాక్రా మహిళలు పోలవరం ప్రాజెక్టు వివరాలపై అనర్గళంగా మాట్లాడే విధంగా అవగాహన కల్పించడంలో టీడీపీ నాయకులు కృతకృత్యులయ్యారని చెప్పొచ్చు.

పవిత్ర క్షేత్రం తిరుమలపై అపనిందలా?

★ వెంకన్న సాక్షిగా ఆడిన మాట తప్పిన మోదీని ఆ స్వామే శిక్షిస్తాడు

★ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: ప్రపంచ వ్యాప్తంగా సుప్రసిద్ధమైన మహిమాన్విత క్షేత్రమైన తిరుమల తిరుపతి ప్రతిష్టను దెబ్బతీసి, తద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ కుట్రలు చేస్తోంటే, అందుకు ప్రతిపక్షమైన వైసీపీ సహాయ సహకారాలు అందించడం హేయమైన చర్య అని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య మండిపడ్డారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేఖర్లతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనాదరణ కోల్పోతున్న బీజేపీ ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఇటువంటి అపవిత్ర చర్యలకు పాల్పడుతోందన్నారు. తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా, తెలుగువారి ఆరాధ్యదైవంపై అపనిందలు వేయడం బీజేపీ నేతలకే చెల్లిందన్నారు. టీటీడీలో జరిగే ప్రతి కార్యాన్ని, చర్యను తప్పుపడుతూ, గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం, తిరుమలలపై బీజేపీ చేస్తున్న రాజకీయాలు ఎంత మాత్రం క్షమార్హం కాదన్నారు.

దేవుడిని అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్న బీజేపీకి ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని ఆనంద్ సూర్య హెచ్చరించారు. గతంలో వైఎస్ అధికారంలో ఉన్నప్పుడు స్వామి వారికి ఏడు కొండలు లేవు, రెండు కొండలే ఉన్నాయంటూ తిరుమల పవిత్రత మంటగలిపేలా జీవో ఇచ్చినప్పుడు బీజేపీ నేతలంతా ఏం చేశారని ఆయన నిలదీశారు.

కేంద్ర పురావస్తుశాఖ ఏదో లేఖ ఇచ్చిందనే సాకుతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బీజేపీ నేతలు కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా, వైసీపీ సూచనలు తూచా తప్పకుండా పాటిస్తూ గవర్నర్‌కు తప్పుడు ఫిర్యాదు చేశారని ఆనంద్ సూర్య స్పష్టం చేశారు. వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ఇచ్చిన అనేక హామీలను విస్మరించి ఆడిన మాట తప్పిన మోదీని ఆ స్వామివారే తగిన విధంగా శిక్షిస్తారని ఆయన తెలిపారు.

అమరావతిలో బైబిల్ మ్యూజియం

సహకరిస్తామన్న మంత్రి నక్కా

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: రాజధాని అమరావతి ప్రాంతంలో బైబిల్ మ్యూజియం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు హామీ ఇచ్చారు. వెలగపూడి సచివాలయంలో మంత్రిని బుధవారం కొంతమంది క్రైస్తవ మతపెద్దలు కలిసి మ్యూజియం నమూనాలను చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 10రోజుల్లో డిజైన్లు ఖరారు చేసి టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఈ మ్యూజియంలో బైబిల్‌లోని ప్రముఖ చారిత్రక ఘటనలు వివరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మ్యూజియంలో వనం, నోవోక్షగ, మంద సభ పెట్టే వంటి వాటి నమూనాలు ఏర్పాటు చేయాలని మంత్రికి మతపెద్దలు తెలిపారు. కోల్‌కతా సిరంపూర్ వర్సిటీ తరహాలో అమరావతిలో కూడా వర్సిటీ ఏర్పాటుకు 3 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఎం.జోసఫ్ ఇమ్మానియేల్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నక్కా ఆనందబాబుతో సమావేశమైన క్రైస్తవ మతపెద్దలు

ఆర్టీసీలో సమ్మె సైరన్

- ఫిబ్రవరి 6వ తేదీ నుంచి నిరవధిక సమ్మె
- 25 నుంచి దశల వారీ సమ్మెకు సన్నాహాలు
- ప్రస్తుతానికి ఎన్‌ఎంయూ దూరం
- ఆర్టీసీ పరిరక్షణే ధ్యేయం: ఎండీ సురేంద్రబాబు



ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: అపరిష్కృత డిమాండ్ల సాధన కోసం ఏపీఎస్ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఫిబ్రవరి 6వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు గుర్తింపు యూనియన్ ఈయూ సహా ఎనిమిది కార్మికసంఘాలు ప్రకటించాయి. గుర్తింపు సంఘం ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో సమ్మెకు దిగాలని నిర్ణయించారు. ఇక ఆర్టీసీలో అతి పెద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ మాత్రం ప్రస్తుతానికి సమ్మెలో పాల్గొనేందుకు సంసిద్ధత తెలుపనప్పటికీ వెలుపల నుంచి సంఘీభావం తెలుపుతామని సంఘ ఉపాధ్యక్షుడు డీ సూర్య ప్రకాశరావు ఆంధ్రభూమి ప్రతినిధికి తెలిపారు. ఇక నిరవధిక సమ్మెలో భాగంగా జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు కో కన్వీనర్ సీహెచ్ సుందరరావు, వై వరహాల నాయుడు, ఈయు రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు ఈ నెల 25వ తేదీ నుంచి తాము చేపట్టబోయే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలను వెల్లడించారు. రాష్ట్రంలోని 128 డిపోలు, జోనల్ వర్క్ యూనిట్ల వద్ద 25వ తేదీ నుంచి సమ్మె సన్నాహక ధర్నాలు జరుగుతాయన్నారు. 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విధులకు హాజరయ్యే కార్మికులందరూ తమ డిమాండ్లతో కూడిన నల్లబాడ్జీలు ధరిస్తారు. 28న రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క రోజు సామూహిక నిరహారదీక్షలు, 30వ తేదీ 13 జిల్లాల రీజనల్ మేనేజర్ కార్యాలయాల వద్ద భారీ ఎత్తున ధర్నాలు జరుగుతాయని, అదే రోజున తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని జేఏసీ నేతలు తెలిపారు. ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఎంవి టాక్స్‌ను రద్దు చేయాలని, నష్టాలను ప్రభుత్వమే భరించాలని, ప్రజా అవసరాల కనుగుణంగా మరో వెయ్యి బస్సులను రోడ్డెక్కించాలని, 21 నెలలుగా జాప్యం జరుగతున్న వేతనాల సవరణ 50 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు చేయాలని, కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ తక్షణం రెగ్యులర్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులందరినీ తక్షణం రెగ్యులర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ బకాయిలను తక్షణం చెల్లించాలని, ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 నుంచి 60కు పెంచాలని, మహిళా కండక్టర్‌లకు కార్గోలో పని చేసే అవకాశం కల్పించాలని కోరారు. అద్దె బస్సు డ్రైవర్‌లు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసీపీ మజ్దూర్ యూనియన్ నాయకులు సీబీఎస్ రెడ్డి, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నేతలు జీ శ్రీనివాస్, ఓస్వా నేత ఎంవీ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాతే..

ఇప్పటికే నష్టాల ఊబిలో ఉన్న ఆర్టీసీని పరిరక్షించడమే తన ముందున్న ఏకైక లక్ష్యంగా సంస్థ ఎండీ ఎన్‌వీ సురేంద్రబాబు ఆంధ్రభూమి ప్రతినిధితో అన్నారు. ఎన్ని కష్టనష్టాలు ఉన్నప్పటికీ తక్షణం 20 శాతం ఐఆర్‌కు తాను అంగీకరించానని అన్నారు. ఇక ముఖ్యమంత్రితో చర్చించిన పిదప పెంపు విషయం ఆలోచిస్తామన్నారు.


విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న సినీనటి, టీడీపీ నాయకురాలు దివ్యవాణి

పల్లెపల్లెకూ టీడీపీ సంక్షేమ పథకాల ప్రచారం

★ సినీనటి, పార్టీ నాయకురాలు దివ్యవాణి

గుంటూరు, జనవరి 23: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో ఏపీ అభివృద్ధి పథాన ముందుకు దూసుకెళ్తోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పల్లె పల్లెకు ప్రచారం ప్రచారం చేస్తామని సినీనటి, టీడీపీ నాయకురాలు దివ్యవాణి పేర్కొన్నారు. బుధవారం గుంటూరులోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆమె విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. సుభాష్ చంద్రబోస్ పుట్టిన రోజునే మంత్రి నారా లోకేష్ పుట్టడం సంతోష దాయకమన్నారు. చిన్న వయస్సులోనే మంత్రి పదవి చేపట్టి తనదైన శైలిలో తండ్రికి తగ్గ తనయుడుగా పరిపాలనలో పాలు పంచుకుంటున్నారన్నారు. చంద్రబాబునాయుడు, లోకేష్‌లు రాష్ట్ర అభివృద్ధి కోసం కష్టపడుతుంటే కొంత మంది కక్షపెంచుకుని రాజకీయ విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందుతున్నాయని, చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ మరలా అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ దేశంలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చంద్రబాబు తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. అనుభవజ్ఞుడైన చంద్రబాబు నాయుడు తిరిగి అధికారంలోకి వచ్చి ప్రజలకు సుపరిపాలన అందించేందుకు తమవంతుగా కృషిచేస్తామని దివ్యవాణి తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో త్వరలో రాహుకాల ప్రత్యేక పూజలు


విజయవాడ (ఇంద్రకీలాద్రి) జనవరి 23: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మ సన్నిధిలో త్వరలో' రాహుకాల ప్రత్యేక' పూజలను ప్రవేశపెట్టేందుకు దేవస్థానం ఈవో వీ కోటేశ్వరమ్మ ప్రణాళికను సిద్ధం చేశారు. ఇప్పటికే శ్రీకాళహస్తి, గుంటూరు జిల్లా కాకాని, తదితర దేవస్థానాలు రాహుకాల ప్రత్యేక పూజలకు ప్రసిద్ధి కెక్కాయి. ఈ నేపథ్యంలో దుర్గమ్మవారి సన్నిధిలో కూడ ఈప్రత్యేక పూజలను ప్రవేశ పెట్టాలని నిర్ణయం తీసుకున్న ఈవో.. దేవస్థానం స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు, తదితరులతో ఇప్పటికే రెండు సార్లు సమీక్ష నిర్వహించారు. ఈప్రత్యేక పూజలను చండీయాగం తరహాలో అమ్మవారి సన్నిధిలో ప్రతిరోజు రాహుకాల సమయంలోనే నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. రాహుకాల పూజలో అమ్మవారు, సరస్వతి, సుబ్రహ్మణ్యం స్వామి, సర్పసూక్తం, తదితర పూజలను నిర్వహించటంతోపాటు విధిగా జంటనాగులకు కూడ ప్రత్యేక అమ్మవారి సన్నిధిలో ఇప్పటికే ఈవో కోటేశ్వరమ్మ నూతనంగా ప్రవేశ పెట్టిన పలు ఆర్జిత సేవలు భక్తుల ఆదరణ పొందుతున్నాయి.

రామాయపట్నం పోర్టులో జేఎస్‌డబ్ల్యూ పెట్టుబడులు

★ మంత్రి లోకేష్ సమక్షంలో ఒప్పందం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: రాష్ట్రంలోని రామాయపట్నం పోర్టు అభివృద్ధిలో జిందాల్ సౌత్ వెస్టు (జెఎస్‌డబ్ల్యూ) గ్రూపు భాగస్వామి కానుంది. దాదాపు 3500 కోట్ల రూపాయలను పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈమేరకు దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో మంత్రి లోకేష్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. రామాయపట్నం పోర్టులో రెండు జెట్టీల అభివృద్ధికి 1000 కోట్ల రూపాయలను పెట్టుబడి పెట్టనుంది. పోర్టు నుంచి స్లర్రీ పైపులైను ఏర్పాటుకు జేఎస్ డబ్ల్యు సంస్థ 2500 కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతుంది. దీని వల్ల ప్రత్యక్షంగా 215 మందికి ఉపాధి లభిస్తుంది. రానున్న కాలంలో పోర్టు సమీపంలో ఉక్కు కర్మాగారం, అపెరల్ పార్కు ఏర్పాటుకు కూడా సుముఖత వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మంత్రి ఏపీలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు వివరించారు. దీనిపై జేఎస్ డబ్ల్యు సంస్థ చైర్మన్ సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ తమ బృందం ఇప్పటికే అనేక సార్లు ఏపీలో పర్యటించిందని తెలిపారు. తమ బృందం ఎప్పుడు తనతో మాట్లాడినా ఏపీ గురించే మాట్లాడుతున్నారని తెలిపారు. టెక్నాలజీ వినియోగంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఒక ప్రభుత్వం టెక్నాలజీ సహాయంతో రియల్ టైమ్ గవర్నెన్సు అమలు చేయడం తానెక్కడా చూడలేదన్నారు. పరిశ్రమలు నెలకొల్పడానికి ఏపీ పాలసీలు అనుకూలంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా చూడాలని అనుకుంటున్నానని చెప్పారు. త్వరలోనే ఏపీకి వస్తానని, కియా గురించి తెలుసుకున్నానన్నారు. అతి తక్కువ సమయంలో ఏపీలో అనుమతులు, మౌలిక సదుపాయాలు, రాయితీలు కల్పిస్తున్నారన్నారు. తమ బృందం ఏపీ అధికారుల స్పీడ్ గురించి చెబుతున్నారన్నారు. సింగపూర్, లక్సంబర్గ్ తరహాలో పన్ను విధానం మన దేశంలో ఉంటే దేశం మరింతగా పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆయా దేశాల్లో పెట్టుబడి, కల్పించే ఉద్యోగాల ఆధారంగా పన్నులు, రాయితీలు కల్పిస్తున్నారన్నారు.


మంత్రి లోకేష్ సమక్షంలో ఒప్పందం కుదుర్చు కుంటున్న జేఎస్‌డబ్ల్యూ సంస్థ

పాలనలో విప్లవాత్మక మార్పులు అవసరం

పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రి లోకేష్ అభిప్రాయపడ్డారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో మేకింగ్ డిజిటల్ గవర్నెన్సు వర్కు, ఇండియా 4.0 మేకింగ్ టెక్నాలజీ వర్క్ ఫర్ ఆల్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే వీలు ఉంటుందన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలు, వివిధ సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే అవసరం లేకుండా రియల్ టైమ్ గవర్నెన్సు ఉపయోగపడుతుందన్నారు. ఏపీలో ప్రభుత్వం కనిపించకుండా కేవలం పాలన మాత్రమే కనిపించే వ్యవస్థ తీసుకురావాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఏపీలో భారీగా టెక్నాలజీ వినియోగిస్తున్నామని, కాగిత రహిత పాలన, ఈ-గవర్నెన్సు, రియల్ టైమ్ గవర్నెన్సు అమలు చేస్తున్నామన్నారు. 4వ పారిశ్రామిక విప్లవం వల్ల ఉద్యోగాలు పోతాయన్న అపోహ ఉందని, కానీ ప్రతి పారిశ్రామిక విప్లవం తరువాత ఉద్యోగాలు పెరుగుతున్నాయని గుర్తు చేశారు. మహిళలకు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

కుంభకోణాలే జగన్ నవరత్నాలు

★ కాపీ కొట్టామనడంపై యనమల ఆగ్రహం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: కుంభకోణాలే వైకాపా అధినేత జగన్ నవరత్నాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ఎద్దేవా చేశారు. నవరత్నాలను తాము కాపీ కొట్టామనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ నేరాలను కాపీ కొట్టడం ఎవరి తరమూ కాదని, హార్వర్డ్ వర్సిటీలో జగన్ అవినీతి ఒక పాఠ్యాంశంగా ఉందని ఆరోపించారు. అవి నవరత్నాలు కావని, అష్టావక్ర దోపీడీలని, ఎమ్మార్ కుంభకోణం, టైటానియం, వోక్స్ వ్యాగన్, మద్యం, ముగ్గురాయి, బాక్సైట్, ఇనుప ఖనిజం, వాన్‌పిక్, లేపాక్షి, జలయజ్ఞం వంటివి ఒక్కో రత్నాలంటూ వ్యాఖ్యానించారు. లక్ష కోట్ల రూపాయలు, 13 చార్జి షీట్లు, 16 నెలల జైలు తప్ప జగన్ సాధించిదేముందని ప్రశ్నించారు. పింఛన్లను 10 రెట్లు పెంచిన పార్టీ టీడీపీ అని, రైతుల ఆత్మగౌరవం పెంచామని తెలిపారు. పేదలకు పింఛన్లు ఇస్తే, వైకాపా నిందిస్తోందని, కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, ఆటోలకు పన్ను తొలగిస్తే విమర్శిస్తున్నారన్నారు.

ఈవీఎంలపై అనుమానాలను ఈసీ నివృత్తి చేయాలి

★ ఎంపీ కనకమేడల డిమాండ్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: ఈవీఎంలపై వస్తున్న అనుమానాలను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నివృత్తి చేయాలని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర వ్యాఖ్యానించారు. ఉండవల్లిలో ప్రజావేదిక వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈవీఎంలపై చర్చ జరుగుతోందన్నారు. బ్యాలెట్ పేపరు విధానం తీసుకువస్తే ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. దేశంలో అన్ని విపక్షాలు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని గుర్తు చేశారు. 120 దేశాల్లో ఎన్నికల్లో బ్యాలెట్ పేపరే వాడుతున్నారన్నారు. టెక్నాలజీ అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం బ్యాలెట్ వినియోగిస్తున్నారన్నారు. తెలంగాణలో 31 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడా వచ్చిందన్నారు. మధ్యప్రదేశ్‌లో కూడా ఈ విధంగా ఓట్లు తేడా వచ్చాయన్నారు. బీజేపీ నేతలు అద్వాణీ, జీవీఎల్ నరసింహారావుగతంలో ఈవీఎంలను వ్యతిరేకించి, బ్యాలెట్ పేపరు కావాలని డిమాండ్ చేశారంటూ, జీవీఎల్ దీనిపై రాసిన పుస్తకానికి అద్వాణీ ముందు మాట రాశారని గుర్తు చేశారు. ఈసీ ఒక రాజకీ పార్టీలాగా మాట్లాడటం సరికాదన్నారు. ఈవీఎంలపై ఈసీ తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. ఈవీఎంల హ్యాకింగ్ చేసి చూపించే వారిని ఈసీ అరెస్టు చేయిస్తోందని ఆరోపించారు. ఈవీఎంలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య రక్షణకు బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరపాలన్నారు. బ్యాలెట్ విధానానికి టీడీపీ మొదటి నుంచి కట్టుబడి ఉందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ గతంలో ఒక కమిటీ వేసి, రాష్ట్రానికి 75 వేల కోట్ల రూపాయలు రావాలన్నారని గుర్తు చేశారు. రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాయంపై పోరాటం చేయాలని పిలుపునిస్తున్నామన్నారు. అందరినీ కలుపుకుని పోరాటం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారని, ఇంకా పొత్తులు ఖరారు కాలేదన్నారు. కలిసి వచ్చే పార్టీలతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్

కాపుల చెవుల్లో బాబు పూలు

★ వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నేత అంబటి రాంబాబు

విజయవాడ(సిటీ), జనవరి 23: కేంద్రం అగ్రవర్ణాలలోని పేదలకు ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకు అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాపులను మరోసారి మోసం చేస్తున్నారని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు విమర్శించారు. ఎన్నికల జిమ్మిక్కుల్లో భాగంగా చంద్రబాబు కాపుల నోట్లో స్వీట్లు.. చెవిలో పూలు పెడుతున్నారన్నారు. నగరంలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలలోని పేదల కోసం కేంద్రం ప్రవేశ పెట్టిన పదిశాతం రిజర్వేషన్లలో కాపులకు ఐదు శాతం అని ప్రకటించడంలో ఆంతర్యం ఏమిటన్నారు. అవగాహన లేకుండా బాబు మరోసారి కాపులను బుట్టలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది సాధ్యపడే అంశం కాకపోయినా, కేంద్రం, వైకాపా అడ్డుకుంటున్నాయని వక్రీకరించి చెబుతూ కాపులను మోసం చేయడానికి బాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాపులను బీసీల్లో చేరుస్తామనే హామీతో అధికారంలోనికి వచ్చి మంజునాథ కమిషన్ వేసి అసెంబ్లీలో కాపులను బీసీ ఎఫ్‌గా ప్రకటించి స్వీట్లు పంచారన్నారు. సంబరాలు చేసిన బాబు ఇప్పుడు అదంతా మోసం అని ఒప్పుకోవాలన్నారు. బాబు చేస్తున్న మోసాన్ని తెలుసుకోలేని స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. కాని బాబు వద్ద ఉన్న గంగిరెద్దు నేతలు మాత్రం తలకాయలు ఉపారే తప్ప, ఇది మోసం అని ఎవరూ ప్రశ్నించలేదన్నారు. కేంద్రం అగ్రవర్ణాలలో పేదలకోసం నిర్ణయం తీసుకుంటే, ఆ నిర్ణయానికి మెలిక పెట్టి ఏదో ఒకటి చెబితే ఈలోపు ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది, కాపుల ఓట్లు కొల్లగొట్టవచ్చనేది బాబు ఎత్తుగడ అన్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, కొత్తగా అనేక హామీలను మాత్రం ఇస్తున్నారని అన్నారు. బీసీలకు 100 వాగ్దానాలు చేసిన చంద్రబాబుకు అందులో ఒక్కటైనా నెరవేర్చానని చెప్పే ధైర్యముందా అని ప్రశ్నించారు.

శివమాల ధరించి స్కూల్‌కు రావొద్దు

పీఈటీ ఆదేశం ★ తల్లిదండ్రుల ఆగ్రహం


శివమాల ధరించిన విద్యార్థులు ఎల్లీశ్వరయ్య, జగదీష్

ఆత్మకూరు, జనవరి 23: శివమాల ధరించిన ఇద్దరు విద్యార్థులను బడికి రావొద్దని హుకుం జారీ చేశాడు ఓ ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు. టీచర్ తీరుపై పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటన కర్నూలు జిల్లా ఆత్మకూరులో బుధవారం జరిగింది. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎల్లీశ్వరయ్య, 6వ తరగతి చదువుతున్న జగదీష్ ఇటీవల శివమాల ధరించారు. ప్రతిరోజు పాఠశాలకు వచ్చి చదువుకునేవారు. ఈ క్రమంలో వీరిద్దరూ బుధవారం పాఠశాలకు రాగా వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ అడ్డుకున్నారు. మాల ధరించి బడికి రావద్దంటూ హుకుం జారీ చేశాడు. దీంతో ఆ చిన్నారులిద్దరూ విషయాన్ని వారి తల్లిదండ్రులకు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని పీఈటీ తీరుపై ప్రధానోపాధ్యాయుడు సుక్రునాయక్‌ను నిలదీశారు. శివమాల ధరిస్తే పాఠశాలకు ఎందుకు రానివ్వడం లేదని ప్రశ్నించారు. అలా రాజ్యాంగంలో ఏమైనా రాసి ఉందా అంటూ ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. దీనిపై ఆయన స్పందిస్తూ పీఈటీని విచారిస్తామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

కాలుష్య రహిత రాష్ట్రం ప్రభుత్వ లక్ష్యం

దక్షిణ భారతదేశంలోనే ఇది తొలి ఆధునిక క్షేత్రియ ప్రయోగశాల ★ మంత్రి శిద్దా రాఘవరావు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 23: కాలుష్య రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అటవీ, పర్యావరణ శాఖామంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. విశాఖలోని మర్రిపాలెం వద్ద రూ.20 కోట్ల వ్యయంతో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ఆధునిక క్షేత్రియ ప్రయోగశాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ దేశంలో ఇటువంటి ప్రయోగశాలలు కేవలం మూడు మాత్రమే ఉన్నాయని, ఇందులో రెండు ఉత్తర భారతదేశంలో ఉండగా, మూడోది విశాఖలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రయోగశాలలో వివిధ కాలుష్య కారకాలను అత్యంత సూక్ష్మ పరిమాణంలో విశ్లేషించవచ్చన్నారు. గాలి, నీటి స్వచ్ఛత విశ్లేషణకు, వాటి కాలుష్యకారక మూలాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించడానికి ఈ ఆధునిక ప్రయోగశాల ఉపయోగపడుతుందన్నారు. పరిశ్రమల ద్వారా ఏ విధమైన కాలుష్య సమస్యలు తలెత్తకుండా నూతనంగా ఆధునీకరించిన ఈ ప్రయోగశాలలో డయాక్సిన్స్, ఫ్యూరాన్స్, పీసీఐలు, పీఏహెచ్‌లు, అస్థిర కర్బన సమ్మేళనాలు (వీఓసీఎస్) అత్యంత సూక్ష్మ పరిమాణంలో భార లోహాలు, పురుగు మందుల అవశేషాలు, పాదరసరం, యాంటీ బయాటిక్స్, ఎబ్జార్బబుల్ ఆర్గానికి హేలైడ్స్, కార్బన్, నైట్రోజన్, సల్ఫర్, టోటల్ ఆర్గానిక్ కార్బన్, ఎక్స్‌రే ఫ్లోరోసిస్, విషపూరిత కాలుష్య కారకాల అధ్యయనాలు, అత్యంత సూక్ష్మ పరిమాణంలో నీటిలో ఉండే అయాన్లు, గాలిలో ఉండే సూక్ష్మరేణువులను దీని ద్వారా విశ్లేషించవచ్చన్నారు. త్వరలో అనంతపురం, కడప, ఒంగోలు, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనివల్ల ఎక్కడికక్కడ కాలుష్య నియంత్రణ సాధ్యపడుతుందన్నారు. అవగాహన పెంచేందుకుగాను కాలుష్య మొబైల్ వ్యాన్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు.


అత్యాధునిక ప్రయోగశాలను పరిశీలిస్తున్న మంత్రి శిద్దా రాఘవరావు

పచ్చదనం-పర్యావరణ రక్షణ అనే అంశాలపై అవగాహన పెంచుకోవాల్సి ఉందని, దీనిని సమష్టి బాధ్యతగా తీసుకోవాలన్నారు. మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలుష్యం నుంచి ఎప్పటికపుడు కాపాడుకోవడమనేది జీవన విధానంలో ఒక భాగం కావాలన్నారు. ఇందుకోసం సామాజిక ఉద్యమం అవసరమన్నారు. ఒకపుడు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, పోర్టుట్రస్టుల నుంచి కాలుష్య సమస్యలు తీవ్రంగా ఉండేవని, దీనివల్ల ప్రజలు భయపడేవారన్నారు. అటువంటిది కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు తీసుకున్న అనేక చర్యలు ఫలితాలనిస్తున్నాయని, అయినా ఇంకా తగ్గాల్సి ఉందన్నారు. మొబైల్ వ్యాన్లను మంత్రులు రాఘవరావు, శ్రీనివాసరావు పచ్చజెండా ఊపీ ప్రారంభించారు.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

గురువారం, 24 జనవరి 2019

హరిత వైరుధ్యం..

ప్రకృతిని పరిరక్షించే పథకాలు, పరిసరాలను పాడుచేసే పనులు సమాంతరంగా కొనసాగుతుండడం విధానాలలో నిహితమై ఉన్న వైరుధ్యాల ఫలితం. ప్రకృతి పట్ల ప్రత్యేకించి పుడమి పట్ల సహజమైన మమకారం సన్నగిల్లిపోవడం ఇందుకు కారణం. సహజత్వం స్థానంలో కృత్రిమ తత్త్వం గూడుకట్టుకుని ఉండడం. అందువల్ల ప్రకృతిని, పరిసరాలను పరిరక్షించాలన్న విధానం నినాదాలకు పరిమితమైపోయింది. ఒకవైపున మొక్కలు నాటుతుండడం మరోవైపున 'అభివృద్ధి' పేరుతో వృక్షాలను తెగ నరుకుతుండడం- ఇదీ ప్రభుత్వ నిర్వాహకుల విధానంలోని వైరుధ్యం! వివిధ రాష్ట్రాలలో అడవులను పెంపొందించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం 'బృహత్ నిధి'ని ఏర్పాటుచేసి ఉంది. 'అభివృద్ధి'- డెవలప్‌మెంట్- పేరుతో జరుగుతున్న 'అటవీ నిర్మూలన'కు పరిహార ప్రక్రియను సాగించడానికై కేంద్రం ఈ నిధిని ఏర్పాటు చేసింది. 'అటవీ సమతుల్య పరిరక్షణ'కు ఈ నిధిని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చుపెట్టవలసి ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'అటవీ సమతుల్య రక్షణ నిధి నిర్వాహక, సంయోజక మండలి'- కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ- 'కాంపా'- వారు వివిధ రాష్ట్రాలకు యాబయి వేల కోట్ల రూపాయల నిధిని కేటాయించారు! దేశంలోని వివిధ ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా పెంచుతున్న, పెంచనున్న అడవుల కయ్యే ఖర్చులో తొంబయి శాతం ఇలా కేంద్ర ప్రభుత్వం భరిస్తోంది. ఇదంతా భారతభూమి హరిత శోభలను పెంపొందించడానికి జరుగుతున్న కృషి అన్నది హర్షదాయకం! కానీ ఈ 'ఆనందం' పక్కనే అటవీ హనన, హరిత నిర్మూలన వైపరీత్యం కూడ పొంచి ఉంది. సవరించిన 'తీరప్రాంత అభివృద్ధి నియంత్రణ ప్రాంగణం'- కోస్టల్ రెగ్యులేషన్ జోన్- సిఆర్‌జెడ్- నియమావళిని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ కొత్త నియమావళి ప్రకారం సముద్రతీర ప్రాంతంలో చెట్లను నరికివేయడం, అడవులను నిర్మూలించడం మరింత సులభం. 'అభివృద్ధి'పేరుతో జరిగిపోతున్న హరిత హననానికి ఈ కొత్త నియమావళి కొత్త ఊపు! కేంద్ర ప్రభుత్వ 'పర్యావరణ పరిరక్షణ అనుమతి'తో నిమిత్తం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక, వాణిజ్య, పర్యాటక, పారిశ్రామిక ప్రాంగణాలను ఏర్పాటు చేయడం, వందల వేల ఎకరాల భూమిని ప్రభుత్వేతర సంస్థలకు కేటాయించడం ఇకపై మరింత సులభం! హరిత పరిరక్షణ నిబంధనలను అతిగా పాటించడం వల్ల అభివృద్ధి ఆగిపోతున్నదని 2011 ఫిబ్రవరి మూడవ తేదీన ఢిల్లీలో జరిగిన 'నిరంతర ప్రగతి'- సస్టయినబుల్ డెవలప్‌మెంట్- సదస్సులో అప్పటి ప్రధానమంత్రి మన్‌మోహన్‌సింగ్ చేసిన ప్రకటన. ఈ చారిత్రక ప్రకటనకు అనుగుణంగానే 'హరిత పరిరక్షణ' నియమాలను అతిగా పాటించిన జయరామ్ రమేశ్ అనే 'పర్యావరణ, అటవీశాఖ' మంత్రికి బదిలీ జరిగిపోయింది. నిజానికి ఆ చారిత్రక ప్రకటన మన్‌మోహన్‌సింగ్ నోటి వెంట వెలువడిన 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థల' మాట! తమలపాకు తోటలు, మామిడి తోటలు, అరటి తోటలు 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థల' ప్రగతి గొడ్డళ్లకు బలికావడం ఆ చారిత్రక ప్రకటన తరువాత ఊపందుకున్న పరిణామం. కూరగాయల మొక్కలు, వరి పొలాలు అదృశ్యమైపోయి 'సిమెంటు' భవనాలు, ఇనుప కంచెలు అవతరించడం ఆ చారిత్రక ప్రకటన ఫలితం..

మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం రూపొందించిన ఈ 'అంతర్గత వైరుధ్య హరిత విధానం'- పది మొక్కలు నాటడం.. పదహైదు చెట్లను కొట్టివేయడం- ఇప్పటికీ కొనసాగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మాత్రమే కాదు దేశంలోని దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడ ఇలా 'సమదృష్టి'ని వహించి ఉండడం నడుస్తున్న చరిత్ర. మొక్కలు నాటడం ఒకవైపు, అడవులను పంట పొలాలను నిర్మూలించగల 'పెట్టుబడి' సదస్సులు మరోవైపు. విదేశీయుల నుంచి పెట్టుబడులను సమకూర్చుకోవాలన్న తహతహ రాష్ట్ర ప్రభుత్వాలకు దీటుగా కేంద్ర ప్రభుత్వం నిర్వాహకులలో సైతం తాండవిస్తోంది. సముద్ర తీర ప్రాంతాలలో ప్రగతి పేరుతో కాలుష్యాన్ని కేంద్రీకరించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం నియమావళిని సవరించడం ఈ 'తహతహ'లో భాగం. నియమావళికి విరుద్ధంగా సముద్ర తీర ప్రాంతంలో ఇప్పటికే వేలకొలదీ ఇళ్ల నిర్మాణం జరిగింది. ఈ అంతస్థుల భవంతులు వాణిజ్య కార్యాలయాలుగా, పర్యాటకులకు 'విడిది కేంద్రాలు'గా మారి ఉన్నాయి. దీనివల్ల రెండు విపరిణామాలు సంభవించాయి. మొదటిది- ఈ ప్రాంతాలలో ఆకుపచ్చదనం హననమైంది, రెండవది- పర్యాటక కేంద్రాల ప్రాంగణాలు, పారిశ్రామిక వాణిజ్య వాటికలు 'ప్లాస్టిక్' వ్యర్థాలకు ఆలవాలం అయ్యాయి. దేశంలో ప్రతిరోజు ఇరవై ఆరువేల టన్నుల 'ప్లాస్టిక్' సంచులను, ఇతర పదార్థాలను వినియోగిస్తున్నారట! ఇందులో అరవై శాతం మాత్రమే చెత్తకుండీలకు, చెత్తదిబ్బల వాటికలకు చేరుతోంది. నలబయి శాతం 'ప్లాస్టిక్' పడినచోటనే పదిలంగా ఉంటోందట! పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక వాటికలు ఇలా 'ప్లాస్టిక్'ను పదిలం చేస్తున్నాయి! ఈ 'ప్లాస్టిక్' వ్యర్థాలు పరిసరాల హరిత శోభలకు వికృతమైన కన్నాలు.

తెలంగాణ ప్రభుత్వం 'హరిత హారం' పేరుతో వందల కోట్ల మొక్కలను నాటే కార్యక్రమాన్ని అమలు జరుపుతోంది. 'కాంపా' నిధి నుంచి తెలంగాణలో అటవీ అభివృద్ధికి రెండువేల ఐదు వందల కోట్ల రూపాయలు లభించనుండడంతో 'హరితహారం' మరింత విస్తరించనున్నదట! మొక్కలను పెంచడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలో అగ్రగామిగా ఉందన్నది జరుగుతున్న ప్రచారం. అక్రమంగా అడవుల నరికివేత కార్యక్రమం కొనసాగుతుండడం సమాంతర విపరిణామం! టేకు దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న ఒక ముఠాను సోమవారం నిర్మల్ జిల్లా పోలీసులు నిర్బంధించడం ఒక ఉదాహరణ మాత్రమే! ఈ 'కలప దొంగల' ముఠాలో నిజామాబాదు నగర పాలక సంస్థ ఉపాధ్యక్షుడు, 'మజ్లిస్ ఇత్తెహాదులు ముస్లిమీ' నాయకుడు ఫహీమ్ కూడా ఉన్నట్టు పోలీసులు ఆరోపించడం రాజకీయ నేరప్రవృత్తికి మరో నిదర్శనం! 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని విస్తీర్ణంలో సగం అటవీ మాయం కాగలదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి ఉంది. కానీ 'అమరావతి' నిర్మాణానికి సేకరించిన వేల ఎకరాల భూమిపై 'మొక్క' మిగలలేదన్నది జరుగుతున్న సమాంతర ప్రచారం. 'ఎఱ్ఱచందనం' వృక్షాలను నరికివేసి కలపను విదేశాలకు తరలిస్తున్న ముఠాలను నిర్మూలించలేక పోవడం ప్రభుత్వ వైఫల్యం! ఈ ఎఱ్ఱచందనం కలప అత్యధిక శాతం చైనాకు అక్రమంగా తరలిపోతోంది! చైనా ప్రభుత్వం ఈ దొంగ రవాణాను ప్రోత్సహిస్తోంది. అలాంటి చైనా సంస్థల పెట్టుబడుల సాధన కోసం తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు పోటీపడుతుండడం అంతర్గత విధాన వైరుధ్యం!

అడవి అంటే కేవలం వృక్షజాలం కాదు, అడవి జీవ జాలం! జంతుజాలం, వృక్ష జాలం, విహంగ సమూహం అడవులలో భాగం! ఆవు పొదుగు నుండి పాలను పిండుకున్నట్టు అడవి నుంచి ప్రాకృతిక సంపదను దండుకొనడం భారతీయ జీవన విధానం. ప్రకృతిని పరిరక్షించడం ద్వారా మానవ జీవన ప్రగతిని, సుగతిని సాధించడం తరతరాల భారతీయుల స్వభావం.. కానీ ప్రకృతిని కొల్లగొట్టడం ద్వారా ధ్వంసం చేయడం ద్వారా మానవులు ప్రగతిని సాధించగలరన్న భ్రాంతిని విదేశీయ దురాక్రమణదారులు కలిగించి వెళ్లారు. అటవీ హననానికి కొనసాగుతున్న ఈ 'భ్రాంతి' కారణం! 1942లో బ్రిటన్ వ్యతిరేక 'క్విట్ ఇండియా' ఉద్యమం సాగిన కాలంలో శ్రీరామ్ అన్న ఉద్యమకారుడు పడమటి కనుమలలోని అరణ్యాలలో చెట్లను నరికివేస్తున్న ఒక వ్యాపారిని ఎదిరించాడు. ఆ కలపను బ్రిటన్‌కు ఇతర దేశాలకు తరలించరాదని శ్రీరామ్ వాదించాడు. దురాక్రమణదారుని యుద్ధ ప్రయోజనాల కోసం లేత చెట్లను నరికివేయడం అమానుషమని వ్యాపారికి హితవుచెప్పాడు. ఆ వ్యాపారి తానుకూడ దేశభక్తుడననీ మహాత్మాగాంధీ ఉద్యమ నిధికి ఐదువేల రూపాయల విరాళం ఇచ్చానని శ్రీరామ్‌కు తెలిపాడు. 'బ్రిటన్ ప్రభుత్వం వారి యుద్ధ నిధికి ఎంత విరాళం ఇచ్చావు?'అన్నది శ్రీరామ్ ప్రశ్న. 'యుద్ధ నిధికి ఐదువేల రూపాయల విరాళం ఇచ్చాను..'అన్నది వ్యాపారి సమాధానం! ఈ 'సమదృష్టి'గురించి 'వెయిటింగ్ ఫర్ ది మహాత్మా'- మహాత్ముని అనుమతి కోసం- అన్న తన ఆంగ్ల నవలలో ప్రసిద్ధ రచయిత ఆర్‌కె నారాయణ్ వివరించాడు! ఈ 'సమదృష్టి' ప్రస్తుతం మన ప్రభుత్వాలకు ఏర్పడి ఉంది.. అటవీ పరిరక్షణ పట్ల, ఆకుపచ్చదనాన్ని హరించివేస్తున్న 'కృత్రిమ అభివృద్ధి' పట్ల సమదృష్టి..


కాంగ్రెస్ లేకుండా 'కాషాయం'పై పోరు ఎలా?

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో ఇటీవల కోల్‌కతలో జరిగిన మహార్యాలీలో విపక్ష పార్టీల డొల్లతనం మరోసారి బహిర్గతమైంది. ఈ ర్యాలీలో నేతల ప్రసంగాల తీరు చూస్తే- 'బీజేపీ మతతత్వ విధానాలను భరిస్తాం కాని ప్రధాని నరేంద్ర మోదీని సాగనంపే దాకా నిద్రపోం..' అనే సంకేతాలు ఇచ్చారు. బీజేపీకి ప్రత్యామ్నాయంగా బలమైన అజెండాను ఖరారు చేయడంలో విపక్ష నేతలు విఫలమయ్యారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, మాయావతి వంటి అగ్రనేతలు మమత జరిపిన ర్యాలీకి గైర్హాజరు కావడంతో విపక్షాల ఐక్యతపై అనుమానాలు బయలుదేరాయి. కాగా, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు పాతికేళ్ల క్రితమే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ సహా అన్ని పార్టీలను కలుపుకుని విజయం సాధించారు. ఎన్టీఆర్ చొరవ వల్లనే 1989లో వీపీ సింగ్ ప్రధాని అయ్యారు. కేరళ, బెంగాల్ లేదా ఏ ఉత్తరాది రాష్ట్రం నేతనో ఇటువంటి ర్యాలీ నిర్వహిస్తే అదేదో గొప్ప రాజకీయ సభ అయినట్లు, ఆ ప్రాంతం వారే మహానేతలనే భ్రమలు చాలామందికి ఉన్నాయి. ఆ రోజుల్లో ఎన్టీఆర్ కాంగ్రెస్‌ను గద్దె దించాలంటే ఏమి చేయాలో చేసి చూపించారు.

కోల్‌కత ర్యాలీ సరైన నాయకత్వాన్ని దేశానికి చూపించిందా? 1983-1989 మధ్య కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బలమైన ప్రతిపక్ష పార్టీని ఎన్టీఆర్ నిర్మించారు. అందుకే 1984 పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో నెగ్గిన కాంగ్రెస్ పార్టీ 1989 ఎన్నికల్లో చిత్తుగా ఓటమి చెందింది. ఆనాడు కాంగ్రెస్‌ను ఎన్టీఆర్ ఢీకొన్నట్టు- ఇపుడు బీజేపీకి వ్యతిరేకంగా బలమైన కూటమిని ఏర్పాటు నేత దేశంలో ఎవరూ లేరు. ఈ విషయం కోల్‌కత ర్యాలీతో స్పష్టమైంది.

1980,90 దశకాల్లో అన్ని పార్టీల్లో సిద్ధాంత భావజాలం ఎక్కువగా ఉండేది. ఎన్టీఆర్ వామపక్షాలను, బీజేపీని ఒక వేదికపైకి తెచ్చారంటే ఆషామాషీ కాదు. ఎన్టీఆర్ రాజకీయాలకు అప్పట్లో విశ్వసనీయత ఉండేది. ఇటీవల మమతా బెనర్జీ నిర్వహించిన మహార్యాలీలో అలాంటి విశ్వసనీయత కనిపించ లేదు. రాజకీయ లక్ష్యాలు ఏమైనప్పటికీ విపక్ష పార్టీలు ఒక వేదికపైకి రావడం మంచి పరిణామమే కానీ, ఈ వేదికపై జతకట్టిన పార్టీలకు ఉన్న అర్హత ఏమిటి? వీటికి సిద్ధాంత నిబద్ధత ఉందా? మహార్యాలీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని మొక్కుబడిగా ఆహ్వానించారు. అవకాశం ఉంటే రావాలనే రీతిలో ఆహ్వానం పంపారు. అందుకే రాహుల్ ఈ సభకు హాజరు కాలేదు. తమ పార్టీ తరపున సీనియర్ నేత మల్లికార్జున ఖర్గేను పంపారు. బీజేపీని ఓడించాలంటే తన నాయకత్వంలో ఏర్పడే కూటమికి ఓట్లు వేయాలని మమతా బెనర్జీ సందేశం ఇచ్చారు. ఎన్నికల తర్వాత మాత్రమే ప్రధానమంత్రి ఎవరన్నది తేలుస్తామని ఆమె అన్నారు. ఎన్నో కోట్లు ఖర్చుపెట్టి మహార్యాలీని నిర్వహించినా, తమ కూటమిని గెలిపిస్తే ఫలానా నేత ప్రధానమంత్రి అవుతారని ఎందుకు ప్రకటించలేకపోయారు?

నాయకత్వం లేని కూటమిని ప్రజలు నమ్మరు. ర్యాలీకి హాజరైన నేతల్లో ప్రధాని పదవిని చేపట్టేందుకు అర్హతలున్న నేతలు లేకపోలేదు. కాని వారిని ఎందుకు పట్టించుకోలేదు? 40 ఏళ్ల రాజకీయం అనుభవం ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అందుకు తగరా? ర్యాలీకి హాజరైన నేతల్లో ఎక్కువ అనుభవం ఉన్న నేత చంద్రబాబు. మమత వరుసగా రెండవసారి ముఖ్యమంత్రి అయ్యారు. వామపక్షపార్టీలపై 20 ఏళ్లు పోరాటం చేసిన ఘనత ఆమెకుంది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కనపడ లేదా? వయోభారం మీదపడినా ప్రధాని పదవి వరిస్తుందనే ఆశతో ఉన్న మరాఠా యోధుడు శరద్ పవార్ కూడా



మోదీని ద్వేషించే వారికి సరైన నాయకత్వం చూపినపుడే బీజేపీ వ్యతిరేక కూటమిని ప్రజలు విశ్వసించే అవకాశం ఉంటుంది. హిందీ బెల్ట్‌లో ఇటీవల కాంగ్రెస్ విజయం సాధించడానికి ముందు రాహుల్‌ను ఫోకస్ చేసిన కుటుంబ పార్టీలు కోల్‌కత ర్యాలీ తర్వాత దూరం జరుగుతున్నాయి. పటిష్టమైన నాయకత్వం ఉన్న బీజేపీని ఢీ కొనాలంటే- కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి ఉన్నంత విలువ, ప్రజాదరణ, మమతా బెనర్జీ సారథ్యంలోని కూటమికి ఉండదు. హిందీ బెల్ట్‌లో కాంగ్రెస్ గెలుపు సామాన్యమైనది కాదు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల తీర్పు వేరుగా ఉంటుంది. జాతీయస్థాయి రాజకీయాల ప్రభావం ప్రజలపైన ఉంటుంది. బీజేపీని ఓడించాలనుకొనే పార్టీలు సిద్ధాంతాలు, బేషజాలను పక్కనపెట్టి ఒక వేదికపైకి రావాల్సి ఉంటుంది.

ర్యాలీకి హాజరయ్యారు. ర్యాలీకి హాజరైన వారిలో నలుగురు మాత్రమే జనాదరణ ఉన్న నేతలు. మిగతా నేతలు వారి సొంత రాష్ట్రాలకే పరిమితం. అయినా కాంగ్రెస్‌కు ప్రాధాన్యత లేని కూటమితో బీజేపీని ఓడించాలనుకోవడం పగటి కలే!

ఈ రోజుల్లో మహార్యాలీలకు జనం స్వచ్ఛందంగా వస్తారా? ఎంతో డబ్బు ఖర్చు చేస్తేగాని సభలకు జనం రాని పరిస్థితి నెలకొంది. జనం తమంతట తాముగా ర్యాలీలకు రావడం మానుకొని చాలా కాలమైంది. వచ్చిన జనమంతా తమ వెంటే ఉన్నారని నేతలు భావించడం పొరపాటే. ఏ పార్టీలు సభలు పెట్టినా అదే జనం వస్తారు. ఇక అధికారంలో ఉన్న పార్టీ అయితే జనాన్ని ఏ విధంగానైనా తరలిస్తారు. కోల్‌కత ర్యాలీలో మోదీని తిట్టడమే పనిగా విపక్ష నేతలు పెట్టుకున్నారు. బీజేపీలో ఇతర నేతలు మోదీ కంటే మంచి వారని మమత పొగడడం విడ్డూరం. ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని రాజకీయంగా బలపడడం అంత సులభం కాదు. ఎన్నికల్లో అధికారంలోకి రావాలంటే ముందుగా సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలి. ఆ తర్వాత స్పష్టమైన అజెండా ఉండాలి. భావసారూప్యత ఉన్న పార్టీలను కలుపుకొని పోవాలి. కోల్‌కత ర్యాలీ 'ఫ్యామిలీ షో'గా నడిచింది. ఈ కూటమికి హాజరైన నేతలందరూ కుటుంబ పార్టీల నేతలే. ఈ పార్టీల్లో ప్రజాస్వామ్యం లేదు. ఈ నేతలు దేశానికి సమర్థ నాయకత్వం ఎలా అందిస్తారు?

కుటుంబ పార్టీ అయినా దేశ వ్యాప్తంగా బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఉన్న పార్టీ కాంగ్రెస్ ఒక్కటే. ఆ పార్టీ ఈ మధ్య పునరుజ్జీవం పొందుతోంది. రాహుల్ గాంధీ కోల్‌కత ర్యాలీకి హాజరైతే తన చాప కిందకు నీరు చేరుతుందనే భయంతో మమత ఏమీ తెలియనట్లు నటించినా జనం ఆమె అంతరంగాన్ని గ్రహించకుండా ఎలా ఉంటారు. వామపక్ష పార్టీలు కేరళలో కాంగ్రెస్‌పై, బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌పై పోరాటం చేస్తున్నాయి. అందుకే వామపక్ష పార్టీలు కోల్‌కత సభకు హాజరు కాలేదు. ర్యాలీకి వచ్చిన పార్టీలన్నీ గతంలో కాంగ్రెస్‌పై పోరాడాయి. ఈ రోజు బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధమంటున్నాయి. అయితే, కాంగ్రెస్ నాయకత్వాన్ని జాతీయ స్థాయిలో అంగీకరించేందుకు చాలా పార్టీలు సిద్ధంగా లేవు. ఈ ర్యాలీకి హాజరు కాని వైకాపా, టీఆర్‌ఎస్‌లు కూడా ఇదే కోవలోకి వస్తాయి. టీడీపీ హాజరైనందు వల్ల వైకాపా, తెరాసలు ర్యాలీపై ఆసక్తిని కనపరచ లేదు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు రాహుల్ సోదరి ప్రియాంకా వాద్రా రాజకీయ రంగ ప్రవేశానికి రంగం సిద్ధమైంది. ఆమెకు తొలిసారిగా యూపీలో తూర్పు విభాగం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఆమె వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో యూపీ నుంచి పోటీచేసే అవకాశం ఉంది. ఆమె రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటే సమీకరణలు త్వరితగతిన మారుతాయా? యూపీలో కాంగ్రెస్‌ను దూరంగా పెట్టిన బీఎస్పీ, ఎస్పీ పార్టీలు ఆత్మరక్షణలో పడతాయా? సీట్ల పంపకంపై పునరాలోచన చేస్తాయా? ప్రియాంకను పార్టీలో ఇపుడు చిన్న పదవికి పరిమితం చేసినట్లు భావించవచ్చు. కాంగ్రెస్‌లో రాజకీయాలు విచిత్రంగా ఉంటాయి. ఇంతకాలం ఆమెకు బాధ్యతలు అప్పగించని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల నేపథ్యంలో అనూహ్య నిర్ణయం తీసుకొంది. ఆమె క్రియాశీలకంగా ఉంటారా? లేదా? అనే విషయం పక్కనపెడితే, ఆమె రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. పార్టీని పునరుజ్జీవింప చేయడానికి ప్రియాంక రూపంలో కాంగ్రెస్ పార్టీ ఓ అస్త్రాన్ని బయటకు తీసిందని చెప్పవచ్చు.

విపరీతమైన ప్రేమ, విపరీతమైన ద్వేషం అనే అంశాలకు ఎన్నికలు వేదికకానున్నాయి. మోదీకి, ఇతరులకు మధ్య పోరు జరగనుంది. మోదీని ద్వేషించే వారికి సరైన నాయకత్వం చూపినపుడే బీజేపీ వ్యతిరేక కూటమిని ప్రజలు విశ్వసించే అవకాశం ఉంటుంది. హిందీ బెల్ట్‌లో ఇటీవల కాంగ్రెస్ విజయం సాధించడానికి ముందు రాహుల్‌ను ఫోకస్ చేసిన కుటుంబ పార్టీలు కోల్‌కత ర్యాలీ తర్వాత దూరం జరుగుతున్నాయి. పటిష్టమైన నాయకత్వం ఉన్న బీజేపీని ఢీ కొనాలంటే- కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి ఉన్నంత విలువ, ప్రజాదరణ, మమతా బెనర్జీ సారథ్యంలోని కూటమికి ఉండదు.

హిందీ బెల్ట్‌లో కాంగ్రెస్ గెలుపు సామాన్యమైనది కాదు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల తీర్పు వేరుగా ఉంటుంది. జాతీయస్థాయి రాజకీయాల ప్రభావం ప్రజలపైన ఉంటుంది. బీజేపీని ఓడించాలనుకొనే పార్టీలు సిద్ధాంతాలు, బేషజాలను పక్కనపెట్టి ఒక వేదికపైకి రావాల్సి ఉంటుంది. ఎన్నికలకు ముందే ఎవరో ఒక సమర్థనేతను ప్రధానమంత్రి అభ్యర్థిత్వానికి ఖరారు చేయాలి. కశ్మీర్ నుంచి ఆంధ్రా వరకు, నాగాలాండ్ నుంచి కేరళ, మహారాష్ట్ర వరకు విపక్షాలు ఒకే వేదికపైకి వస్తే తప్ప- బీజేపీని మట్టికరిపించడం అంత సులువుకాదు. బీజేపీని వ్యతిరేకించే పార్టీల్లో చాలా మంది సిద్ధాంత ప్రాతిపదికన ఆ పార్టీని వ్యతిరేకించడం లేదు. మోదీ తప్ప మరొకరు ప్రధాని అవుతారని తెలిస్తే, ఈ రోజు బీజేపీ వ్యతిరేక కూటమిలోని సగం పార్టీలు జారుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి. అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటే తప్ప, ఈ తరహా రాజకీయ అంచనాలు నిజం కావు. బీజేపీ వ్యతిరేక కూటమిలోని పార్టీల్లో నేర్పు, నైపుణ్యం, చొరవ, ఆమోద యోగ్యం ఉన్న నేతలు లేరు. బీజేపీని ఓడించాలంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో కూటమి ఏర్పాటైతేనే సాధ్యమవుతుంది. ఒకవేళ కర్నాటక తరహాలో ప్రజలు తీర్పు ఇస్తే, ఎన్నికల అనంతరం ఏర్పడే ప్రభుత్వం ఎక్కువ కాలం బతకదు. ప్రజల విస్పష్టమైన తీర్పు ఇవ్వనందు వల్ల 1989, 1996, 1998లో కేంద్రంలో ఎటువంటి ప్రభుత్వాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. కాంగ్రెస్‌ను దూరంగా ఉంచి, వన్ మ్యాన్ షోగా బీజేపీ వ్యతిరేక కూటమిని ఏర్పాటు చేసి ఢిల్లీలో చక్రం తిప్పుతామనుకునే రోజులకు కాలం చెల్లింది.

-కె.విజయ శైలేంద్ర
98499 98097

మోదీ నాయకత్వమే శరణ్యం

త్రేతాయుగానికి చెందిన శ్రీరాముడు ధర్మానికి ప్రతీకగా నిలిచినందునే లక్షల సంవత్సరాల తర్వాత కూడా తమకు రామరాజ్యం కావాలని స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న యావత్ ప్రజలు, నాయకులు కోరుకునేవారు. స్వాతంత్ర్యం సిద్ధించాక భారతదేశానికి తొలి ప్రధానిగా సర్దార్ వల్లభబాయి పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లలో ఎవరో ఒకరు బాధ్యతలు చేపడితే బాగుండేదని అలనాడు ప్రజలు కోరుకునేవారు. దురదృష్టవశాత్తు జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి కావడంతో- దాదాపు గత డెబ్భై సంవత్సరాలుగా ప్రజల ఆకాంక్ష అంధకారంలో మగ్గినది. కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ పాలనలో భారత్ అవినీతిమయమైన దేశంగా మారింది.

డెబ్భై సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో కుటుంబ పాలకులు, అక్రమ సంపాదకులు, విదేశీ భావజాలానికి తొత్తులుగా ఉన్నవారు పాలించడం వల్ల కులం, మతం, సామాజిక వర్గాల పేరిట గిరిజనులు, దళితులు, వెనుకబడిన వారు, అగ్ర కులాలు, మైనారిటీలు అనే పద ప్రయోగాలతో సమాజాన్ని నిర్వీర్యం చేస్తూ రాజకీయ పార్టీలు, వాటి నాయకుల ఆగడాలు మితిమీరిపోయాయి. ప్రజలను వంచిస్తూ, తమ పబ్బం గడుపుకుంటూ ఈ దేశాన్ని కాంగ్రెస్ పాలకులు ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతిక పరంగా నిర్వీర్యం చేస్తూ వచ్చారు. ఇక, రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన రిజర్వేషన్లను పొందిన వారు నిరంతరాయంగా, విద్యాపరంగా, ఉద్యోగ పరంగా, రాజకీయ పరంగా, పారిశ్రామిక రంగాలలో కొందరు మాత్రమే లబ్ధి పొందుతున్నారు. రిజర్వేషన్లకు అర్హత ఉండి కూడా డెబ్భై సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఈనాటికి కూడా లబ్ధి పొందక అట్టడుగున ఉన్నవారే అత్యధికులు. ఇలాంటి దుష్ట సంప్రదాయాన్ని గుర్తించి, అన్యాయాన్ని అంతమొందించే దిశగా ప్రజలు నిర్ణయాలు తీసుకోవలసిన సమయం ఆసన్నమైంది.

దుర్మార్గుల పాలన నుండి దేశ ప్రజలకు ముక్తి కలిగించేందుకు 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేసేలా భగవంతుడు భారత దేశ ప్రజలకు ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోదీని ప్రకటింపజేసి పరీక్ష పెట్టినాడు. ఆ పరీక్షలో దేశ ప్రజలు సఫలీకృతులైనారు. డెబ్భై సంవత్సరాలుగా అస్తవ్యస్తమైన వ్యవస్థలను సరైన దిశకు తీసుకురావడానికి ప్రధాని మోదీ అలుపెరుగని కృషి చేయడం కాంగ్రెస్ సహా ఇతర విపక్ష నాయకులకు నచ్చడం లేదు. ఆర్థిక నేరస్థుల, తీవ్రవాదుల నడ్డి విరుస్తూ, దేశ సంపదను పెంచడంలోనూ, సరిహద్దులను కాపాడటంలోనూ ప్రధానమంత్రి మోదీ తీసుకొంటున్న కఠిన నిర్ణయాలకు కాంగ్రెస్ నాయకులు కంగుతింటున్నారు. వివిధ కుంభకోణాలలో కూరుకుపోయిన కుటుంబ పాలకులు, బెయిల్‌పై ఉన్నవారు, స్టే పొందిన వారు- 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' నినాదంతో ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న మోదీ ప్రతిష్ఠను చూసి జీర్ణించుకోలేక పోతున్నారు. జాతీయ నిష్ఠలేని నాయకులు, నిరంతరం మాయమాటలతో రాజకీయ లబ్ధి పొందేవారు మోదీని చూచి భయభ్రాంతులకు గురవుతున్నారు.

మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసి దేశంలోనే గుజరాత్ రాష్ట్రాన్ని ఒక నమూనాగా తీర్చిదిద్దిన మోదీ పరిపాలనను జీర్ణించుకోలేని ఆనాటి యుపిఏ ప్రభుత్వం చేసిన కుటిల పన్నాగం దేశ ప్రజలకు ఇదివరకే తెలుసు. అమెరికా సందర్శనకు మోదీకి వీసా ఇవ్వకూడదంటూ ఆ దేశ అధ్యక్షుడికి కాంగ్రెస్, కమ్యూనిస్టు, ఎమ్ఐఎమ్ మొదలైన వారి సంతకాలతో కూడిన ఒక పత్రాన్ని ఒబామాకు పంపినారు. ముఖ్యమంత్రిగా ఉన్న మోదీని అపహాస్యం చేస్తూ ఆయనను సమాజంలో దిగజార్చాలనే ప్రయత్నంగా, జిల్లా స్థాయి పోలీసు అధికారితో నిరంతరాయంగా 9 గంటలు విచారింపచేసి- చివరికి కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోయిన యుపిఏ ప్రభుత్వ దుష్ట రాజకీయాలకు తెర పడింది. వీసా ఇచ్చేందుకు అంగీకరించని ఆనాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కాగానే, ఎన్‌డీఏ ప్రభుత్వ పాలనా విధానాన్ని, జాతీయ నిష్ఠను, సమాజ సంక్షేమానికి తీసుకొంటున్న కఠిన నిర్ణయాలు, సరిహద్దు రక్షణ, సైనికుల పరిరక్షణ, ఆయుధ సంపత్తి, విదేశీ విధానాలను గుర్తించి స్నేహహస్తం అందించాడు. ఒబామా సహా మోదీని అభినందించిన విదేశీ ప్రముఖులు, మేధావులు ఎందరో!

పెట్రోల్ కొనుగోలులో యుపిఏ ప్రభుత్వం చేసిన లక్షల కోట్ల రూపాయల అప్పును నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయినాక తీర్చేసి దేశ ప్రజలపై ఆర్థిక భారాన్ని తప్పించినాడు. ఇప్పటికే రిజర్వేషన్ పొందుతున్న వారికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఆర్థికంగా వెనుకబడ్డ సవర్ణులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించి 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్'కు సార్థకం చేకూర్చినాడు. దేశ ప్రజల మన్ననలను పొందినాడు. ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించాలని కలలు గనేవారు, అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ సంపాదననే పరమావధిగా పెట్టుకుని బెయిల్‌పై ఉన్నవారు, తమపై కేసులు వేయగా 'స్టే' ఉత్తర్వులు తెచ్చుకున్నవారు, ఇప్పటికే రాజకీయంగా ఉనికి కోల్పోయినవారు, కోల్పోతున్నవారు అజెండాల ప్రస్తావన లేకుండా పొత్తు రాజకీయాలు నడుపుతున్నారు. తమ వ్యక్తిగత లాభాపేక్ష తప్ప దేశ ప్రజల సంక్షేమం పట్టని గ్యాంగ్ కోల్‌కతలో ఇటీవల జరిపిన 'యునైటెడ్ బ్రిగేడ్ ఇండియా' ర్యాలీ ఉద్దేశం- మోదీ తిరిగి ప్రధానమంత్రి కాకుండా అడ్డుకోవడమే. ప్రజల సంక్షేమం వీరి అజెండా కానే కాదు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేయగల సమర్థుడిని 2019లో కోల్పోవడానికి ఈ దేశ ప్రజలు సిద్ధంగా లేరనేది విజ్ఞులైన ఓటర్లు ఇవ్వబోయే నిశ్శబ్ద తీర్పు. ''సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్'' మళ్ళీ వికసించబోతుంది.

-బలుసా జగతయ్య 90004 43379

రాలిన జుట్టూ సంపదే!

''అబ్బా.. బోడిగుండా..?'' అని అంటారు. కానీ అమూల్యమైన సంపదగా పెంచుకున్న శిరోజ పుంజాల్ని- నీలాద్రి కొండ మీదుగా పోయి, శ్రీవారి కళ్యాణకట్ట దగ్గర, నాయీబ్రాహ్మడి ముందు అతి వినయంగా తలవొంచి- 'గోవిందార్పణం' అయినాక- ''యింతకన్నా ఏడువారాల నగలు నిలువుదోపిడీగా యిచ్చేసుకున్నా బాగుండేది..''అనుకుంటారు- మహిళామణులు.

ఔను..! మీ అమూల్యమైన తల వెంట్రుకల గురించి జాగ్రత్తగా ఆలోచిస్తే, బంగారం కన్నా 'బెటర్'గా ఉపయోగపడతాయి! తిరుమల దేవస్థానం వారు తలనీలాలను విక్రయిస్తూ ఏడాదికి నాలుగువందల కోట్ల రూపాయల విలువయిన విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించుకుంటున్నారు. తిరుమల కొండపై స్వామివారు బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా చేయించుకుంటున్నాడు. ఇది కానేకాదు- వార్త. 'కాదేదీ నైవేద్యానికి అనర్హం' అన్నట్లు తలనీలాలు యిచ్చేసుకుంటున్న భక్తజనాలకి వాళ్ల కేశ రాజములు- చైనాలోనో, అమెరికాలోనో ఏ అందాల భామ శిరసును కురుల కిరీటమై- భాసిస్తున్నాయో తెలియదు. అది అట్లుండనిండు. ఇండియా మొత్తం మీద యిప్పుడు ఏటా ముప్ఫైవేల కోట్ల రూపాయల శిరోజాల వ్యాపారం సాగుతోంది. నిత్యం బర్మామీదుగా దక్షిణ భారత్‌కు చెందిన శ్రేష్ఠమైన తలవెంట్రుకలు చైనాకి- వేరే మార్గాల గుండా బంగ్లాదేశ్ మీదుగా దొంగతనంగా కూడా ఇవి ఎగుమతి అయిపోతున్నాయి. కాకపోతే తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ వెంట్రుకలకి గిరాకీ జాస్తీ. తిరుపతి కేశములకు మరింత ఎక్కువ డిమాండ్ ఉందట!

''నఖములు, కేశములు, స్త్రీలు స్థానభ్రంశము పొందిరేని రాణించవు''-అన్న



వీరాజీయం

సెల్: 92900 99512

ఆర్యోక్తి అబద్ధం అయిపోయింది. నఖముల సంగతి ఏమోగానీ- స్త్రీలు, శిరోజములు కూడా స్వస్థానం నుంచి దూరం అయినా కానే గొప్పగా రాణిస్తున్న కాలమిది. కొండమీది దేవుడి సొత్తుగా మారిన జుత్తుకి- అది ఏలిమి వెంట్రుకల సంపుటం.. కనుక కిలోకి ఎనిమిద వందల నుంచి- నాలుగు వేల దాకా ధర పలుకుతోందిట! పైగా, రాలిన జుట్టుకు విలువ ఎక్కువట. ఈ జుట్టును రాలిన బట్ట తలకి అతికించడం తేలికట. చైనాలో అయితే యీ శుద్ధ నీలాలకి- అక్కడి ముతక కురులను కలిపి ట్రాన్స్‌ప్లాంటేషన్ దగ్గర్నుంచి రకరకాల విగ్గుల దాకా అద్భుతంగా తయారుచేసి- ఎగుమతి చేసి- చైనీయులు డాలర్ల వర్షం కురిపించుకుంటున్నారు.

కొండమీది నీలాల సంగతి అటుంచండి. మన వాళ్లు ప్రక్కింటి బాల్కనీ దగ్గిరసా నిలబడి, పేల దువ్వెనలెట్టి తమ నితంబ చుంబిత కేశ రాజముల చిక్కులు విడదీసుకుంటూ- తెగిన వెంట్రుకల్ని యిలా తీసి- వాటి నిడివి కొలుస్తున్నట్లు దీర్ఘదృష్టి సారించి, ఆనక వేలికి చాకచక్యంగా మెలివేసి- సదరు చిక్కని చిక్కును గాలికి ప్రక్కింటిమీదికి వదిలిపెడ్తారే- అదీ అసలు 'సవరాల'కి పనికివచ్చే జుట్టు.

ఈ 'శిరోజ లడాయిలు' అపార్ట్‌మెంట్లలో సాధారణంగా అగుపడుతుంటాయి. ''ఏమమ్మా.. మీ దిక్కుమాలిన చిక్కులు మా పడగ్గదిలోకి వచ్చి పడి బీరువా మీదున్న పుష్పగుచ్ఛ కలశం మీద కూర్చుంటున్నాయి. ఛీ! పాడు,'' అంటుంది క్రిందింటి యిల్లాలు.

''తలెంట్రుకలు కొంటాం,'' అంటూ జిప్సీలు, లంబాడీలు వస్తూంటారు. వాళ్లకి యీ చిక్కుల్ని, ఓ డబ్బాలో పెట్టి దాచి అమ్మేస్తే- నీ కళ్లముందే, 'నిజం జడ'లాంటి సవరాన్ని కట్టేస్తారు. ''పోనిద్దురూ! అంత ఓపిక ఎవరికి చచ్చిందీ?'' అంటారా? కానీ యిలాంటి చిక్కులకి కూడా డిమాండు చాలా



వుంది. ఈమధ్య ఆడ పిల్లలంతా జీన్స్, బాబ్డ్ హెయిర్‌లే కదా- దీంతో వెంట్రుకలు- ఆడా-మగా యిద్దరివీ కూడా ఒకే నిడివి గలవి దొరుకుతున్నాయి. అందుకే ఎగుమతి చేసే వాళ్లు ద.భా.- అనగా సౌత్ ఇండియా మీద నుంచి పాకిస్తాన్ మీదికి తమ దృష్టిని మరల్చారు. అక్కడ యీ 'కురుల' వ్యాపారం, డాలర్ల కోసం జోరుగానే వుందిట. మొన్న మొన్న పాకిస్థాన్ పార్లమెంటు దిగువ సభలో ఈ - 'బాల్ ఔర్ జుల్ఫేం'- అనగా సీదా మరియు ఉంగరాల ముంగురుల శిరోజాల ఎగుమతి గురించి ప్రసక్తి వచ్చింది. వాణిజ్య మంత్రి గారు- 'సదన్'కి గత అయిదు సంవత్సరాల వెంట్రుకల ఎగుమతి ఆదాయ వివరాలను నివేదిస్తూ- పాకిస్తానీయుల తల వెంట్రుకలు ఒకటి పాయింట్ ఆరు మిలియన్ల అమెరికన్ డాలర్లు సంపాదించాయని వివరించాడు. వాళ్ల తల వెంట్రుకలకీ చైనాలోనే డిమాండ్. మనవాళ్లు ఉడుక్కొని, రూపాయలలోనైతే యీ మొత్తం ఎంతో- కాలుక్యులేటర్‌తో మదింపు చేశారు. పదకొండు కోట్ల నలభై మూడు లక్షల అరవై వేల రూపాయలు అని తేలింది. ''వామ్మో!'' అని గుండె బాదుకున్నారు.

ప్రపంచంలో జపాన్, ఆఫ్రికా దేశాలలో కూడా మనోరంజన క్షేత్రంలోను, సౌందర్య వేషధారణలోనూ 'విగ్గు'లకి- ఇబ్బడి ముబ్బడిగా వ్యాపారం వస్తోంది- యిప్పుడు. మన దేశంలో చెన్నై, బెంగళూరు, ఆంధ్రా ప్రాంత నగరాలలో విదేశీ వ్యాపారస్థులు ఆఫీసులు తెరిచి దేవాలయాలు మొదలు- బార్బర్ సెలూన్ల దాకా తిరిగి వెంట్రుకల్ని సేకరించి వాటిని ప్యాక్ చేసి, విమానాలు ఎక్కిస్తున్నారు. ఐతే, యీమధ్య వీటి స్మగ్లింగ్ ఎక్కువ అయిందిట. హెయిర్ స్మగ్లింగ్- బర్మా, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా 'ఈజీ'గా వుంది అంటూ అఖిల భారత తల వెంట్రుకల ఎగుమతి వ్యాపారస్థుల సంఘం చైర్మన్ చెరియన్ గారు గోలెట్టేస్తున్నాడు.

దీనికి తార్కాణమా? అన్నట్లు బెంగళూరులో- ''బాబోయ్, నా వెంట్రుకలు, పదకొండు కేజీలు- దొంగలు ఎత్తుకుపోయారు..!'' అంటూ మిస్టర్ ఇగ్వే బాసిల్ అనే దక్షిణాఫ్రికా వెంట్రుకల వ్యాపారి అక్కడి సంజయ్‌నగర్ పోలీసులకు మొరపెట్టుకున్నాడు. మొదట పగలబడి నవ్విన పోలీసులు- ఇతను నిజమైన శిరోజాల వ్యాపారి అని తెల్సుకుని, ఆరా తీస్తే, దర్యాప్తు కొనసాగిస్తే, గుండెలు బాదుకునేటంత భయంకర విశేషాలు తెలిశాయి.

జనవరి ఐదో తారీఖున నలభై కేజీల శిరోజ సంపదను ఒక గోతాంలో పెట్టి- తన యింటి డాబా మీద దాచి పెట్టి- హోటల్‌కిపోయి తిని, తాగి వచ్చేసరికి- వెంట్రుకల బ్యాగ్- 'గాయబ్!'. పోలీసులు సీరియస్‌గా వెంట్రుకల దొంగతనాన్ని పరిశోధించగా- కథ ఒక ఆటో డ్రయివర్ అస్లామ్ భాయ్ దగ్గర మలుపు తిరిగింది. అస్లాం ఆటోవాలా- ''నేను అదంతా పార్వతమ్మకిచ్చేశాను సార్. ఆమె యిలాగ చాలా తల వెంట్రుకల్ని కొంటుంది సార్..'' అన్నాడు. ''ఊరికే తీసుకోలేదు- లక్ష రూపాయలు యిచ్చాను సామీ, యీ సచ్చినాడికి'' అంటూ ఆమె పోలీసులకి చెప్పుకొచ్చింది.

అబ్బా! రాలిపోయిన వెంట్రులకి యింత ధరా? బంగారం స్మగ్లింగా యేమి? పో.. అవతలికి.. అనుకున్నాం గానీ, వారి నాయనోయ్.. ఇది కోట్లలో జరిగే దొంగ రవాణా వ్యాపారం అన్నమాట. తిరుపతికి చెందిన తల నీనాలకి వాటి నిడివిని బట్టి, నాణ్యతని బట్టీ 25వేలు- 15వేలు- కనీస పక్షం అయిదు వేల రూపాయలు దేనికి? ఒక కేజీ శిరోజాల మూటకి మాత్రమే యింత రేటుట! అందుకనే బార్బర్లు ఎవ్వరూ కత్తిరించిన వెంట్రుకల్ని భద్రం చేసి అమ్మేస్తారు గానీ, రోడ్డుమీదికి కాకా హోటల్ వాడు నీళ్లు విసిరిపోసేసినట్లు విసిరెయ్యరు.

బై ది బై.. మరో కొసరు వార్త. తల వెంట్రుకలలో గుజరాత్ నుంచి ఎగుమతి అయ్యే శిరోజాలు గొప్ప నాణ్యత గలిగి, అతి మృదువుగా, నిగనిగలాడుతూ వుంటాయిట. వీటినే దొంగ రవాణా చేస్తున్నారు ఎక్కువగా. కలకత్తాలో యీ వెంట్రుకల దొంగ రవాణా ముఠాలు హాయిగా- ఫైవ్‌స్టార్ సుఖాలు అనుభవిస్తూ, రాలిన జుట్టును సేకరించి, లక్షాధికార్లు అవుతున్నారుట! మూడు వేల నుంచి నాలుగు వేల కేజీల దాకా యిలా దొంగ రవాణా అయిపోతున్నాయి. వందల మందికి దొంగ వెంట్రుకలు కూడా 'దొంగ ఉపాధి' కల్పిస్తున్నాయట! దీంతో కోటి ఇరవై లక్షల రూపాయల దాకా వ్యాపారానికి నష్టం వస్తోందని అంచనా. అందుకే- ఎవరి 'తల చిక్కులు' వాళ్లే దాచుకోండి... వాటిని చరాస్తిగా భావించండి!

హెన్స్ హెయిర్ ఈజ్ ఆల్సో ఏ మూవబుల్ అస్సెట్!

నిందితుల వాంగ్మూలాల ఫొటో కాపీలను ఆధారంగా తీసుకోవద్దు

❒ మాలేగాం పేలుళ్ల కేసులో ఎన్ఐఏ కోర్టును ఆదేశించిన హైకోర్టు

ముంబయి, జనవరి 23: మాలేగావ్ పేలుళ్లకేసులో నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజన్సీ కోర్టు సాక్షులు, నిందితులు ఇచ్చిన వాంగ్మూలాల ప్రకటనల ఫొటో కాపీ ప్రతులను సెకండరీ ఈవిడెన్స్‌గా తీసుకోరాదని ముంబయి హైకోర్టు ఆదేశించింది. జస్టిస్ ఏఎస్ ఓకా, ఎఎస్ గడ్కరీతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఫొటో కాపీలను ఎన్ఐఏ సమర్పించిందని కోర్టు పేర్కొంది. కాగా ఈ ఫొటో కాపీలు ఒరిజనల్ ఈవిడెన్స్ డాక్యుమెంట్లకు సంబంధించినవా కాదా అనే విషయాన్న ఎన్ఐఏ ప్రస్తావించలేదని కోర్టు పేర్కొంది. ఒరిజనల్ డాక్యుమెంట్లు గల్లంతు కావడంతో ఫొటోకాపీలను ఉపయోగించడానికి ఎన్ఏఏ 2017 జనవరిలో అనుమతించింది. ఈ వాంగ్మూలాలను సీఆర్‌పీసీ 164 కింద ఎన్ఏఏ నమోదు చేసింది. ఈ ఫైళ్లు గల్లంతయ్యాయి. ఇంతవరకు లభించలేదు. ఈ ఫైళ్లు గల్లంతైనందు వల్ల, కేసు విచారణకు కాను ఒరిజనల్ డాక్యుమెంట్ల నకళ్లను పరిగణనలోకి తీసుకోవాలని ఎన్ఐఏ కోర్టును ఎన్ఐఏ అధికారులు కోరారు. అనంతరం



కోర్టు ఫొటో కాపీలను సెకండరీ ఈవిడెన్స్‌గా పరిగణించేందుకు అంగీకరించింది. కాగా, ఎన్ఏఏ కోర్టు ఈ డాక్యుమెంట్లకు అనుమతివ్వడాన్ని సవాలు చేస్తూ మాలేగావ్ కేసులో నిందితుడు సమీర్ కులకర్ణి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ కేసుపై వచ్చే నెల 5వ తేదీన విచారణ చేస్తామని హైకోర్టు తెలిపింది. ముంబయికి 200 కి.మీ దూరంలో మాలేగాం పట్టణంలో 2008 సెప్టెంబర్ 29వ తేదీన జరిగిన పేలుళ్లలో అనేక మంది మరణించారు. ఈ కేసులో నిందితులుగా సాధ్వీ ప్రయాగ సింగ్ టాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ తదితరులు ఉన్నారు.



నేతాజీ సుభాష్ చంద్రబోస్ మేనకోడలు, నేతాజీ రీసెర్చ్ బ్యూరో చైర్‌పర్సన్ అనితా బోస్‌కు డీవీడీ ప్యాక్‌ను అందచేస్తున్న పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేశరీ నాథ్ త్రిపాఠీ. మాజీ గవర్నర్ గోపాల్ కృష్ణ గాంధీ కూడా చిత్రంలో ఉన్నారు. సుభాష్ చంద్రబోస్ 122వ జయంతిని కోల్‌కతాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ ఫొటోలు, క్లిప్పింగ్స్‌తో కూడిన డీవీడీలను అనితా బోస్‌కు అందించారు.

అది అభివృద్ధి నిరోధకుల కూటమి

❒ కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ



ఝూర్‌గ్రామ్, జనవరి 23: కోల్‌కతాలో ప్రతిపక్షాల ర్యాలీపై కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ విమర్శలు గుప్పించి. కూటమిగా చెప్పుకుంటున్న ఆ పార్టీల నేతల్లో చాల మందికి ఒకరంటే ఒకరికి పడదని ఆమె ఎద్దేవా చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, నరేంద్రమోదీ భయం నుంచి బయటపడేందుకు రాజకీయాలు చేస్తున్నారని బుధవారం ఇక్కడ ఆరోపించారు.'పశ్చిమ బెంగాల్ లోనే ప్రత్యేక పరిస్థితులు చూశాం. ప్రతిపక్ష నాయకులు అందరూ ఒకే రాజకీయ వేదికపైకి వచ్చారు. ప్రజల అభివృద్ధి వారికి అక్కర్లేదు'అని ఆమె నిప్పులు చెరిగారు. గణతంత్ర బచావో పేరుతో బీజేపీ ఏర్పాటు చేసిన ర్యాలీలో ఇరానీ మాట్లాడుతూ 'ప్రతిపక్ష నేతలకు మోదీ అంటే భయం. సొంత ప్రయోజనాల కోసమే కూటమి కట్టారు'అని విమర్శించారు. నరేంద్ర మోదీ అభివృద్ధి కార్యక్రమాలతో బెంబేలెత్తి రాజకీయాలు చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. దేశం అభివృద్ధి చెందితే తమ అస్థిత్వం ఉండదని భయపడి ఉనికి కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి మమతాబెనర్జీ కాంగ్రెస్‌తో పొత్తుకు ప్రయత్నిస్తున్నారని ఆమె తెలిపారు. కాంగ్రెస్‌లో ఉండగా తనపై పెట్టిన వేధింపులను ఆమె మరిచిపోయారని ఇరానీ చెప్పారు.

ప్రియాంక నియామకాన్ని స్వాగతిస్తున్నాం: బీజేపీ

❒ కాంగ్రెస్ చీఫ్ రాహుల్ ప్రాధాన్యత తగ్గిందని ఎద్దేవా


లక్నో, జనవరి 23: కాంగ్రెస్ పార్టీ యూపీ తూర్పు ప్రాంతం ఎన్నికల వ్యవహారాల ఇన్‌చార్జిగా ప్రియాంక గాంధీని నియమించడాన్ని బీజేపీ స్వాగతించింది. ఈ నియామకం చూస్తే ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి పార్టీలో ప్రాధాన్యత తగ్గినట్లుగా సంకేతాలు వస్తున్నట్లు అర్థమవుతోందని బీజేపీ నేత, యూపీ మంత్రి సిద్ధార్థ్ నాథ్ సింగ్ చెప్పారు. రాహుల్ గాంధీపై ఆధారపడి రాజకీయాలు చేయలేమనే విషయాన్ని ఆ పార్టీ గ్రహించినట్లుందన్నారు. ఉత్తరప్రదేశ్ ఈస్ట్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకాగాంధీని నియమించడం అంటే రాహుల్ గాంధీకి ప్రాధాన్యత తగ్గినట్లే అన్నారు. తూర్పు ఉత్తరప్రదేశ్‌లోనే అమేథీ, రాయబరేలి నియోజకవర్గాలు ఉన్నాయి. గాంధీ కుటుంబం నుంచి ఒక్కొక్కరిని ప్రజా పరీక్షకు పంపుతున్నారని, కాని వారు విఫలమవుతున్నారన్నారు. కాగా ప్రియాంకగాంధీ కొత్త బాధ్యతలు స్వీకరించేందుకు ఆసక్తికనపరచడం పట్ల రాహుల్ గాంధీ స్వాగతించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆమె సేవలను ఇక్కడ ఉపయోగించుకుంటామన్నారు.



కాంగ్రెస్‌కు మరింత ఉత్సాహం

ప్రియాంక నియామకంపై కమలనాథ్ హర్షం

దావోస్, జనవరి 23: యూపీ రాష్ట్రానికి జనరల్ సెక్రటరీలుగా ప్రియాంక గాంధీ వాద్రా, జ్యోతిరాదిత్య సింధియాలను నియమించడం పట్ల మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ హర్షం వ్యక్తం చేశారు. వీరి నియామకంతో వచ్చే లోక్‌సభ ఎన్నికలకు పార్టీకి మరింత బలం, ఉత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈమె నియామకంపై గత ఆరు నెలలుగా తర్జనభర్జనలు జరుగుతున్నాయని, ఎట్టకేలకు ఆమె క్రియాశీల రాజకీయాల్లోకి రావడం వల్ల ఉత్తరప్రదేశ్‌కే కాక దేశమంతటా కాంగ్రెస్‌కు ఉత్సాహాన్ని ఇస్తుందని ఆయన అన్నారు. ఇక్కడ జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశానికి హాజరై న ఆయన పీటీఐతో మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కోసం ఎంత కృషి చేస్తున్నామో ప్రియాంక నియామకంతో పార్టీ వర్గాలకు అధిష్టానం తెలియజేసిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జ్యోతిరాదిత్య సింధియాది చాలా ముఖ్యమైన భూమిక అని, ఈ యువనేత రాష్ట్రంలో తన పాత్రను సమర్థవంతంగా పోషిస్తాడని ఆయన అన్నారు. కాగా, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే రాష్ట్రంగా అందరి దృష్టి ఉత్తరప్రదేశ్‌పై ఉంది. 80 స్థానాలున్న ఈ రాష్ట్రానికి ప్రధాని అభ్యర్థిని నిర్ణయించే సత్తా ఉంది. దీంతో అన్ని పార్టీలు దీనిపై దృష్టి పెట్టిన నేపథ్యంలో కాంగ్రెస్‌ను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో ప్రియాంను యూపీ ఉత్తర ప్రాంతానికి ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా నియమిస్తూ



రాహుల్ నిర్ణయం తీసుకోవడం పట్ల పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రాహుల్, సోనియా ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథి, రాయబరేలి ఈ రాష్ట్రంలోనే ఉన్నాయి. ఇప్పటికే ఈ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి సీఎం యోగి ఆదిత్యనాథ్, ప్రధాని నరేంద్ర మోదీ వంటి ఇద్దరు ఆకర్షణ గల నేతలు ఉన్నారు. నరేంద్రమోదీ ఇక్కడ వారణాసి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు ప్రియాంక లాంటి నేత చాలా అవసరమని యూపీ పీసీసీ అధికార ప్రతినిధి రాజీవ్ భక్షి పేర్కొన్నారు. యూపీలో ఇద్దరు నేతలను జనరల్ సెక్రటరీలుగా నియమించడం చూస్తే రాష్ట్రంపై రాహుల్‌కు ఉన్న శ్రద్ధను అర్థం చేసుకోవచ్చునని యూపీసీసీ జనరల్ సెక్రటరీ ద్విజేంద్ర త్రిపాఠి అన్నారు. వారిద్దరికీ ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, నాయకత్వ లక్షణాలు పుష్కళంగా ఉన్నాయని, యూపీలో కాంగ్రెస్ కచ్చితంగా పూర్వవైభవాన్ని సంతరించుకుంటుదని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.


దక్షిణ కొరియాతో భారత్ చర్చలు

❒ ఆర్థిక రంగం, డబ్ల్యూటీవో భవితపై దృష్టి

❒ వాణిజ్య శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 23: ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) దావోస్‌లో జరుగుతున్న నేపథ్యంలో గురువారం భారత్, దక్షిణ కొరియా దేశాలు ఆర్థిక రంగంలో సహకరించుకోవడంపై చర్చించనున్నాయి. భారత్ తరపున వాణిజ్య కార్యదర్శి అనుప్ వాదావన్ ఈ చర్చల్లో పాల్గొంటారు. ప్రపంచ దేశాల్లో వాణిజ్య రంగంలో ఏకపక్షంగా పెరుగుతున్న పోటీని నివారించే లక్ష్యంతో ఈ సమావేశం జరుగుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రాధాన్యతను తగ్గించడంపై కూడా ఈ సదస్సులో పెద్ద ఎత్తున చర్చించనున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటనలో తెలిపింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో 164 దేశాలకు సభ్యత్వం ఉంది. ప్రపంచ వాణిజ్య సంస్థ విధి విధానాలను, కార్యకలాపాలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. డబ్ల్యుటీవో పాత్రను తగ్గించే విషయమై ఇప్పటికే అమెరికా అనేక చర్యలు తీసుకుంటోందని, ఈ విషయమై అన్నిదేశాలు తమ అభిప్రాయాలను తెలియచేయాల్సి ఉంటుందని డబ్ల్యుటీవో చైర్మన్ రాబర్డ్ అజీవేడో చెప్పారు. 1995లో డబ్ల్యుటీవో ఆవిర్భవించింది. ఈ సంస్థలో సంస్కరణలు తేవాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి సురేష్ ప్రభు చెప్పారు. డబ్ల్యూటీవో భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహంపై భారత్ ఒక ముసాయిదా పత్రాన్ని సమర్పించనుంది. అమెరికా తమ దేశానికి దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాన్ని పెంచింది. చైనా, అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం కూడా తీవ్రతరమైంది.

అక్షయ్, కరీనా 'గుడ్ న్యూస్' ప్రారంభం



ముంబై, జనవరి 23: బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్‌తో చాలా కాలం తర్వాత బ్యూటీ కరీనా కపూర్ మళ్లీ జోడీ కట్టింది. ఈ విషయాన్ని అక్షయ్ కుమార్ తన ట్విట్టర్ ద్వారా వెల్లడిస్తూ బుధవారం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్‌ని కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నాడు. అజ్‌నబీ, ఐత్‌రాజ్, బేవాఫా, దోస్తీ: ఫ్రెండ్స్ ఫరెవర్, తాషాన్‌తో పాటు కంబఖ్త్ ఇష్క్ చిత్రాల్లో ఈ జంట ఆడిపాడింది. తమ నటనతో ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. 2009 నుండి 2019 వరకు వీరిలో ఎలాంటి మార్పు లేదు. ఈ జంటది పదేళ్ల పోరాటం. 2009లో కంబఖ్త్ ఇష్క్ సమయంలో గుడ్ న్యూస్ చర్చకు వచ్చింది. అప్పటి నుంచి ఈ గుడ్‌న్యూస్‌లో ఎలాంటి మార్పు లేదు. వీరిద్దరి కాంబినేషన్‌లో గబ్బర్ ఈస్ బ్యాక్ అనే హాస్య చిత్రం కూడా వుంది. ఇది 2015లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్, కేఫ్ ఆఫ్ గుడ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'గుడ్‌న్యూస్'లో దిల్జిత్ దోసాంజ్, కియరా అద్వానీలు కూడా నటిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 6న విడుదల కానుంది. ఈ చిత్రం ద్వారా కరీనాకపూర్ ఖాన్, అక్షయ్‌కుమార్‌లు రాజ్ మెహతా దర్శకత్వంలో 15ఏళ్ల తర్వాత కలిసి స్క్రీన్‌ని పంచుకుంటున్నారు. వీరిద్దరూ కలిసి బుధవారం గుడ్‌న్యూస్ షూటింగ్‌లో పాల్గొన్నారు. అక్షయ్‌కుమార్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పోస్ట్ చేసిన ఫొటోకి రెండు లక్షల మంది లైక్‌లు కొట్టారు. వీరిలో బాలీవుడ్ తారలు నేహాధూపియా, సోఫియా చౌదరి, నటుడు అర్జున్ కపూర్‌లు కూడా ఉండటం గమనార్హం.

బల్విందర్ సింగ్ సంధ్ '83'లో పంజాబీ స్టార్ అమ్మీవిర్క్

ముంబై, జనవరి 23: '83' తారాగణంలో తాజాగా అమ్మీవిర్క్ చేరాడు. భారత్ బౌలింగ్‌లో గొప్ప ఆటగాడుగా రాణించిన బల్విందర్ సింగ్ సంధ్ పాత్రలో అతడు కనిపించనున్నాడు. 1983లో బ్లూస్ మెన్ ఫైనల్‌లో వెస్టిండీస్‌ను ఓడించి వారి మొట్ట మొదటి వరల్డ్ కప్ ట్రోఫీని కపిల్‌దేవ్ కెప్టెన్ సారథ్యంలో భారత దేశం గెలుపొందింది. కబీర్‌ఖాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం విర్క్ బాలీవుడ్ ప్రవేశాన్ని ప్రారంభించింది. సంధ్ ఒక బ్యాట్స్‌మన్, బౌలర్. వెస్టిండీస్‌తో జరిగిన ఫైనల్‌లో గోర్డాన్ గ్రీనిడ్జ్‌కు క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. మాజీ భారతీయ క్రీడాకారుడు ఈ సినిమా తారాగణంకు శిక్షణ కూడా ఇస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 10, 2020న విడుదల కానుంది. '83'ను మధు మంతెనా, విష్ణు ఇందిర, ఖాన్ సంయుక్తంగా నిర్మించారు. దీనిని రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పించారు.

పాజిటివ్ బజ్‌లో గూగుల్ ఫస్ట్

❒ రెండవ స్థానంలో ఫేస్‌బుక్ వాట్సాప్

❒ ఇంగ్లాండ్ ఆన్‌లైన్ సంస్థ సర్వేలో వెల్లడి



ముంబయి, జనవరి 23: వాణిజ్య, డిజిటల్ బ్రాండ్ల సమాచారం తెలుసుకోవడానికి, ఎక్కువ సంఖ్యలో ఉపయోగించుకునే సమాచార సాధనంలో గూగుల్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఫేస్‌బుక్ నిర్వహిస్తున్న వాట్సాప్, మూడవ స్థానంలో గూగుల్ ఆధీనంలోని యూటూబ్ నిలిచాయి. గూగుల్ 57.2 పాయింట్ల స్కోరుతో అగ్రగామిగా నిలిచినట్లు ఇంగ్లాండ్‌కు చెందిన ఆన్‌లైన్ మార్కెట్ రీసెర్చి డాటా అనలిటిక్స్ సంస్థ యువర్ గవర్నమెంట్ (యూ గవ్) తెలిపింది. బజ్ స్కోర్ల ద్వారా ప్రామాణికతను నిర్ధారించినట్లు చెప్పారు. గత రెండు వారాల్లో ఒక డిజిటల్ బ్రాండ్ గురించి మంచి లేదా చెడు ఏమి విన్నారనే విషయం తెలుసుకోవడాన్ని బజ్ స్కోర్ అంటారు. సామాజిక మాధ్యమాల్లో డిజిటల్ బ్రాండ్స్ ప్రచారం ఎక్కువగా ఉంటుంది. టెక్నాలజీ వల్ల గూగుల్, ఫేస్‌బుక్ వాట్సప్, యూటూబ్ పోటీ పడుతున్నాయి. ఈ మూడు సంస్థలకు అపారమైన టెక్నాలజీ ఉంది. ప్రపంచంలోనే అత్యుత్తమైన సమాచార టెక్నాలజీతో ఈ సంస్థలు రాణిస్తున్నాయి. టికెటింగ్ పోర్టల్ మేక్‌మై ట్రిప్ నాల్గవస్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఆమెజాన్, ఓబర్, ఓలా సర్వీసుల కోసం సెర్చ్ ఎక్కువగా ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఆహారాన్ని డెలివరీ చేసే స్విగ్గీ పెట్టుబడులతో తమ వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు ప్రణాళికలను ఖరారు చేసుకుంది. ఈ సంస్థ పదవ స్థానంలో నిలిచింది. గత ఏడాదిలో జొమాటో బ్రాండ్ తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటోంది. ఫైనాన్షియల్ బ్రాండ్స్ కూడా మంచి ప్రగతిని నమోదు చేసుకుంటున్నాయి.

ఐఎస్ ఆధీనంలోని గ్రామం స్వాధీనం

❒ పలువురు ఉగ్రవాదుల లొంగుబాటు

బీరుట్, జనవరి 23: సిరియాలో ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ఆధీనంలో ఉన్న ఒక గ్రామాన్ని ఎస్‌డిఎఫ్ నేతృత్వంలోని ఖుర్దీష్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. బుధవారం కాలిఫట్‌లోని సరిహద్దును దాటిన ఈ దళాలు ఐఎస్ ఆధీనంలో ఉన్న అతి ముఖ్యమైన రెండు గ్రామాలను స్వాధీనం చేసుకున్నట్టు అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. గత ఏడాది అమెరికా సహకారంతో సిరియాలోని ఇరాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న యుఫరేట్స్ వాలీలో అధికంగా ఉన్న జిహాదీలను సిరియన్ డెమోక్రాటిక్ ఫోర్సు (ఎస్‌డిఎఫ్) అణచివేసింది. వ్యవసాయ భూమి అధికంగా ఉన్న బాగౌజ్ గ్రామాన్ని ఆక్రమించుకుని తిష్టవేసిన జీహాదీలను బుధవారం ఎస్‌డిఎఫ్ దళాలు తరిమికొట్టాయి. చాలామంది పారిపోగా, వేలాది మంది లొంగిపోయారు. గ్రామంలో మహిళలు, వృద్ధులు, పిల్లలు కలిసి 4900 మంది ఉండగా, వీరిలో ఐఎస్ ఉగ్రవాదులు 470 మంది వరకు ఉన్నారని, వీరిలో 3500 మంది ముందుగానే లొంగిపోయారని అధికార ప్రతినిధి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. వీరిని ట్రక్కులు, ఇతర వాహనాల ద్వారా తరలించి గ్రామాన్ని ఖాళీ చేయించినట్టు ఆయన చెప్పారు. కాగా, ఇటీవలే ఐఎస్ ఆధీనంలో ఉన్న హాజిన్ పట్టణం, ఆల్-షాఫా, సౌస గ్రామాలను తమ దళాలు స్వాధీనం చేసుకున్నాయని ఆయన తెలిపారు. గత ఏడాది డిసెంబర్ నుంచి సుమారు 27 వేల మంది ఐఎస్ ఉగ్రవాదులు, సానుభూతిపరురు వారి ప్రాంతాలకు తరలిపోయారని, 1800 మంది జిహాదీలు లొంగిపోయారని చెప్పారు. 2014 నుంచి ఎడతెరపి లేకుండా తాము చేస్తున్న దాడుల వల్ల సిరియా నుంచి పొరుగున ఉన్న ఇరాక్, బాగ్దాది ప్రాంతాలకు జిహాదీలు పరారయ్యారని ఆయన వివరించారు. కాగా, తీవ్రవాదం వల్ల తీవ్రంగా నష్టపోయిన సిరియాకు అండగా అమెరికా అండగా నిలిచింది. దాంతో యూఎస్ దళాలతో కలిసి ఎస్‌డిఎఫ్‌కు చెందిన ఖుర్దీష్ దళాలు ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు నిర్వహించడంతో ఆ దేశం ఇప్పుడిప్పుడే ఉగ్రవాదుల ఆధిపత్యం నుంచి బయటపడుతోంది. కాగా, తమ దళాలను ఉపసంహరించుకుంటున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఎయిర్ ఇండియా మాజీ చైర్మన్‌పై సీబీఐ కేసు

పదోన్నతుల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణ

న్యూఢిల్లీ, జనవరి 23: ఉద్యోగ నియామకాలు, ప్రమోషన్లలో పలు అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణపై ఎయిర్ ఇండియా మాజీ చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ పై సీబీఐ బుధవారం కేసు నమోదు చేసింది. జాదవ్‌తో పాటు అప్పటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్పీ నక్వా, మాజీ అడిషనల్ జనరల్ మేనేజర్లు ఎ.కథ్‌పాలియా, అమితాబ్ సింగ్, రోహిత్ బాసిన్‌లపై అవినీతి నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు సీబీఐ వర్గాలు తెలిపాయి. అధికారులకు పదోన్నతి కల్పించేందుకు 2010లో ఏర్పాటు చేసిన ప్యానల్‌కు జాదర్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) హోదాలో ఉండేవారు. ఈ ప్యానల్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గుస్తావ్ బల్దాఫ్, ఏఎస్ సోమన్ మాజీ ఈడీ ఎల్పీ నక్వా సభ్యులుగా ఉన్నారు. ఎయిర్ ఇండియాలో జనరల్ మేనేజర్ (మెడికల్ సర్వీసెస్)లో జనరల్ మేనేజర్ హోదాలో పనిచేస్తున్న నక్వాను తాత్కాలికంగా అప్‌గ్రేడ్ చేసిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆమెకు సెప్టెంబర్ 1, 2009లో పదోన్నతి కల్పించారు. అయితే నిర్దేశిత సమయం ముగిసిన తర్వాత సెప్టెంబర్ 1, 2009లో ఆమెను రివర్ట్ చేస్తూ పూర్వస్థానం జనరల్ మేనేజర్ హోదాలోకి పంపించారు. అయితే ఏవియేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఆమె పాత హోదాలోకి వెళ్లకుండా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానే కొనసాగారు. ఈ విషయంలో ప్యానల్‌కు జనరల్ మేనేజర్‌గా వ్యవహరించిన జాదవ్ అక్రమాలకు పాల్పడినట్టు సీబీఐ ఆరోపణ. ఇది ఎయిర్ ఇండియా ప్రమోషన్ పాలసీని ఉల్లంఘించడమేనని పేర్కొంది. కమిటీ మెంబర్‌గా ఉన్న నక్వాకు పదోన్నతి కల్పించడమం నిబంధనలకు ఉల్లంఘించడమేనని, ఆమె ఆ పదవికి అర్హురాలు కాదని తెలిసినప్పటికీ జాదవ్ ఆమెను నియమించారని సీబీఐ తెలిపింది. కాగా, ఈ ప్యానల్ అడిషనల్ జనరల్ మేనేజర్స్ (ఆపరేషన్స్) ర్యాంకు అధికారులకు జనరల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పించేందుకు 15 మందిని ఇంటర్వ్యూకు పిలిచిందని సీబీఐ అధికారులు చెప్పారు. ఈ ప్యానెల్ ఎ.కథ్‌పలియా, అమితాబ్ ఇసంగ్, రోహిత్ బాసిన్, ఏకె గుజ్రాల్, ఎన్‌కె బేరిలకు పదోన్నతి కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే వీరిలో కథ్‌పాలియాపై క్రిమినల్ కేసు ఉందని, బాసిన్ సింగ్మరో ఇద్దరిపై పలు ఫిర్యాదులు ఉన్నాయని, వాటిపై విచారణ పెండింగ్‌లో ఉందని, మరో ఇద్దరిపై సైతం పలు ఆరోపణలు ఉన్నాయని ఇలా నియామకాల్లో పలు అక్రమాలకు పాల్పడిన జాదవ్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సీబీఐ వెల్లడించింది.

ఏడేళ్ల బాలికపై రేప్, హత్య

❒ మహారాష్ట్రలో దారుణం ❒ నిందితుడు ఆత్మహత్య

❒ తల్లిపై కక్షతో కుమార్తెపై ఘాతుకం

పూణె, జనవరి 23: తల్లిపై కన్నేసిన ఓ దుర్మార్గుడు ఆమె లొంగకపోవడంతో ఏడేళ్ల కుమార్తెపై అత్యాచారం చేసిన హత్యచేశాడు. తరువాత రేపిస్టు చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. మహారాష్ట్రంలోని పూణె నగరంలోని మిలటరీ ఇంజనీరింగ్ కాలేజీ(సీఎంసీ) ప్రాంగణంలో ఈ దారుణం చోటుచేసుకుంది. క్యాంప్‌లోని చెట్టుకు 24 ఏళ్ల యువకుడు ఉరేసుకుని చనిపోయి ఉండడాన్ని పోలీసులు కనుగొన్నారు. అతడే బాలికపై అత్యాచారం చేసి హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం భర్తను కోల్పోయిన ఓ మహిళ ఏడేళ్ల చిన్నారితోకలసి కాలేజీ ప్రాంగణంలోనే ఉంటోంది. నిందితుడు కూడా అదే క్యాంపస్‌లో ఉంటున్నాడు. రెండు కుటుంబాలు సీఎంసీ సివిల్ స్టాఫ్ మెస్‌లో పనిచేస్తారు. మంగళవారం సాయంత్రం తల్లి పని నుంచి వచ్చేసరికి బాలిక అపస్మారక స్థితిలో పడి ఉంది. ఆందోళన చెందిన ఆమె క్యాంపస్‌లోనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. బాలిక అప్పటికే చనిపోయినట్టు ధృవీకరించిన వైద్యులు అంతకు ముందు ఆమెపై అత్యాచారం జరిగిందని తల్లికి చెప్పారు. అలాగే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొద్ది నెలల క్రితమే తన భర్త చనిపోయాడని తల్లి విచారణలో వెల్లడించింది. అప్పటి నుంచి పెళ్లి చేసుకోమని నిందితుడు వేధిస్తున్నట్టు వాపోయింది. యువకుడి కోరికను తిరస్కరించడంతో కక్షపెంచుకున్నాడని పోలీసులు చెప్పారు. ఈ సందర్భంలో సోమవారం రాత్రి ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుందని వారన్నారు. ఆమెపై కక్షపెంచుకున్న నిందితుడు మంగళవారం ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. బాలిక మృతి వార్త సమాచారం తెలుసుకున్న పోలీసులు తొలుత అతడిపైనే అనుమానం వ్యక్తం చేశారు. గాలింపుచర్యలు చేపట్టకా సీఎంసీ క్యాంప్‌స్‌లోని చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. 4వ నెంబర్ జాతీయ రహదారిని ఆనుకుని దాపోడీలో ఉన్న సీఎంసీ అత్యంత కీలకమైంది. మిలటరీ సాంకేతిక, వ్యూహాత్మక శిక్షణ ఇక్కడ ఇస్తుంటారు. పూణె జిల్లా ఖాడ్కీ కంటోన్మెంట్ పక్కనే సీఎంసీ ఉంది



కరాచీ కోర్టుకు బుధవారం హాజరైన పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ. కోట్లాది డాలర్ల విలువ చేసే మనీ లాండరింగ్‌కు పాల్పడినట్టు ఆరోపణలను ఎదుర్కొంటున్న జర్దారీకి, మరో ముద్దాయిగా ఉన్న ఆయన సోదరికి కోర్టు షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్‌ను మంజూరు చేసింది.

తేలని 'జమ్మలమడుగు' పంచాయితీ

★ నేడు ముఖ్యమంత్రి వద్ద మరోసారి చర్చలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: కడప జిల్లా జమ్మలమడుగు అసెంబ్లీ సీటుకు అభ్యర్థి ఎంపిక వ్యవహారం ఇంకా కొలిక్కిరాలేదు. ఈ వ్యవహారంపై గురువారం స్పష్టత రావచ్చని భావిస్తున్నారు. జమ్మలమడుగు సీటు కోసం ఒక మంత్రి, ఒక ఎమ్మెల్సీ పోటీ పడుతున్న విషయం తెలిసిందే. రాయలసీమ జిల్లాల్లో టీడీపీ అభ్యర్థుల ఖరారుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసరత్తు ప్రారంభించారు. కడప జిల్లాకు సంబంధించి జమ్మలమడుగు సీటుకు మంత్రి ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పోటీ పడటంతో దీనిపై పంచాయితీ ముఖ్యమంత్రి దగ్గరకు వచ్చింది. పోటీ పడుతున్న ఇద్దరిలో ఒకరికి ఎమ్మెల్యే టికెట్, మరొకరికి కడప ఎంపీ టికెట్ ఇచ్చే విధంగా ఇరు వర్గాల మధ్య కొద్ది నెలల క్రితం రాజీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తామని చెబుతూనే ఎవరికి వారు అసెంబ్లీ టిక్కెట్ తనకే అని ప్రచారం చేసుకుంటుండటంతో వ్యవహారం ముఖ్యమంత్రి దగ్గరకు చేరింది. ఈ స్థానానికి అభ్యర్థి ఎంపిక టీడీపీకి సమస్యగా మారింది. ప్రధానంగా కడప జిల్లాలో జమ్మలమడుగు అసెంబ్లీ సమస్య కొలిక్కివస్తే జిల్లాలో ఇతర నియోజకవర్గాలపై పార్టీ అధినేత దృష్టి సారించేందుకు వీలవుతుంది. చివరకు ఈ వ్యవహారం ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వద్దకు వచ్చింది. దీంతో ఉండవల్లిలోని సీఎం నివాసంలో వీరిద్దరితో పాటు, కడప జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో బుధవారం చంద్రబాబు సమావేశమై చర్చించారు. ఇద్దరూ అసెంబ్లీ టికెట్‌నే ఆశిస్తుండటంతో పార్టీ విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ఒకరు ఎమ్మెల్యేగా, మరొకరు కడప ఎంపీగా పోటీ చేసేలా ముఖ్యమంత్రి ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. జమ్మలమడుగు అసెంబ్లీ నుంచి 2004, 2009, 2014 ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు రామసుబ్బారెడ్డిపైనే ఆదినారాయణరెడ్డి గెలుపొందారు. 2014లో వైకాపా తరఫున గెలిచిన ఆదినారాయణరెడ్డి తరువాత టీడీపీలో చేరి మంత్రి పదవి చేపట్టారు. మూడు సందర్భాల్లోనూ ప్రత్యర్థి రామసుబ్బారెడ్డిపై గెలిచారు. అంతకు ముందు ఈ నియోజకవర్గం దివంగత శివారెడ్డి కాలం నుంచి రామసుబ్బారెడ్డి కుటుంబానికి, టీడీపీకి కంచుకోటగా ఉండేది. దీంతో రామసుబ్బారెడ్డి తనకే అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. మరోపక్క మంత్రి హోదాలో ఆదినారాయణరెడ్డి కూడా తనకు అసెంబ్లీ నుండి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. రామసుబ్బారెడ్డికి ఎమ్మెల్సీ పదవి, మండలి విప్ పదవి ఇచ్చి అధిష్ఠానం బుజ్జగించినప్పటికీ ఆయన అసెంబ్లీ సీటుపై పట్టు వీడటం లేదు. ఇద్దరూ ఒకే సీటుకు పోటీ పడుతుండటంతో మధ్యే మార్గంగా ఒకరు కడప ఎంపీగా, మరొకరు ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ప్రతిపాదనపై ఉదయం జరిగిన చర్చల్లో సానుకూల స్పందన రాకపోవటంతో సాయంత్రం మరోసారి సమావేశమై చర్చించేందుకు నిర్ణయించారు. అయితే సాయంత్రం చర్చలకు మంత్రి ఆదినారాయణ రెడ్డి వచ్చినప్పటికీ, రామసుబ్బారెడ్డి రాకపోవడంతో ఈ సమావేశాన్ని గురువారానికి వాయిదా వేశారు. అనారోగ్య కారణాల వల్ల సుబ్బారెడ్డి రాలేదని ఆయన అనుచర గణం చెబుతోంది.

గోదావరి డెల్టాకు వెయ్యి క్యూసెక్కుల నీరు

సీలేరు, జనవరి 23: గోదావరి డెల్టాకు డొంకరాయి రిజర్వాయర్ నుండి వెయ్యి క్యూసెక్కుల నీటిని బుధవారం నుండి అదనంగా విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ రామకోటి లింగేశ్వరావు తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 1 నుండి గోదావరి రబీ సాగుకు సీలేరు కాంప్లెక్స్ నుండి విద్యుత్ ఉత్పత్తి అనంతరం ఐదువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రబీ పంటకు నీటి అవసరం పెరిగిన నేపథ్యంలో మరో వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు కోరడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం నుండి ఈ నీటిని డొంకరాయి జలాశయం నుండి నేరుగా గోదావరికి విడుదల చేశామన్నారు. ఈ వెయ్యి క్యూసెక్కుల నీటితో కలిపి గోదావరి డెల్టాకు ఆరువేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందన్నారు. డిసెంబర్ నుండి మార్చి నెలాఖరు వరకు రబీ పంటకు 50 టీఎంసీల నీరు అవసరం ఉందని ఇరిగేషన్ శాఖ కోరిందన్నారు. డిసెంబర్ 1 నుండి ఇప్పటి వరకు సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నీటిని విడుదల చేసామన్నారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో ఏపీ వాటాతో కలుపుకుని గుంటవాడ, డొంకరాయి రిజర్వాయర్లలో మొత్తం 59 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది సీలేరు కాంప్లెక్స్‌కు వేసవిలో కూడా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చన్నారు.

గిరిజన గురుకుల విద్యార్థులకు ఇస్రో ఉపగ్రహ ప్రయోగంపై అవగాహన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 23: గిరిజన గురుకుల విద్యార్థులకు ఇస్రో ఉపగ్రహ ప్రయోగంపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించినట్టు గిరిజన గురుకులాల సంయుక్త డైరెక్టర్ డాక్టర్ ఈ నవీన్ నికోలస్ చెప్పారు. రాష్ట్రంలోని 314 ఆశ్రమ పాఠశాలలు నిర్వహిస్తున్నామని, ఇందులోని విద్యార్థులకు నిపుణుల ద్వారా ఆన్‌లైన్ ద్వారా పాఠాలలను అందించేందుకు గిరిజన సంక్షేమ కమిషనర్ కార్యాలయంలో ఉపగ్రహ ఆధారిత ఇ స్కూల్ సెంట్రల్ స్టుడియో ఏర్పాటు చేశామని అన్నారు. ఈ నెల 24న ఇస్రో పీఎస్ఎల్‌వీ -సీ 44 మిషన్‌ను చేపట్టనుందని, దానిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అవగాహన కల్పించాలని నిర్ణయించామని అన్నారు. ఈ ఏడాది సుమారు 17 మిషన్స్‌ను ఇస్రో నిర్వహించనుందని, ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇ స్కూల్ సెంట్రల్ స్టుడియో ద్వారా ప్రముఖ ఖగోళ పరిశోధకుడు పీఎస్ఐ డైరెక్టర్ ఎన్ రఘునందన్ విద్యార్థులకు అవగాహన కల్పించారని అన్నారు. 27 జిల్లాలకు చెందిన గిరిజన ఆశ్రమ విద్యార్థులు అంతా దీనిని ప్రత్యక్షంగా తిలకించారని, ఈ అవగాహన సదస్సులో ఇస్రో నుండి సేకరించిన వీడియోలు, చిత్రాలు , పీఎస్ఎల్‌వీ -సీ 44 ఉపగ్రహానికి చెందిన ప్రయోగ క్రమం వివరాలను విద్యార్థులకు అందించామని అన్నారు. తద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచి భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సాంఘిక గురుకులాల్లో ప్రవేశాలు

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో 2019-20 విద్యాసంవత్సరానికి గానూ ఇంటర్ ఫస్టియర్‌తో పాటు ఐఐటీ జేఈఈ , నీట్, ఎమ్సెట్, క్లాట్‌లకు కోచింగ్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రాంతీయ సమన్వయ అధికారి ఎం రమాదేవి చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు గురుకులాల అధికారులు డీ ఉమామహేశ్వరి (8008003630), పీ అపర్ణ (9704550192), జీ జయశ్రీ(8008885026)లను సంప్రదించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రమాదేవి వివరించారు.

సాంకేతికతతో 'సంక్షేమం'లో పారదర్శకత

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 23: సంక్షేమ కార్యక్రమాల అమలులో టెక్నాలజీతో పారదర్శకత సాధ్యమని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి లోకేష్ తెలిపారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో భాగంగా ఏపీ లాంజ్‌లో టెక్నాలజీస్ ఫర్ టుమారో అనే అంశంపై బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత అనేక సమస్యలు ఎదుర్కొన్నామన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే ఏపీలో తలసరి ఆదాయం తక్కువగా ఉందన్నారు. సంక్షోభంలోనే అవకాశం వెతుక్కోవాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. 15 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తక్కువ సమయంలో అభివృద్ధి సాధించేందుకు టెక్నాలజీ దోహదపడుతుందన్నారు. టెక్నాలజీ వినియోగంలో ఏపీ అందరి కంటే ముందు ఉందని, ప్రజల సంతోష సూచిని తెలుసుకుంటున్నామన్నారు. కాగిత రహిత పాలన అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మార్ష్ అండ్ మేక్లీనన్ కంపెనీ చైర్మన్ అలెగ్జాండర్ ఎస్ మాక్జర్స్కీతో, పెగా సిస్టిమ్స్ సీఈవో ట్రెఫ్లర్‌తో సమావేశమయ్యారు. నెస్లే ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ క్రిష్ జాన్సన్స్‌తో జరిగిన భేటీలో మంత్రి మాట్లాడుతూ ఏపీలో వ్యవసాయం, పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అరకు కాఫీ, టస్సర్ సిల్క్ చీరల తరహాలో దాదాపు 5000 బ్రాండ్‌లను ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. దీనిపై క్రిష్ స్పందిస్తూ, ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రూరల్ బ్రాండ్స్ మార్కెటింగ్‌కు సహకరిస్తామని, త్వరలోనే ఏపీలో తమ బృందం పర్యటిస్తుందన్నారు.

విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు

★ డ్రైవర్ అప్రమత్తతతో 52 మంది ప్రయాణికులు క్షేమం



ఆర్టీసీ డ్రైవర్ మహేందర్‌ను అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలిస్తున్న దృశ్యం

పెద్దపల్లి, జనవరి 23: గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు నడుపుతున్న డ్రైవర్ మహేందర్‌కు మార్గమధ్యంలోనే గుండె నొప్పి రావడంతో అప్రమత్తమై బస్సును పక్కకు ఆపి 52 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడి.. స్టీరింగ్ మీదనే కుప్పకూలిపోయిన సంఘటన బుధవారం పెద్దపల్లి జిల్లాలో చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని డిపోకు చెందిన టీఎస్ 22జెడ్-0034 గల ఆర్టీసీ బస్సు ఉదయం గోదావరిఖని నుండి వయా 8ఇన్ కాలనీ మీదుగా 52మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తోంది. మండలంలోని రాఘవాపూర్ సమీపంలోకి రాగానే ఆర్టీసీ డ్రైవర్ మహేందర్‌కు ఛాతిలో నొప్పి రావడంతో బస్సును ఆపి ప్రయాణికులను రక్షించాడు. అదే బస్సులో ప్రయాణిస్తున్న సింగరేణికి చెందిన డాక్టర్ చంద్రశేఖర్‌రావు బస్సులోనే డ్రైవర్‌కు ప్రథమ చికిత్స అందించారు. తర్వాత మహేందర్‌ను జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి సురక్షితంగా తరలించారు.

ఆక్సిజన్‌కు బదులు నెబ్‌లైజరా..!

ఆర్టీసీ డ్రైవర్‌కు చాతిలో నొప్పి తీవ్రతరం కావడంతో జిల్లా ప్రధాన ఆసుపత్రిలో కనీస వైద్య సదుపాయాలు లేవని డాక్టర్ చంద్రప్రకాశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం ఆక్సిజన్ కూడా అందుబాటులో లేదని వాపోయారు. ఈసీజీ తీయాలని డ్యూటీ డాక్టర్‌ను కోరగా టెక్నీషియన్ అందుబాటులో లేడని సమాధానం చెప్పారని, ఆక్సిజన్ బదులు నెబ్‌లైజర్ పెట్టడం ఏమిటని సింగరేణికి చెందిన డాక్టర్ చంద్రశేఖర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించే క్రమంలో అంబులెన్స్‌కు డీజిల్ డబ్బులు కూడా చెల్లించామన్నారు. బస్సులో ప్రయాణిస్తున్న డాక్టరే ఆర్టీసీ డ్రైవర్ ప్రాణాలు కాపాడారని, ఆయన ప్రథమ చికిత్స అందించకుంటే ఆర్టీసీ డ్రైవర్ ప్రాణాలు పోయేవని, బస్సులోని ప్రయాణికులు డాక్టర్‌ను అభినందించారు.

పత్రికల విధానం మారాలి

★ తెలంగాణపై అక్కసు ఎందుకు? ★ అభివృద్ధికి సహకరించాలి ★ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ★ 'చంటి' అభినందన సభలో కేటీఆర్ హామీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 23: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ, కొన్ని పత్రికలు నేటికీ తెలంగాణపట్ల అక్కసుతోనే వార్తలు, వ్యాసాలు రాస్తున్నాయని, ఈ విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆందోలు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికైన జర్నలిస్టు చంటి క్రాంతికిరణ్‌ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్, మీడియా అకాడమీ సంయుక్తంగా బుధవారం ఇక్కడి ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో సన్మానించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ, తెలంగాణపై ఆధిపత్యం ఉండాలన్న భావన పత్రికలకు ఉండటం సముచితం కాదన్నారు. పత్రికల విషయంలో వివాదం కావాలని ప్రభుత్వం కోరుకోవడం లేదని, తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను యథాతథంగా ప్రజలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ వార్తలను తెలంగాణ ఎడిషన్లలో ప్రముఖంగా ప్రచురిస్తున్న కొన్ని పత్రికలు, తెలంగాణ వార్తలను మాత్రం ఏపీ ఎడిషన్లలో ప్రచురించడం లేదన్నారు. 'మేం చెప్పేదే వేదం' అన్న భావన ఈ పత్రికల యాజమాన్యంలో కనిపిస్తోందని, ఈ భావన తొలిగిపోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణవారికి తెలివిలేదన్న భావన కూడా ఈ పత్రికల యాజమాన్యంలో ఉన్నట్టు అనిపిస్తోందన్నారు. ఈ విధానం ఇప్పటికైనా ఆపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ తరహా పత్రికల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటే 'పత్రికా స్వేచ్ఛ' కు అడ్డువస్తున్నారంటూ రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఈ పత్రికలకు దాసోహం అనాలా అంటూ ప్రశ్నించారు.

ఆపదమొక్కులు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆపదమొక్కులు తీర్చుకుంటున్నారని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. కేసీఆర్ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను యథాతథంగా కాపీకొట్టి, ఏపీలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఏపీ ప్రజలను మభ్యపెట్టేందుకు బాబు నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. *తెలంగాణ 'కలం'వీరులు తెలంగాణ ఉనికివైపు నిలవాలని, తెలంగాణ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కేటీఆర్ కోరారు. బంగారు తెలంగాణ కోసం జరుగుతున్న కృషికి పత్రికలు చేయూత ఇవ్వాలని కోరారు. తెలంగాణ పత్రికలకు చేయూత ఇస్తామని హామీ ఇచ్చారు.*

రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. టీఆర్ఎస్ విజయం సాధించిన తర్వాత ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'మీట్ ది మీడియా' సమావేశంలో ఇదే అంశం చెప్పానని గుర్తు చేశారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉండే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం, హెల్త్ కార్డులు ఇవ్వడం, సంక్షేమ పథకాలు అమలు చేయించడం తదితర అంశాలపై జర్నలిస్టులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులతో పాటు న్యాయవాదులు, ఇతర రంగాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని కేటీఆర్ గుర్తు చేశారు. అలాగే అవకాశం ఉన్న చోట్ల ప్రభుత్వంలో కూడా జర్నలిస్టులను భాగస్వాములను చేస్తున్నారన్నారు. చంటిక్రాంతికుమార్, రామలింగారెడ్డిలను ఎమ్మెల్యేలు అయ్యేందుకు అవకాశం ఇచ్చారని ఆర్. సత్యనారాయణకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని, మాజీ జర్నలిస్టు కే. కేశవరావుకు అత్యంతప్రాధాన్యత ఇచ్చారని, టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌గా ఘంటా చక్రపాణిని నియమించారని, మీడియా అకాడమీ చైర్మన్‌గా అల్లం నారాయణను నియమించారని గుర్తు చేశారు. జర్నలిస్టుల సమస్యలు ఒకదాని తర్వాత మరొకటి పరిష్కరించుకుంటూ వస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జర్నలిస్టుల సమస్యలు తెలుసునని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. *జర్నలిస్టుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం 100 కోట్ల రూపాయలు కేటాయించి, ఇప్పటి వరకు 34 కోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునేందుకు ఆ యా కుటుంబాలకు లక్ష రూపాయల నగదు ఇస్తూ, నెలకు మూడువేల రూపాయలు పింఛన్‌గా ఇస్తున్నామన్నారు. ఇప్పటికే 150 కుటుంబాలు ఈ తరహా సాయం అందుకుంటున్నాయని, పెండింగ్‌లో ఉన్న మరో 50కుటుంబాల దరఖాస్తుదారులకు ఈ నెల చివరి వరకు సాయం అందిస్తామన్నారు.*

1వ పేజీ తరువాయి

యూపీ తూర్పు విభాగం ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక

చేదోడువాదోడుగా ఉంటారు.

లోక్‌సభకు పోటీ!

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపడుతున్న ప్రియాంక ఏప్రిల్‌లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లోసోనియా ప్రాతినిధ్యం వహిస్తున్న రాయబరేలీ లోక్‌సభ నియోజకవర్గం నుండి పోటీ చేసే అవకాశాలున్నాయని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. సోనియా అనారోగ్యం మూలంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చునన్న ఊహాగానాలు చాలా కాలం నుంచి ఉన్న విషయం తెలిసిందే. సోనియా స్థానంలో పోటీ చేసేందుకే ప్రియాంకను ఇప్పుడు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించారని అంటున్నారు. బీఎస్పీ, ఎస్పీ, తృణమూల్ కాంగ్రెస్ తదితర మిత్రపక్షాలు రాహుల్ నాయకత్వంలో పని చేసేందుకు సిద్ధపడటం లేదు. సోనియా ఈ పరిణామాలన్నింటిని లోతుగా పరిశీలించిన తరువాతనే ప్రియాంకను ప్రత్యక్ష రాజకీయాలలోకి తెచ్చారని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

రాహుల్ గాంధీ వైఫల్యం

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విఫలమవుతున్నారు కాబట్టే ప్రియాంకా గాంధీని రాజకీయాలలోకి తెస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా విమర్శించారు. సంబిత్ పాత్రా బుధవారం ప్రియాంకా గాంధీని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించటంపై వ్యాఖ్యానిస్తూ కుటుంబ పాలనకు ఇది పరాకాష్టఅని దుయ్యబట్టారు. ఇది జాతీయ కాంగ్రెస్ కాదు, గాంధీ కుటుంబ పార్టీ అందుకే ప్రియాంకా గాంధీకి పట్టాభిషేకం చేయించారంటూ ఆయన వ్యంగ్య బాణాలు వేశారు. రాహుల్ గాంధీ వైఫల్యం చెందారనేందుకు ప్రియాంకా గాంధీ నియామకం ప్రబల నిదర్శనమని పాత్రా చెప్పారు. మహాకూటమి ఏర్పాటులో కాంగ్రెస్‌ను చేర్చుకునేందుకు ఆయా మిత్రపక్షాలు తిరస్కరించటంతో ఏకాకిగా మారిన రాహుల్ గాంధీ చివరకు ప్రియాంకా గాంధీని తెచ్చుకోకతప్పలేదన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షాలు సైతం రాహుల్ గాంధీని తిరస్కరిస్తున్నాయన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు చుక్కెదురైంది, ఇప్పుడు బిహార్‌లో కూడా మిత్ర పక్షాల నుండి కాంగ్రెస్‌కు ఇలాంటి పరిస్థితే ఎదురవుతోందని సంబిత్ పాత్ర చెప్పారు. భారత దేశంలో నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, ఆయన తరువాత సోనియా గాంధీ, సోనియా గాంధీ తరువాత రాహుల్ గాంధీ, ఇప్పుడు రాహుల్ గాంధీ తరువాత ప్రియాంకా గాంధీ పదవులు చేపడుతున్నారు, అదంతా ఒక కుటుంబ వ్యవహారమని ఆయన దుయ్యబట్టారు. బీజేపీలో ఇలా జరగదు, పార్టీ ఒక కుటుంబంగా పని చేస్తుంది, అక్కడ కుటుంబం ఒక పార్టీగా పని చేస్తుందని పాత్ర విమర్శలు గుప్పించారు. ప్రియాంకా గాంధీని ప్రధాన కార్యదర్శిగా నియమించటం ద్వారా రాహుల్ గాంధీ వైఫల్యాన్ని కాంగ్రెస్ అంగీకరించిందని సంబిత్ పాత్ర చెప్పారు.

బీజేపీ భయపడుతోంది

చేసుకుంటున్నారని, యూపీలో కాంగ్రెస్‌ను పటిష్టం చేసేందుకు తాను కొన్ని చర్యలు తీసుకున్నానని రాహుల్ వివరించారు. కాంగ్రెస్, బీఎస్పీ, ఎస్పీ ఏకైక లక్ష్యం బీజేపీని ఓడించడమేనని స్పష్టం చేశారు. కాబట్టి, వీలున్నంత వరకు కలిసి పని చేస్తామని రాహుల్ తెలిపారు. మాయావతి, అఖిలేష్‌తో తమకు శతృత్వం లేదన్నారు. వారి పట్ల ప్రేమ ఉన్నదని, అయితే తాము కాంగ్రెస్ సిద్ధాంతాల ఆధారంగా పని చేయవలసి ఉన్నదని రాహుల్ అన్నారు. ఇక మీదట యూపీలో తాము పూర్తి బలంతో పోటీ పడతామని రాహుల్ ప్రకటించారు. అఖిలేష్, మాయావతి తమతో చర్చలు జరపాలనుకుంటే జరపవచ్చునని, అందుకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. ప్రియాంక, జ్యోతిరాధిత్యను ఉత్తర ప్రదేశ్‌కు రెండుమూడు నెలల కోసం పంపిచడం లేదని వ్యాఖ్యానించారు. యూపీలో కాంగ్రెస్‌ను పునరుజ్జీవింపజేసే బాధ్యతను వీరిరువురికి అప్పగించానని రాహుల్ ప్రకటించారు. యూపీలో కాంగ్రెస్ సిద్ధాంతాలను మళ్లీ ప్రజల్లోకి తీసుకుపోవలసిన అవసరం ఉన్నదని చెప్పారు. బడుగు, బలహీన ప్రజల ప్రయోజనాలను కాపాడడం, అందరిని కలుపుకొనిపోతూ పని చేయటం కాంగ్రెస్ విధానమన్నారు. ప్రియాంక, జ్యోతిరాధిత్య బాగా పని చేస్తారు, యూపీ యువకులకు కావలసింది వారికి ఇస్తారన్నారు. ప్రజల అభివృద్ధి కోసం రాజకీయం చేస్తామని, ప్రియాంక, జ్యోతిరాదిత్య ముందుండి రాజకీయం నడిపిస్తారని రాహుల్ ప్రకటించారు. ఎన్నికల్లో పోటీ చేయాలావద్దా అనేది ప్రియాంక నిర్ణయించుకుంటారని ఆయన తెలిపారు. యూపీలో కాంగ్రెస్‌ను నిలబెట్టేందుకు ప్రియాంకను రాజకీయాల్లోకి తీసుకురావటం అనే పెద్ద నిర్ణయం తీసుకున్నామన్నారు. కష్టపడి పని చేసే సోదరి ప్రియాంక రాజకీయాలలోకి వచ్చి తనతో కలిసి పని చేయడ తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ఆయన అన్నారు.

కాపులకు 5 శాతం కోటాపై అభ్యంతరం ఏమిటి?

గుర్తు చేశారు. అందుకే ఈబీసీ 10 శాతం రిజర్వేషన్‌లో కాపులకు 5 శాతం ఇచ్చామన్నారు. కాపు రిజర్వేషన్లపై బీజేపీ, వైకాపా నేతలు వక్రీకరిస్తున్నారని, ఢిల్లీ వెళ్లి కాపుల రిజర్వేషన్ల గురించి అడగలేని అసమర్థులు వాళ్లని ఎద్దేవా చేశారు. కాపులకు మేలు చేసే టీడీపీని విమర్శిస్తున్నారన్నారు. కాపుల రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి, ఢిల్లీకి పంపామని, దానిపై ఏనాడైనా బీజేపీ, వైకాపా నేతలు మాట్లాడారా అని ప్రశ్నించారు. కాపులకు రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేసింది వైఎస్ అని ఆరోపించారు. కాపులకు 5 శాతం రిజర్వేషన్‌పై ఆ రెండు పార్టీలకు ఉన్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. అవినీతిని 85 శాతం నియంత్రించామని మోదీ చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. రాఫెల్ 43 వేల కోట్ల రూపాయల కుంభకోణం అంటే అవినీతి నియంత్రణా అని విమర్శించారు. వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు పరార్ కావడం అవినీతి నియంత్రణా అని ప్రశ్నించారు. బ్యాంక్‌లను మోసం చేయడం కూడా నియంత్రణేనా అన్నారు. నమ్మకమే బ్యాంకింగ్ వ్యవస్థలకు మూల స్తంభమని, మోదీ పాలనలో మూల స్తంభాన్నే కూలగొట్టారని విమర్శించారు. బ్యాంకింగ్ వ్యవస్థపై భద్రతను, ప్రజల నమ్మకాన్ని దెబ్బతీశారన్నారు. వేల కోట్లు బ్యాంక్‌లకు ఎగ్గొట్టి విదేశాలకు పరారయ్యారన్నారు. దావోస్‌లో రఘురామ రాజన్ వ్యాఖ్యలు మోదీ పాలన డొల్లతనాన్ని బయటపెట్టాయన్నారు. బీజేపీ పాలనలో సంస్కరణలు పడకేశాయనే ఆందోళన ఉందని, ఉద్యోగాల సృష్టి సక్రమంగా జరగలేదనే బాధ ఉందన్నారు. గతంలో ఉన్న స్వేచ్ఛ ఇప్పుడు లేదన్న ఒత్తిడి ఆర్బీఐకి ఉందన్నారు. కోల్‌కతా ర్యాలీ ప్రకంపనల నుంచి అమిత్ షా, మోదీ తేరుకోలేదని వ్యాఖ్యానించారు. ఈవీఎంలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని, ఆ చర్చను పక్కదారి పట్టించాలని బీజేపీ చూస్తోందన్నారు. మళ్లీ బ్యాలెట్ పేపరు కావాలనేది అందరి డిమాండ్ అన్నారు. లేదా వీవీ ప్యాట్ రశీదులు 100 శాతం నియోజకవర్గాల్లో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దావోస్‌లో మంత్రి లోకేష్ పర్యటన సత్ఫలితాలు ఇస్తోందన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయన్నారు. 13 జిల్లాల్లో పారిశ్రామీకరణలో ఇదో ముందంజగా అభివర్ణించారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం నెలకొందన్నారు. జడ్‌బీఎన్ఎఫ్‌పై వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడానని, మన ప్రకృతి సేద్యంపై ప్రపంచం మొత్తం ఆసక్తి చూపిస్తోందన్నారు. సాంకేతికతతో సహకరించేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. 24 వేల కోట్ల రూపాయల రుణమాఫీ రైతులకు చేశామని, కౌలు రైతులకు 5 వేల కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడం దేశంలోనే చరిత్ర అన్నారు. పశుగ్రాస విధానం తెచ్చామని, వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పేదల సంక్షేమానికి తీసుకున్న చర్యలు వివరించాలన్నారు. ఆటోలు, ట్రాక్టర్లపై పన్ను తొలగింపు ఎంతో ఊరటనిచ్చే అంశమన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ టీడీపీకి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆటోలు, ట్రాక్టర్లపై టీడీపీ జెండా ఎగరాలన్నారు. టీడీపీ స్టిక్కర్లతో ఆటోలకు కొత్త అందాలు రావాలన్నారు. కార్యకర్తలంతా ఐక్యంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. 36 సంవత్సరాలుగా పార్టీ జెండా మోస్తూ, పార్టీ కోసం పరితపిస్తున్నారన్నారు.

ఏపీలో ఒంటరిగానే పోటీ

కార్యవర్గ సమావేశంలోనూ పాల్గొని అందరి అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత ఈ ప్రకటన చేశారు. ఈ నెల 31వ తేదీన జరిగే పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గ సమావేశాల్లో తమ పార్టీ భవిష్యత్ కార్యాచరణను ప్రధానంగా బస్సుయాత్రపై ప్రకటన చేస్తామన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా, తూర్పు ఉత్తరప్రదేశ్ ఇన్‌చార్జిగా ప్రియాంకా గాంధీ నియమితులు కావటంపై ఉమెన్ చాందీ హర్షం వెలిబుచ్చారు. ఆమె తెలివైన, ధైర్యవంతురాలైన నాయకురాలన్నారు. దేశ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర వహించబోతుండటం హర్షదాయకమన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని దేశ ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారన్నారు. ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, విభజన హామీలు అమలు కావాలన్నా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాహుల్ గాంధీకి ప్రియాంక తోడ్పాటు పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని కల్గిస్తోందన్నారు. అమ్మ ఇందిరా గాంధీనే తమతో ఉన్నట్లుగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు భావిస్తున్నారన్నారు. నేడు దేశ రాజకీయాల్లో భయానక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, మోదీ చేతిలో భారతమాత విలవిల్లాడిపోతున్నదని ఇలాంటి స్థితిలో దేశ రాజకీయాలను గాడిలో పెట్టడానికి తిరిగి కాంగ్రెస్ అధికారంలో రావాల్సి ఉందన్నారు. పీసీసీ అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 1న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆ రోజు ప్రత్యేకహోదా సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర బంద్‌లో అన్ని పార్టీలు అన్ని వర్గాలు, ప్రజలు పాల్గొనాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శులు సీడీ మెయ్యప్పన్, క్రిస్టాఫర్ తిలక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, 13 జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడే నింగిలోకి పీఎల్ఎల్‌వీ-సీ 44 రాకెట్

సమావేశమై ప్రయోగానికి సంసిద్ధత తెలిపారు. ప్రయోగ సన్నాహాల్లో భాగంగా శాస్త్రవేత్తలు ప్రీ కౌంటౌడౌన్‌ను కూడా విజయవంతంగా నిర్వహించారు. ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్‌ను బుధవారం రాత్రి సరిగ్గా 7:37 గంటలకు ప్రారంభించారు. కౌంట్‌డౌన్ 28 గంటలు నిర్విఘ్నంగా కొనసాగినంతం పీఎస్ఎల్‌వీ-సీ 44 రాకెట్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి ఎగరనుంది. ఈ రాకెట్ ద్వారా తమిళనాడు హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన కలాం శాట్, ఇస్రో రూపొందించిన మైక్రోశాట్-ఆర్ రెండు ఉపగ్రహాలను రోదసీలోకి పంపనున్నారు. ఎప్పుడూ ఏదోఒక కొత్తదనంతో ప్రయోగాలు చేపట్టే ఇస్రో ఈ ప్రయోగానికి రెండు స్ట్రాపాన్ బూస్టర్లతోనే రాకెట్‌ను నింగిలోకి పంపేందుకు శ్రీకారం చుట్టింది. ఈ తరహా ప్రయోగానికి పీఎస్ఎల్‌వీ-డీఎల్ అని పేరుతో ఈ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. షార్ నుంచి 70వ ప్రయోగం కాగా పీఎస్ఎల్‌వీ ప్రయోగాల్లో 46వ ప్రయోగం కావడం విశేషం.

టీడీపీ, జనసేన కలిస్తే తప్పేంటి?

సర్వే నివేదికల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. సర్వేల్లో తన కుమారుడు భరత్‌కు ఎక్కువ ప్రజాదరణ వస్తే, కర్నూలు అసెంబ్లీ సీటు ఇవ్వాలని, ఒక వేళ మోహన్ రెడ్డికి వస్తే, ఆయనకు ఇవ్వాలని సీఎంకు చెప్పినట్లు తెలిపారు.

కాగా, టీడీపీతో జనసేన కలిస్తే తప్పేంటి అంటూ టీజీ వెంకటేష్ చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ విధానాలపై వ్యక్తిగత ప్రకటనలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఈ తరహా ప్రకటనల ద్వారా పార్టీ కార్యకర్తలను ఆయోమయానికి గురి చేయవద్దని హితవుపలికారు. పార్టీ విధానాలపై మాట్లాడేటప్పుడు సంయమనం కోల్పోవద్దని సూచించారు.

క్రీడాభూమి

సెరెనా, నిషికోరి ఆశలు ఆవిరి

★ క్వార్టర్ ఫైనల్స్‌లోనే నిష్క్రమించిన స్టార్లు
★ సెమీస్‌కు జొకోవిచ్, ఒసాకా, ప్లిస్కొవా, లుకాస్

ఆస్ట్రేలియా ఓపెన్


నవోమి ఒసాకా
సెరెనా విలియమ్స్
కరోలినా ప్లిస్కోవా
నవాక్ జొకోవిచ్


లుకాస్ పౌల్లీ



కీ నిషికొరి

మెల్‌బోర్న్, జనవరి 23: అమెరికా టెన్నిస్ స్టార్, నల్ల కలువ, 24వసారి గ్రాండ్ శ్లామ్ టైటిల్ చేజిక్కించుకోవాలని ఉబలాటపడిన ప్రపంచ నెంబర్ 16 క్రీడాకారిణి సెరెనా విలియమ్స్‌కు ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో నిరాశే ఎదురైంది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో తన సమీప ప్రత్యర్థి, వరల్డ్ నెంబర్ 7 ర్యాంకర్, చెక్ క్రీడాకారిణి కరోలినా ప్లిస్కోవా చేతిలో ఓటమిని ఎదుర్కొంది. ఈ పోటీలో 6-4, 4-6, 7-5 తేడాతో సెరెనాను ఓడించిన ప్లిస్కోవా సెమీఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లోని మొదటి సెట్‌లో ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చిన సెరెనా రెండో సెట్‌లో పైచేయి సాధించింది. అయితే, మూడో సెట్‌లో కరోలినా అద్భుతంగా ఆడడంతో ప్రత్యర్థికి గట్టి ప్రతిఘటన ఇచ్చినప్పటికీ సెరెనా ఆస్ట్రేలియా ఓపెన్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఇక మహిళల సింగిల్స్‌లో జరిగిన మరో పోటీలో ప్రపంచ నెంబర్, జపాన్‌కు చెందిన నవోమి ఒకాసాకు ఎదురు లేకుండా పోయింది. సెమీస్‌లో బెర్త్ కోసం జరిగిన మ్యాచ్‌లో ఒసాకా తన సమీప ప్రత్యర్థి, ఉక్రెయిన్‌కు చెందిన వరల్డ్ నెంబర్ 6వ ర్యాంకర్ ఎలినా స్విటొలినాను 6-4, 6-1 తేడాతో ఓడించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌లో జరిగిన పోటీలో ప్రపంచ నెంబర్ వన్, సెర్బియా స్టార్ దిగ్గజం నవోక్ జొకోవిచ్ ముందు జపాన్ స్టార్, ప్రపంచ నెంబర్ 8వ ర్యాంకర్ కీ నిషికొరి తలొగ్గాల్సి వచ్చింది. సెమీఫైనల్స్‌లో చోటు కోసం జరిగిన ప్రతిష్టాత్మక పోటీలో 6-4, 4-1 తేడాతో జొకోవిచ్ విజయం సాధించాడు. పురుషుల సింగిల్స్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ 28వ ర్యాంకర్, ఫ్రెంచ్‌కు చెందిన లుకాస్ పౌలీ తన సమీప ప్రత్యర్థి, కెనడాకు చెందిన ప్రపంచ 16వ ర్యాంకర్ మిలొస్ రావొనిక్‌ను 7-6 (7-4), 6-3, 6-7 (2-7), 6-4 తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌లో బెర్త్ ఖాయం చేసుకున్నాడు.

వివాదాలు వదిలి.. ఆటపై దృష్టి

నేడు న్యూజిలాండ్‌తో టీమిండియా మహిళల తొలి వన్డే

నేపియర్, జనవరి 23: గత ఏడాది టీ-20 వరల్డ్ కప్ సందర్భంగా ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్స్‌లో చోటుదక్కని భారత మహిళా క్రికెటర్ మిథాలీ రాజ్ వివాదం సద్దుమణిగిన నేపథ్యంలో ఇపుడు న్యూజిలాండ్‌లో ఆ జట్టు మూడు వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లకు సిద్ధమవుతోంది. గురువారం ఇక్కడి మైదానంలో తొలి వన్డేలో భారత వన్డే ఇంటర్నేషనల్ టీమ్ కెప్టెన్ మిథాలీ రాజ్ నాయకత్వంలో జట్టు సత్తా చూపాలని ఉవ్విళ్లూరుతోంది. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం టీమిండియా మహిళా జట్టు ఐదో స్థానంలో ఉన్న నేపథ్యంలో ఆతిథ్య జట్టుతో జరిగే వన్డేలు తమకు చాలా ముఖ్యమైనవని కెప్టెన్ మిథాలీ రాజ్ మ్యాచ్ జరగడానికి ముందుకు జరిగిన మీడియా సమావేశంలో పేర్కొంది. వరల్డ్ కప్‌తోపాటు వరల్డ్ టీ-20లో సైతం న్యూజిలాండ్‌ను తాము ఓడించి సగర్వంతో నిలబడడంతో ఇపుడు ఆతిథ్య జట్టుపై పైచేయి సాధించేందుకు మానసికంగా తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది.


అర్ధసెంచరీ సాధించిన ధావన్‌ను అభినందిస్తున్న కోహ్లీ

టీమిండియాదే తొలి వన్డే

8 వికెట్ల తేడాతో కోహ్లీ సేన గెలుపు

కివీస్‌పై 1-0తో భారత్ ఆధిక్యం

సూర్యుడి ఆటంకం..కాసేపు నిలిచిన మ్యాచ్

నేపియర్, జనవరి 23: న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా శుభారంభం చేసింది. ఆతిథ్య జట్టుతో జరుగనున్న 5 వన్డే ఇంటర్నేషనల్ సిరీస్‌లో భాగంగా బుధవారం ఇక్కడి మెక్‌క్లీన్ పార్క్‌లో జరిగిన తొలి వన్డేలో కోహ్లీ సేన 8 వికెట్ల తేడాతో ఘన విజయంతో ప్రత్యర్థిపై 1-0తో ఆధిక్యంలో నిలిచింది. భారత బౌలర్లు మహమ్మద్ షమీ 19/3, కుల్దీప్ యాదవ్ 39/4తో అద్భుతంగా రాణించారు. తొలుత టాస్ గెలిచిన కివీస్ బ్యాటింగ్‌ను ఎంచుకుంది. ఎక్కడైనా వర్షం కారణంగా మ్యాచ్‌లు నిలిచిపోవడం జరుగుతుంది. కానీ న్యూజిలాండ్‌లో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపించాయి. భారత్ జట్టు బ్యాటింగ్ సమయంలో సూర్యుడు ఆటంకం కల్పించడంతో మ్యాచ్‌ను దాదాపు అరగంటపాటు నిలిపివేశారు. ప్రపంచంలోని చాలాదేశాల్లో పిచ్‌లు ఉత్తర, దక్షిణ అభిముఖంగా ఉంటాయి. కానీ కివీస్‌లోని మెక్‌క్లీన్ పార్క్ మైదానం పిచ్ మాత్రం అందుకు భిన్నంగా ఉంటుంది. ఇక్కడి పిచ్ తూర్పు, పడమర ముఖంగా ఉండడంతో సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో బ్యాట్స్‌మెన్‌లు బంతులను ఎదుర్కోవడం కష్టమవుతుంది. సూర్యకిరణాలు నేరుగా బ్యాట్స్‌మెన్ కళ్లలోకి పడడంతో బుధవారం నాటి తొలి వన్డేలో డిన్నర్ తర్వాత కాసేపు మ్యాచ్‌ను నిలిపివేశారు. ఒక అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లో తొలిసారిగా సూర్యకిరణాల వల్ల మ్యాచ్‌కు కాసేపు అంతరాయం కలగడం ఇదే తొలిసారి. ఆ తర్వాత మ్యాచ్‌ను కొనసాగించగా ఆతిథ్య కివీస్ 38 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. సూర్యకిరణాల కారణంగా మ్యాచ్ నిరాఘాటంగా జరుగకుండా దాదాపు అంతరాయం కలిగించిన నేపథ్యంలో ఆటగాళ్లకు వడదెబ్బ తగిలే ప్రమాదాన్ని ఊహించిన ఆన్‌ఫీల్డ్ ఎంపైర్ షాన్ జార్జ్ వారితోపాటు ఎంపైర్ల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని డక్ వర్త్ లూయిస్ పద్ధతి అనుసరించి ప్రత్యర్థి లక్ష్యాన్ని కుదించారు. ఆ తర్వాత బరిలోకి దిగిన భారత్ 34.5 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 156 పరుగులు చేసి తొలి వన్డేని తన ఖాతాలో జమ చేసుకుంది.

తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఓపెనర్లను పెవిలియన్‌కు పంపడం ద్వారా మహమ్మద్ షమీ ప్రత్యర్థిని బలంగా దెబ్బతీశాడు. 9 బంతులు ఎదుర్కొన్న మార్టిన్ గుప్తిల్ 1 బౌండరీతో 5 పరుగులు చేసి మహమ్మద్ షమీ చేతిలో బౌల్డ్ అయ్యాడు. కొలిన్ మున్రో 9 బంతులు ఎదుర్కొని 2 బౌండరీలతో 8 పరుగులు చేసి మహమ్మద్ షమీ చేతిలోనే బౌల్డ్ అయ్యాడు. 41 బంతులు ఎదుర్కొన్న రాస్ టేలర్ 3 బౌండరీలతో 24 పరుగులు చేసి యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌లో అతనికే క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. వికెట్ కీపర్ టామ్ లాథమ్ 10 బంతులు ఎదుర్కొని 1 బౌండరీతో 11 పరుగులు చేసి యుజేంద్ర చాహల్ బౌలింగ్‌లో అతనికే క్యాచ్ ఇచ్చాడు. 17 బంతులు ఎదుర్కొన్న హెన్రీ నికొలస్ 1 బౌండరీతో 12 పరుగులు చేసి కేదార్ జాదవ్ బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారిపట్టాడు. మిచెల్ సంత్నెర్ 21 బంతులు ఎదుర్కొని 1 సిక్సర్, మరో బౌండరీతో 14 పరుగులు చేసి మహమ్మద్ షమీ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుతిరిగాడు. కెప్టెన్ కేన్ విలియమ్‌సన్ 81 బంతులు ఎదుర్కొని 7 బౌండరీలతో చెలరేగి 64 పరుగులు చేసి కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో విజయ్ శంకర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారిపట్టాడు డౌగ్ బ్రేస్‌వెల్ 15 బంతులు ఎదుర్కొని 1 బౌండరీతో 7 పరుగులు చేసి కుల్దీప్ యాదవ్ చేతిలో బౌల్డ్ అయ్యాడు. 3 బంతులు ఎదుర్కొని పరుగులేమీ చేయని లాక్లీ ఫెర్గసన్‌ను కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో ధోనీ స్టంపవుట్ చేశాడు. ట్రెంట్ బౌల్ట్ 10 బంతులు ఎదుర్కొని 1 పరుగు చేసి కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చాడు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 10 ఓవర్లలో 39 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ షమీ 6 ఓవర్లలో 19 పరుగులు, యుజ్వేంద్ర చాహల్ 10 ఓవర్లలో 43 పరుగులిచ్చి 2 వికెట్లు, కేదార్ జాదవ్ 3 ఓవర్లలో 17 పరుగులిచ్చి 1 వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ భారత్ జట్టులో ఓపెనర్ రోహిత్ శర్మ నిరాశపరిచినా మరో ఓపెనర్, స్టయిలిష్ బ్యాట్స్‌మన్ శిఖర్ ధావన్ మ్యాచ్‌ను గెలిపించే బాధ్యతను నిర్వర్తించాడు. 24 బంతులు ఎదుర్కొన్న రోహిత్ శర్మ 1 బౌండరీతో 11 పరుగులు చేసి బ్రేస్‌వెల్ బౌలింగ్‌లో మార్టిన్ గుప్తిల్‌కు క్యాచ్ ఇచ్చాడు. కెప్టెన్ విరాట్ కోహ్లీ 59 బంతులు ఎదుర్కొని 3 బౌండరీలతో 45 పరుగులు చేసి లాక్లే ఫెర్గ‌సన్ బౌలింగ్‌లో లియాన్ నాథన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారిపట్టాడు. 103 పరుగులు ఎదుర్కొన్న శిఖర్ ధావన్ 6 బౌండరీలతో 75, అంబటి రాయుడు 23 బంతులు ఎదుర్కొని 2 బౌండరీలతో 13 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. న్యూజిలాండ్ బౌలర్లలో లాక్లే ఫెర్గసన్ 8 ఓవర్లలో 42, డౌగ్ బ్రేస్‌వెల్ 7 ఓవర్లలో 23 పరుగులిచ్చి తలో వికెట్ తీసుకున్నారు.

56 వన్డేలు..100 వికెట్లు

తొలి భారత బౌలర్‌గా మహమ్మద్ షమీ

టీమిండియా పేసర్, 28 ఏళ్ల మహమ్మద్ షమీ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన తొలి వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో 6 ఓవర్లలో 19 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. దీంతో వన్డేల్లో వేగంగా 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా షమీ రికార్డు పుటల్లో చోటుదక్కించుకున్నాడు. కివీస్‌తో జరిగిన 50 ఓవర్ల మ్యాచ్ షమీకి 56వది కావడం గమనార్హం. కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రోత్సాహం, జట్టు మేనేజిమెంట్ మద్దతు వల్లే తాను ఈ ఘతను సాధించగలిగానని షమీ మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ అన్నాడు. షమీ వన్డే కెరీర్‌లో 100వ వికెట్ న్యూజిలాండ్ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ మార్టిన్ గుప్తిల్‌ది కావడం విశేషం. తొలి వన్డేలో అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్న షమీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును దక్కించుకున్నాడు. మహమ్మద్ షమీ తర్వాత భారత బౌలర్లలో జహీర్ ఖాన్ (59 వన్డేలు), అజిత్ ఆగార్కర్ (67 వన్డేలు), జవగళ్ శ్రీనాథ్ (68 వన్డేలు) 100 వికెట్లు సాధించారు.

షమీపై కోహ్లీ పొగడ్తల వర్షం

వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో త్వరితగతిన 100 వికెట్లు తీసిన భారత తొలి బౌలర్‌గా ఘనత వహించిన పేసర్ మహమ్మద్ షమీపై టీమిండియా సారథి విరాట్ కోహ్లీ పొగడ్తల వర్షం కురిపించాడు. గత ఏడాది యోయో ఫిట్నెస్ కారణంగా జట్టుకు దూరంగా ఉండడంతోపాటు కుటుంబ వ్యవహారాలు కొంత ఇబ్బంది కలుగజేసినా అన్నింటినీ తట్టుకుని ఆటపై ఉన్న అంకితభావం, శ్రద్ధతో త్వరితగతిన పూర్తి ఫిట్నెస్ సాధించడం గొప్ప విషయమని అన్నాడు. ఇంతకు మునుపెన్నడూ లేనంత దారుఢ్యంతో షమీ కనిపిస్తున్నాడని అన్నాడు.

వన్డేల్లో లారాను అధిగమించిన కోహ్లీ

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో అరుదైన ఘనతను సాధించాడు. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన తొలి వన్డేలో కోహ్లీ 45 పరుగులు చేశాడు. వన్డేల్లో మొత్తం 10430 పరుగులు చేయడం ద్వారా వెస్టిండీస్ బ్యాటింగ్ దిగ్గజం బ్రియాన్ లారా రికార్డు (10405)ను అధిగమించాడు. అంతేకాకుండా ప్రపంచ బ్యాట్స్‌మెన్‌లలో ఈ రికార్డు సాధించిన 10వ క్రికెటర్‌గా కోహ్లీ నిలిచాడు.

కోహ్లీకి విశ్రాంతి

ఆఖరి రెండు వన్డేలు, టీ-20 సిరీస్‌కు దూరం

గత కొన్ని నెలలుగా పనిభారంతో అవిశ్రాంతంగా ఆడుతున్న టీమిండియా సారథి విరాట్ కోహ్లీకి న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు వన్డేల్లో ఆఖరి రెండు వన్డేలతోపాటు ఆ తర్వాత ఇదే జట్టుతో జరిగే టీ-20 సిరీస్‌కు దూరం కానున్నాడు. చాలాకాలంగా పనిభారాన్ని మోస్తున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని కెప్టెన్‌కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించినట్టు బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. కోహ్లీకి విశ్రాంతి ఇచ్చిన చివరి రెండు వన్డేలతోపాటు టీ-20 సిరీస్‌లు ఆడే భారత జట్టుకు వైస్‌కెప్టెన్ రోహిత్ శర్మ నాయకత్వం వహించనున్నాడు.

బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,172.00	1 గ్రాము:	రూ. 3,093.00
8 గ్రాములు:	రూ.25,376.00	8 గ్రాములు:	రూ. 24,744.00
10 గ్రాములు:	రూ. 31,720.00	10 గ్రాములు:	రూ. 30,930.00
100 గ్రాములు:	రూ.3,17,200.00	100 గ్రాములు:	రూ. 3,09,300.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,392.513	1 గ్రాము:	రూ. 3,308.021
8 గ్రాములు:	రూ. 27,140.104	8 గ్రాములు:	రూ. 26,464.168
10 గ్రాములు:	రూ. 33,925.13	10 గ్రాములు:	రూ. 33,080.21
100 గ్రాములు:	రూ. 3,39,251.3	100 గ్రాములు:	రూ. 3,30,802.1
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 338.40	8 గ్రాములు:	రూ. 338.40
10 గ్రాములు:	రూ. 423.00	10 గ్రాములు:	రూ. 423.00
100 గ్రాములు:	రూ. 4,230.00	100 గ్రాములు:	రూ. 4,230.00
ఒక కిలో:	రూ. 42,300.00	ఒక కిలో:	రూ. 42,300.00




కోల్‌కతాలో బుధవారం ఎస్‌యూవీ ‘కిక్స్’ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న నిస్సాన్ ఇండియా ఆపరేషనల్స్ ప్రెసిడెంట్ థామస్ క్యూల్

వాణిజ్యభూమి

బుల్ డల్!

ముంబయి, జనవరి 23: బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో బుల్‌రన్‌కు ఏమాత్రం కొనసాగకపోవడంతో బుధవారం భారీగా నష్టాలను ఎదుర్కొంది. సెన్సెక్స్ ఏకంగా 336.17 పాయింట్లు పతనమై 36,108.75 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా ఇదే తరహాలో నష్టాలను ఎదుర్కొంది. 91.25 పాయింట్లు పతనం కావడంతో 10,831.50 పాయింట్లకు చేరింది. అమెరికా, చైనా మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధానికి తెరపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంటే, ఇరు దేశాల మధ్య జరగాల్సిన అధికారుల సమావేశం రద్దయిందన్న వార్త ప్రకంపనలను సృష్టించింది. ఈ వార్తలో వాస్తవం లేదని అమెరికా ప్రకటించేలోపుగానే అంతర్జాతీయ స్టాక్ మార్కెట్‌పై ఈ వార్త తీవ్ర ప్రభావం చూపింది. మదుపరుల భయాందోళనల నడుమ ట్రేడింగ్ కొనసాగింది. ఎవరు ఎన్ని ప్రకటనలు చేసినా, మదుపరులు స్టాక్స్ కొనుగోళ్లపై ఆసక్తి చూపలేదు. పైగా, అమ్మకాలకు మొగ్గు చూపారు. సంస్థాగత మదుపరులు కొంత వరకూ ఆదుకున్నప్పటికీ, మార్కెట్ పతనాన్ని అడ్డుకోలేకపోయారు. ఒకానొక దశలో ట్రేడింగ్ అత్యధికంగా 36,521 పాయింట్లకు చేరినప్పటికీ, ఎక్కువ సేపు అక్కడ నిలవలేదు. అంతర్జాతీయ సూచీలు పతనం కావడంతో, బీఎస్ఈలోనూ కొనుగోళ్ల ఒత్తిడి పెరిగి, స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయింది.



వినియోగదారుడే దేవుడు

❐ ఈ దృక్పథమే వ్యాపార విస్తరణకు దోహదం చేసింది ❐ బజాజ్ ఫిన్ సర్వ్ చీఫ్ సంజీవ్ బజాజ్ ❐ దావోస్ వార్షిక సదస్సులో ప్రసంగం

దావోస్, జనవరి 23: ‘వినియోగదారుడే తొలుత’ అనే విధానంతో తమ కంపెనీ ముందుకెళుతోందని, ఇది వ్యాపార విస్తరణలో చాలా ఉపయుక్తంగా ఉందని ‘బజాజ్ ఫిన్‌సర్వ్’ చీఫ్ సంజీవ్ బజాజ్ బుధవారం నాడిక్కడ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో వినియోగదారుడి అవసరానికి అనుగుణంగా కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ‘ఇండియా 4.0’ అందరికీ అందుబాటులోకి సాంకేతిక పరిజ్ఞానం’ అనే అంశంపై డబ్ల్యుఈఎఫ్ వార్షిక సదస్సులో భాగంగా జరిగిన ప్రత్యేక సెషన్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తమ కంపెనీ వినియోగదారులకు అప్పటికప్పుడే రుణ సౌకర్యం సైతం అందజేస్తోందని ఇది వ్యాపారానికి సరైన దృక్పథాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన పంథాలో వినియోగించుకోవడానికి వీలుకల్పిస్తోందని ఆయన అన్నారు. గతంలో క్లిష్టమైన వినియోగదారుడి రుణాలు ఇచ్చేందుకు కనీసం 3 నుంచి 4 రోజులు పట్టేదని, అయితే ప్రస్తుతం తమ కంపెనీ కల్పిస్తున్న సదుపాయంతో ఓ వినియోగదారుడు క్రికెట్ మ్యాచ్ వంటి సమయాల్లో ప్లాస్మా టీవీని ఆస్వాదించాలన్న అనుభూతిని వెంటనే సొంతం చేసుకోగలుగుతున్నాడని ఆయన చెప్పారు.

తలసరి ఆదాయం పెంపు
సంతోషమే పరమావధి: నారా లోకేష్


ఇదే సెషన్‌లో ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగిస్తూ నవ్యాంధ్ర రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెంచడం, సంతోషాలను పంచడం పరమావధిగా ముందుకెళుతున్నామన్నారు. ప్రభుత్వం సైతం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఈ లక్ష్యాల సాధనకు పెద్దయెత్తున డేటాను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధనంగా వినియోగించుకుంటున్నామని తెలిపారు. ‘మా చిన్న మజిలో ఎంతో సంతృప్తికర లక్ష్యాన్ని సాధించామ’ని ఆయన వ్యాఖ్యానించారు. నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల పనితీరులో నిపుణతను పాదుకొల్పేందుకు పెద్దయెత్తున సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని అన్నారు.

అమెరికా-చైనా వాణిజ్య చర్చలు కొనసాగుతాయి

❐ స్పష్టం చేసిన వైట్‌హౌస్ ❐ చర్చలు రద్దయ్యాయన్న వార్తలతో అమెరికన్ స్టాక్ మార్కెట్లపై ప్రభావం ❐ ట్రేడింగ్ ముగింపు దశలో స్పందించిన వైట్‌హౌస్ అధికారులు

వాషింగ్టన్, జనవరి 23: అమెరికా-చైనాల మధ్య వాణిజ్యపరమైన శిఖరాగ్ర చర్చలు కొనసాగుతాయని బుధవారం నాడు వైట్ హౌస్ స్పష్టం చేసింది. ఈ చర్చలు రద్దయ్యాయన్న వార్తలను అమెరికా ఖండించింది.

ఈ చర్చలు నిరంతరాయంగా కొనసాగుతాయని స్పష్టత ఇచ్చింది. చైనా వైస్ ప్రీమియర్ లియూ హీ వచ్చే వారం వాషింగ్టన్‌కు వచ్చి యూఎస్ వైస్ ప్రీమియర్‌తో చర్చలు జరుపుతారని వైట్‌హౌస్ తెలిపింది. వచ్చే మార్చి 1 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్య పరమైన అంశాల్లో వైరుధ్యాలు సమసిపోతాయన్న ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ చర్చలకు నిర్దేశించిన కాలవ్యవధిలో మరో 90 రోజులు మిగిలివున్నాయని తెలిపింది. చైనా వస్తువులపై అమెరికా దిగుమతి సుంకాలను పెంచడంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య పరమైన విభేదాలు ఆజ్యం పోసుకున్న సంగతి తెలిసిందే. ఎత్తుకు పైఎత్తు చందంగా ఇరు దేశాలు గత సంవత్సరం సుమారు 360 బిలియన్ డాలర్ల సుంకాలను బాదాయి. చైనా వాణిజ్య వ్యవహారాలు నిజాయితీగా లేవన్న విమర్శలు వెల్లువెత్తిన క్రమంలో తొలుత అమెరికా అధ్యకుడు ట్రంప్ ఈ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. దీంతో యూరోపియన్ యూనియన్ దేశాలతోబాటు, జపాన్ తదితర దేశాలూ అదే పంథాను అనుసరించాయి. ఈక్రమంలో చైనా వైస్‌ప్రీమియర్ లీయూతో వచ్చే వారం అమెరికా జరుపనున్న ప్రాథమిక చర్చలు రద్దయ్యాయంటూ ఫైనాన్షియల్ టైమ్స్, సీఎన్‌బీసీ వంటి కొన్ని వార్తా సంస్థలు మంగళవారం నాడు పేర్కొన్నాయి. ఈ వాణిజ్య వ్యవహారాల్లో అతిక్లిష్టమైన అంశాలపై అమెరికా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ప్రత్యేకించి బలవంతపు సాంకేతిక విజ్ఞానం బదిలీ, చైనా ఆర్థిక రంగాన్ని ప్రభావితం చేసేలా సంస్కరణలు చేపట్టడం వంటి విషయాలపై నిర్లిప్త వైఖరి అవలంభించారని ఆ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల స్థితిగతుల దృష్ట్యా అమెరికా స్టాక్ మార్కెట్లు దిగువస్థాయి నుంచే ఆరంభమయ్యాయి. తాజా వార్తలు కూడా ఆ మార్కెట్లను ప్రభావితం చేసే పరిస్థితులు తలెత్తడంతో అమెరికాలోట్రేడింగ్ ముగింపునకు వచ్చిన సమయంలో వైట్ హౌస్ ఆర్థిక సహాయకుడు లారీ కుడ్లోవ్ స్పందించారు. అంతేగాక ‘ప్రణాళికాబద్ధంగా నిర్ణయమైన ఇరు దేశాల సమావేశం ఏదీ రద్దు కాలేద’ని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి హుఆ చునైంగ్ సైతం బుధవారం బీజింగ్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో స్పష్టం చేశారు. వాణిజ్య అంశాల చర్చల విషయంలో ఇరు దేశాలు అందుబాటులోనే ఉన్నాయని, తనకు తెలిసినంతవరకు ఎలాంటి సమావేశమూ రద్దు కాలేదని ఆమె స్పష్టం చేశారు. ఈ క్రమంలో అమెరికా స్టాక్ మార్కెట్లు కొంతవరకు కోలుకున్నాయి. అయినా కొంత వరకు దిగువ స్థాయిలోనే ముగిశాయి. మరోవైపు బుధవారం ఆసియన్ మార్కెట్లు మిశ్రమ ఫలితాలనే చవిచూశాయి. కాగా వైజ్ఞానిక బదిలీ, మార్కెట్లలో ప్రభుత్వ జోక్యం వంటి అంశాలపై చైనాపై అమెరికా వత్తిడి కొనసాగుతుందని వైట్‌హౌస్ ఆర్థిక సహాయకుడు కుడ్లోవ్ స్పష్టం చేశారు. ప్రతి ఒప్పందంపై ఆ తదుపరి చైనా ఫిర్యాదు చేయడానికి వీలులేదని కూడ అమెరికా అధికారులు నొక్కి చెబుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ చర్చలు ఫలప్రదం కావాలంటే నిర్దిష్టమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ అవసరమని ఆయన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.


చెన్నైలో రెండు రోజుల ‘గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్’ (జీఐఎం) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

రాబోయే ప్రభుత్వం మాదే..

◆ అధికారంలోకి రాగానే క్షమాపణ తీర్మానం ◆ టీడీపీ, వైసీపీ స్వంత పార్టీలు కాదు
◆ మన్యంలో బాక్సైట్‌పై అధికార, ప్రతిపక్ష పార్టీల కుట్ర ◆ నేతల హత్యకు సీఎందే బాధ్యత
◆ టీజీ వెంకటేష్ నోరు అదుపులో పెట్టుకోవాలి ◆ పాడేరు సభలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు



పాడేరు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్. భారీ సంఖ్యలో హాజరైన అభిమానులు, ప్రజలు.

పాడేరు, జనవరి 23: వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ప్రభుత్వాన్ని స్థాపిస్తుందని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేసారు. తాము అధికారంలోకి రాగానే పాలకవర్గాలు సాగించిన దోపిడీ, అన్యాయాలకు ప్రజలకు క్షమాపణ చెబుతూ మొట్టమొదటి తీర్మానాన్ని చేస్తామన్నారు. విశాఖ జిల్లా పాడేరులో బుధవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీల తీరుపై నిప్పులు చెరుగుతూ తనను ఆదరిస్తే యువతకు 25 ఏళ్ల భవితను జనసేన అందిస్తుందని చెప్పారు. టీడీపీ, వైసీపీ చంద్రబాబు, జగన్ స్వంత పార్టీలు కావని, తన మామ ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీని బాబు నడుపుతుంటే ఎవరో పెట్టిన పార్టీని జగన్ లాక్కున్నారన్నారు. జనసేన మాత్రం సామాన్యుల కోసం పుట్టిన పార్టీగా పేర్కొన్నారు. విశాఖ మన్యంలో బాక్సైట్ తవ్వకాలకు పూనుకుంటున్నా మాట్లాడేవారే లేరని, అధికార, ప్రతిపక్ష పార్టీలు బాక్సైట్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. లక్షలాది మంది ఆదివాసీల జీవితాలు బాక్సైట్‌తో ముడిపడి ఉన్నాయని, అందుకే తాము గిరిజనులకు అండగా నిలిచి బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అరకులోయకు వచ్చినప్పుడు బాక్సైట్ తవ్వకాలు చేపట్టమని ప్రకటించినా, తవ్వకాలకు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. అయితే వామపక్ష పార్టీలు, జనసేన ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవడంతో దీనిని విరమించుకున్నారన్నారు. మన్యంలో బాక్సైట్ తవ్వకాలకు వైసీపీ కూడా అండగా నిలుస్తోందన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు చట్టసభలకు వెళ్లరని, వెళ్లినా బాక్సైట్‌పై మాట్లాడరన్నారు. బాక్సైట్‌పై ఎవరి వైఖరి ఏలా ఉన్నా జనసేన మాత్రం దీనిని ఎట్టి పరిస్థితులలో అంగీకరించదని, గిరిజనులకు అండగా ఉంటూ బాక్సైట్ జోలికి వచ్చే వారి తాట తీస్తామన్నారు. టీడీపీ పాలనలో అక్రమాలు, దోపిడీలు పెచ్చుమీరి సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందని ఆయన అవేదన వ్యక్తం చేసారు. టీడీపీతో ప్రజలకు మేలు జరుగుతుందని భావించి 2014 ఎన్నికల్లో తాను మద్దతునిచ్చానని, అయితే అధికారంలోకి వచ్చాక పాలకులు అనుసరిస్తున్న దోపిడీ విధానాలు, అవినీతి, అక్రమాలను చూడలేక ప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో బయటకు వచ్చానన్నారు. అధికార పార్టీ నేతలు ఇప్పటికైనా తమ అరాచకాలకు స్వస్తి చెప్పి, గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉండాలని, బాక్సైట్ జోలికి రావద్దని, అక్రమ మైనింగ్, క్వారీలను విడనాడాలన్నారు. గతంలో తాను పాడేరు ప్రాంతంలో పర్యటించినపుడే ఈ ప్రాంతంలో అక్రమ క్వారీల విషయం గిరిజనులు గోడు విన్నవించుకున్నారన్నారు. ఈ విషయమై తాను ప్రభుత్వానికి నివేదించినప్పటికీ ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం వలనే ఇద్దరు నేతలు ప్రాణాలు కోల్పోవలసి వచ్చిందన్నారు. ఈ నేతలు ప్రాణాలు కోల్పోవడానికి ముఖ్యమంత్రే బాధ్యత వహించాలన్నారు. తమ పార్టీకి రాజ్యసభ స్థానాన్ని ఇస్తామని అప్పట్లో చెప్పినా తాను తీసుకోలేదని, తాము వద్దనుకున్న రాజ్యసభ పదవిని టీజీ వెంకటేష్‌కు ఇచ్చారన్నారు. అయితే టీజీ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ నోరు పారేసుకుంటున్నారని, అదుపు తప్పి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. తాము కాదనుకుంటే పదవి పొందిన అతను ప్రజల మనోభావాలతో ఆడుకోవద్దని, తాను మాట్లాడితే పరిస్థితి ఇంకోలా ఉంటుందన్నారు. తనకు పదవి కావాలంటే పార్టీ అక్కరలేదని, డబ్బు కోసం తాను రాలేదని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాల నుంచి మార్పు రావాలనే పార్టీని స్థాపించానన్నారు. తనకు డబ్బు అవసరం లేదని, డబ్బు కావాలంటే తనకు సినిమాలు ఉన్నాయన్నారు. ప్రజల నుంచి నాయకులు రావాలన్నదే జనసేన లక్ష్యంగా ఆయన పేర్కొంటూ బలమైన నాయకులను తీసుకువస్తామన్నారు. వేల కోట్ల రూపాయల సంపాదన తనకు లేకపోయినా ప్రజలు అండగా ఉన్నారన్నారు. తప్పు చేసిన వారిని ఎవరినైనా చొక్కా పట్టుకుని నిలదీసే చైతన్యం ప్రజల్లో రావాలన్నదే తమ అభిమతంగా పేర్కొంటూ తాను తప్పు చేసినా ఎవరూ ఉపేక్షించవద్దని అన్నారు. జనసేన ప్రభుత్వం వస్తే అన్ని వర్గాల వారికి భరోసాగా ఉంటుందని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. సభలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, జనసేన నాయకులు పార్థసారథి, అశోక్‌కుమార్, క్రిష్ణారావు పాల్గొన్నారు.



హైదరాబాద్ రవీంద్ర భారతిలో బుధవారం ఈశ్వరీబాయి అవార్డు అందుకుంటున్న ప్రజాగాయకుడు గద్దర్

వీర వనిత ఈశ్వరీబాయి

◆ తెలంగాణకు జరిగిన అన్యాయం, అంబేద్కరిజం వ్యాప్తికి నిరంతర పోరాటం
◆ శత జయంతి వేడుకల్లో కొనియాడిన వక్తలు
◆ హాజరైన మల్లికార్జున్ ఖర్గే, జైపాల్‌రెడ్డి, జానారెడ్డి
◆ గద్దర్‌కు మెమోరియల్ అవార్డు బహూకరణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 23: తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని గొంతెత్తి చాటడంతో పాటు అంబేద్కరిజం వ్యాప్తికి ఈశ్వరిబాయి ఎనలేని కృషి చేశారని వక్తలు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు తొలినాళ్లలో ఈశ్వరిబాయి వంటి ఎంతో మంది చేసిన పోరాటమే ఉద్యమానికి బాటలు వేసిందన్నారు. రవీంద్రభారతిలో బుధవారం ఈశ్వరిబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన శత జయంతోత్సవ కార్యక్రమానికి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, మాజీ కేంద్ర మంత్రి ఎస్ జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కే జానారెడ్డి తదితర ప్రముఖులు హాజరై ప్రసంగించారు. ఈశ్వరిబాయి మెమోరియల్ అవార్డును ఈ సందర్భంగా ప్రజాకవి గద్దర్‌కు బహుకరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ, తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయంపై ఎవరికి భయపడకుండా పోరాడిన వీర వనిత ఈశ్వరిబాయి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి తొలినాళ్లలో ఈశ్వరిబాయి వంటి ఎంతో మంది చేసిన పోరాట కృషి ఫలితమేనన్నారు. బాబా సాహెబ్ అంబేద్కరిజాన్ని ఈశ్వరిబాయి విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. దళితులు, పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడరన్నారు. ఈశ్వరిబాయి మెమోరియల్ అవార్డుకు ప్రజాకవి గద్దర్‌ను ఎంపిక చేయడం సరైన నిర్ణయమన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ఈశ్వరిబాయిని వీర వనిత అనడం అతిశయోక్తి కాదన్నారు. భయమంటే ఆమెకు తెలియదన్నారు. రాజకీయ సిద్ధాంతాన్ని నమ్ముకొని పదవులు ఆశించకుండా ప్రజల కోసం పని చేసిన నాయకురాలని జైపాల్‌రెడ్డి కొనియాడారు. ఈశ్వరిబాయి రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలో తాను కూడా ఎమ్మెల్యేగా ఉన్నానన్నారు. ఈశ్వరిబాయి కేవలం దళితుల కోసమే పోరాటం చేయలేదని, ఆమె ఇంటికి ఎవరు వెళ్లినా వారి సమస్యలు తెలుసుకొని పరిష్కారం కృషి చేసేదన్నారు. నేటి తరం రాజకీయ నాయకులకు ఈశ్వరిబాయి జీవితం ఆదర్శనీయమన్నారు. రాజకీయ నాయకులపై వస్తున్న బయోపిక్‌లు రాజకీయ కోణంలో ఉంటున్నాయన్నారు. కానీ ఈశ్వరిబాయిపై తీసిన డాక్యుమెంటరీ అద్భుతంగా, వాస్తవానికి దగ్గరగా ఉందని జైపాల్‌రెడ్డి ప్రశంసించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె జానారెడ్డి మాట్లాడుతూ, శాసనసభలో ఈశ్వరిబాయి మాట్లాడిన తీరు నేటితరం ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిదాయకమన్నారు. అవార్డు గ్రహీత గద్దర్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన వీర వనిత ఈశ్వరిబాయి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వల్ల ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. సంపూర్ణ తెలంగాణ కోసం పోరాటాన్ని కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో న్యూయో ఫుడలిజం పాలన కొనసాగుతుందని విమర్శించారు. ఈ సారైనా మహిళలకు మంత్రిమండలిలో స్థానం కల్పించాలని గద్దర్ అన్నారు. దళితులకు ఉచితంగా ఇస్తామన్న మూడు ఎకరాల కోసం ఎక్కడా రాజీ పడకుండా పోరాడుతానని గద్దర్ అన్నారు. ఇలావుంటే, ఈశ్వరిబాయి కూతురు, ట్రస్ట్ చైర్మన్ గీతారెడ్డి ఈ సందర్భంగా అతిథులతో అగ్నిశిఖ ఈశ్వరిబాయి పుస్తకాన్ని ఆవిష్కరింపచేశారు.



దశ తిరుగుతోంది!

◆ 'కృష్ణపట్నం' సరుకు రవాణాపై రైల్వే ఉన్నత స్థాయి సమీక్ష
◆ పోర్టు సీఈఓ, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ హాజరు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 23: కృష్ణపట్నం పోర్టు నుంచి సరుకు రవాణా చేస్తున్న వినియోగదారులతో దక్షిణ మధ్య రైల్వేశాఖ బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పోర్టు నుంచి సరుకు రవాణాతో దక్షిణ మధ్య రైల్వేకి గణనీయంగా ఆదాయం వస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని మరింత ఆదాయాన్ని పెంచుకోవడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు పోర్టుకు సంబంధించిన వ్యాపార వర్గాలతో చర్చలు జరుపుతోంది. 2018-2019 ఆర్థిక సంవత్సరంలో వ్యాపార లావాదేవీలను సమీక్షించుకోవడానికి బుధవారం రైల్ నిలయంలో సమావేశం ఏర్పాటు చేసింది. ఆంధ్రా పోర్టుల్లో ఒకటైన కృష్ణపట్నం ఎగుమతులు, దిగుమతులకు ఏమైనా అడ్డంకులు ఎదురవుతున్నాయా? అన్న అంశంపై రైల్వే అధికారులు చర్చలు జరిపారు. 2018 డిసెంబర్ నాటికి కృష్ణపట్నం పోర్టు నుంచి 15,19 మిలియన్ల టన్నుల సరుకు రవాణా జరిగింది. 2019 డిసెంబర్ నాటికి 20.25 మిలియన్ల టన్నుల సరుకు రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. సరుకు రవాణా ఎగుమతి పెంచుకోవడానికి, వినియోగదాలకు ఇస్తున్న వివిధ రాయితీ పథకాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో వివరించారు. కృష్ణపట్నంకు సరుకు రవాణాను మరింత పెంచడానికి కొత్త రైల్వే మార్గం నిర్మాణ అంశం చర్చకు వచ్చింది. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ ఎన్ మధుసూదనరావు, చీఫ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మేనేజర్ బీ నాగ్యా, కృష్ణపట్నం పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ అనిల్ ఎండ్లూరి, పోర్టు చీఫ్ ఆపరేషన్ సుబ్బారావు, జిందాల్ స్టీల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుశీల్ నోవాల్‌తోపాటు ఉన్నతాధికారులుసమావేశానికి హాజరయ్యారు.



న్యూఢిల్లీలో శనివారం జరగబోయే 70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని, బుధవారం ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌లో పాల్గొన్న బీఎస్ఎఫ్ కామెల్ కంటింజెంట్.

మండలి తరహాలోనే ఖమ్మంలోనూ..

ముగ్గురు కార్పొరేటర్లపై

అనర్హత వేటు

ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, జనవరి 23: రాష్ట్ర శాసనమండలిలో పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేసినట్లుగానే ఖమ్మం కార్పొరేషన్‌లో కూడా పార్టీ మారిన ముగ్గురిపై అనర్హత వేటు వేయాలని తీర్మానం చేశారు. రాష్ట్రంలోనే తొలిసారిగా జరిగిన ఈ అంశంపై రాష్ట్ర స్థాయిలో చర్చ జరుగుతోంది. టీఆర్ఎస్ మినహా ఇతర పార్టీల నేతలు ఇది అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ అధికార పార్టీ నేతలు తాము అనుకున్న పనిని యథాతథంగా చేసుకుంటూపోతున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో 50మంది కార్పొరేటర్లు ఉండగా అన్ని పార్టీల నుండి వచ్చిన వారితో కలిపి టీఆర్ఎస్‌కు 43మంది, కాంగ్రెస్‌కు 3, సిపిఎం-2, సిపిఐ-2మంది కార్పొరేటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీఆర్ఎస్ సభ్యులుగా ఉన్న ముగ్గురు తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో ఆ ముగ్గురిపై అనర్హత వేటు వేయాలంటూ బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. 6వ డివిజన్‌కు చెందిన హనుమంతు, 7వ డివిజన్‌కు చెందిన చేతుల నాగేశ్వరరావు, 48వ డివిజన్‌కు చెందిన తోట రామారావులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుండి మాట్లాడకుండా ఉన్న టీఆర్ఎస్ నేతలు కౌన్సిల్ సమావేశంలో సంతాప, అభినందనల తీర్మానాల తర్వాత టేబుల్ ఎజెండాగా ఈ అంశాన్ని తీసుకువచ్చారు. ఈ సమయంలో ఆ ముగ్గురు కార్పొరేటర్లకు కాంగ్రెస్ కార్పొరేటర్లు మద్దతు ఇచ్చినప్పటికీ టీఆర్ఎస్ కార్పొరేటర్లు పట్టు పట్టి తీర్మానాన్ని ఆమోదింప చేసుకున్నారు. స్థానిక శాసనసభ్యుడు పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పొంగులేటి సుధాకర్‌రెడ్డిల సమక్షంలోనే ఈ తీర్మానం జరిగింది. అయితే గతంలో తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీల నుండి టీఆర్ఎస్‌లో చేరిన కార్పొరేటర్లపై అనర్హత ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. అయితే దానికి సమాధానం చెప్పకుండానే ముగ్గురిపై అనర్హత తీర్మానాన్ని అమోదించారు. కాగా శాసన మండలిలో లాగా ఖమ్మం కార్పొరేషన్‌లో కూడా తమను విబేధించినవారిపై వేటు వేయటం దారుణమని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ముగ్గురు కార్పొరేటర్లు వెల్లడించారు.



కలిదిండి వద్ద లభ్యమైన ధార్మిక మూలకం కంటైనర్ కేసు

రేడియో ధార్మిక పదార్థం

ఆచూకీ లభ్యం

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 23: ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్సులో మాయం అయిన సీఎస్ 137 రేడియో ధార్మిక మూలకం కంటైనర్ కేసును రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఎస్పీ షిమోషీ బాజ్‌పేయి ఆధ్వర్యంలో నియమించిన ప్రత్యేక పోలీసు బృందం ఛేదించింది. గత వారం రోజులుగా తీవ్ర కలకలానికి గురి చేసిన రాజమహేంద్రవరం ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్సులో కనిపించకుండా పోయిన రేడియో ధార్మిక మూలకం కలిగిన కంటైనర్ ఎట్టకేలకు దొరికింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నట్టయింది. కృష్ణాజిల్లా కలిదిండి గ్రామంలోని ఒక పాత ఇనుప సామాను గోడౌన్‌లో ఓఎన్జీసీ రేడియో ధార్మిక మూలకం కలిగిన కంటైనర్‌ను రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఎస్పీ షిమోషీ బాజ్‌పాయి నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక పోలీసు బృందం సీసీఎస్ అధికారులు వర ప్రసాద్, వివి రావు, ముక్తేశ్వరరావు, త్రినాధరావు, కానిస్టేబుళ్లు గుర్తించారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో సీఎస్ 137 అనే రేడియో ధార్మిక మూలకం కంటైనర్‌ను కలిదిండిలో గుర్తించినట్టు బుధవారం రాత్రి రాజమహేంద్రవరం పోలీసు గెస్ట్ హౌస్‌లో అర్బన్ జిల్లా ఎస్పీ షిమోషి బాజ్‌పాయితో పాటు అడిషనల్ ఎస్పీ రమణకుమార్, ఈస్ట్ జోన్ డీఎస్పీ నాగరాజు తెలిపారు. కలిదిండి వద్ద పాత సామాగ్రి షెడ్డులో భద్రంగా దొరికిందని అర్బన్ ఎస్పీ షిమోషీ బాజ్‌పేయి చెప్పారు. ఈ కంటైనర్‌ను గుర్తించిన పోలీసు బృందాన్ని ఆమె అభినందించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, ఓఎన్జీసీ ప్రత్యేక వాహనంలో కలిదిండి నుంచి రాజమహేంద్రవరం బేస్ కాంప్లెక్సుకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఓఎన్జీసీ నుంచి ఫిర్యాదు అందినప్పటి నుంచి పోలీసు ప్రత్యేక బృందాల పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వెంట పెట్టుకుని దర్యాప్తు చేయడం జరిగిందన్నారు. ఈ పదార్థం కలిగిన కంటైనర్ లభించిన వెంటనే ఓఎన్జీసీ అధికారులకు తెలియజేయడంతో ఓఎన్జీసీ సాంకేతిక అధికారులు, అధికారులు ప్రత్యేక ప్రమాణాలతో తరలించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. ఈ పదార్థం భద్రంగా దొరికింది కాబట్టి ప్రజలు ఎటువంటి ఆందోళనకు చెందాల్సిన పని లేదని ఎస్పీ చెప్పారు.

భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపుల్లో అక్రమాలు

◆ **జనసేన నాయకుడు కొణతాల సీతారం ఆరోపణ**

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 23: విశాఖ జిల్లా అనకాపల్లి మండటం టి.వెంకుపాలెం గ్రామ పరిధిలో ఉద్యానవన పరిశోధనా క్షేత్రం ఏర్పాటుకు భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు జరిగాయని జనసేన నాయకుడు కొణతాల సీతారాం ఆరోపించారు. టీ.వెంకుపాలెం గ్రామంలోని భూసేకరణ వల్ల నష్టపోయినా రైతులకు న్యాయం చేయాలని ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో జనసేన పార్టీ నేతృత్వంలో రైతులు గత మూడు రోజులుగా నిరసన కార్యక్రమం చెపట్టింది. అలాగే బుధవారం ఆంధ్రభవన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని రైతులు, జనసేన న్యాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జనసేన విశాఖ జిల్లా సభ్యుడు సీతారాం మాట్లాడుతూ అనకాపల్లి ఎమ్మెల్యే పిలా గోవిందు సత్యనారాయణ నాలుగున్నరేళ్ల పరిపాలనలో అ చేసిన అక్రమాలపై విచారణ జరపాలని కోరారు. టీ.వెంకుపాలెం గ్రామ పరిధిలోభూముల విషయంలో నిజమైన రైతులకు పరిహారం చెల్లించకుండా భూసేకరణ విషయంలో ఎమ్మెల్యే అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మేరకు సీబీఐ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అలాగే ప్రధాని, రాష్ట్రపతి కార్యాలయాల్లో రైతులకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలను అందజేశామని పేర్కొన్నారు.

సినీనటి భానుప్రియ ఇంట్లో బాలిక నిర్బంధం!

సామర్లకోట, జనవరి 23: ప్రముఖ సినీనటి భానుప్రియ ఇంట్లో తమ కుమార్తెను నిర్బంధంలో ఉంచారని, పనికోసమని వెళ్ళిన తమ కుమార్తెను భానుప్రియ సోదరుడు లైంగిక వేదింపులకు గురిచేస్తున్నాడని, తమతో పంపించమని అడిగేందుకు వెళ్లిన తమపై దౌర్జన్యం చేశారంటూ తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండలం పండ్రవాడ గ్రామానికి చెందిన పెనుపాకల ప్రభావతి, తండ్రి రాజు బుధవారం సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాకినాడకు చెందిన 1098 చైల్డ్ లైన్ ప్రతినిధులు జి విజయ్ కుమార్ సహాయంతో వారు సామర్లకోట ఎస్సై ఎల్ శ్రీనువాసునాయక్‌ను పోలీస్ స్టేషన్‌లో కలసి ఫిర్యాదు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నైలోని సినీనటి భానుప్రియ ఇంట్లో తమ కుమార్తె పెనుపాకల సంధ్య (15) గత సంవత్సర కాలంగా పనిచేస్తోందని, అయితే భానుప్రియ సోదరుడు గోపాలకృష్ణ తమ కుమార్తెను లైంగికంగా వేధిస్తున్నట్లు తమ కుమార్తె సంధ్య తమకు ఫోనులో పలుమార్లు వివరించి విలపించిందన్నారు. తాము వెళ్ళి తమ కుమార్తెను తమతో పంపించమని కోరగా వారు మీ అమ్మాయిని ఎప్పుడో పంపించేసామని చెప్పి దౌర్జన్యంగా మీదిక్కున్న చోట చెప్పుకోండని గెంటివేసారని ఆరోపించారు. ఏదో ఒక దొంగతం కేసులో ఇరికించి మీ అమ్మాయిని ఇబ్బందులకు గురిచేస్తామని బెదిరించారన్నారు. దాంతో ఏమీ తోచని స్థితిలో చైల్డ్‌లైన్‌కు ఫోన్ చేసి సమస్యను చెప్పామని, వారి సహాయంతో పోలీసులను ఆశ్రయించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ పీవో విజయకుమార్, ఎస్వీ రాఘవులు, కర్రి సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న చైల్డ్‌లైన్ సిబ్బంది, బాలిక తల్లిదండ్రులు (ఇన్‌సెట్‌లో)సంధ్య ఫైల్‌ఫోటో

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

గురువారం, 24 జనవరి 2019


గోళ్ల రంగు మారుతోందా!?





కొంతమంది అదేపనిగా గోళ్లకు రంగు వేస్తుంటారు. అది చెరిగిపోయేంత వరకు కూడా ఉండకుండా వెంటనే నెయిల్ పాలిష్ రిమూవర్‌తో తుడిచేసి వెంటనే మరో రంగును వేసేస్తారు. ముఖ్యంగా కాలేజీకి వెళ్లే అమ్మాయిలు ఇలా ఎక్కువగా చేస్తుంటారు. ఫ్యాషన్లనీ, వేసుకునే దుస్తులకు మ్యాచింగ్ అనీ, పార్టీలనీ.. ఇలా ఎప్పుడూ గోళ్లకు రంగు ఉండాల్సిందే.. ఇలా తరచూ చేయడం వల్ల గోళ్ల రంగు మారిపోతుంది. రంగు మారిన గోళ్లు తిరిగి కోలుకుని మామూలు గోళ్లలా రావడానికి కనీసం నాలుగు నుంచి తొమ్మిది నెలలు పట్టొచ్చు. కొన్నిసార్లు ఎర్రని గోర్లరంగు వేసుకున్నా కూడా గోళ్లు రంగు మారతాయి. మరికొన్నిసార్లు ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా రంగు మారవచ్చు. కానీ ఇలా గోళ్లు రంగుమారుతూనే వైద్యుల సలహా తీసుకోవడం తప్పనిసరి. డాక్టర్ల సలహాలతో పాటు ఇంట్లోనూ కొన్ని వైద్య చిట్కాలను పాటిస్తే గోళ్లు సాధారణ స్థితికి చేరుకుంటాయి.


- గోళ్లకు నిరంతరంగా రంగు వేసుకోవడం మంచి పద్ధతి కాదు. వాటిల్లోని రసాయనాలు గోళ్లకే కాదు.. చుట్టూ ఉండే చర్మానికీ హాని కలిగిస్తాయి.
- ఎప్పుడూ గోళ్లను పొడిగా, శుభ్రంగా ఉంచుకోవాలి. లేదంటే రంగు మారిన గోళ్లు బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉంది.
- క్యూటికల్స్‌కి మాయిశ్చరైజర్, సహజ నూనెలతో రోజూ గోళ్లను మర్దన చేసుకోవాలి.
- మానిక్యూర్, పెడిక్యూర్ వంటివాటిని తరచూ చేసుకోకూడదు. తరచూ నెయిల్ పాలిష్ రిమూవర్లను కూడా వాడకూడదు. వాటివల్ల గోళ్ల చుట్టూ ఉన్న చర్మం పాడవుతుంది.
- గోళ్లని స్టైల్ కోసమని భిన్న ఆకృతుల్లో కత్తిరించుకుంటే ఎదుగుదల సరిగ్గా ఉండదు. వాటిని ఎప్పుడూ చివర్లనుంచి నీట్‌గా, సాధారణంగా కట్ చేసుకోవాలి.
- రోజూ తాజాపండ్లు, కూరగాయలను తీసుకోవాలి.
- గోళ్ల రంగుని ఎంచుకునేటప్పుడు అందులో విటమిన్ ఇ, మినరల్స్, బొటానికల్ ఎక్స్‌ట్రాక్ట్ ఉన్నవాటిని ఎంచుకుంటే మంచిది.
- ప్రతిరోజూ తప్పనిసరిగా ఎస్‌పీఎఫ్ 30 ఉన్న హ్యాండ్ క్రీమ్‌ని రాసుకోవాలి.
- గోళ్ల రంగులో టాల్యూన్, ఫార్మాల్డిహైడ్, ఎసిటోన్, పారాబెంజ్ వంటి రసాయనాలు ఉంటాయి. టాల్యూన్ వల్ల గోళ్ల చుట్టూ ఉన్న చర్మం పొడిబారి పగిలిపోతుంది. కొన్నిసార్లు ఈ రసాయనాల వల్ల తలనొప్పి, వాంతులు, వికారం, ఇరిటేషన్, కళ్ల, గొంతు ఇన్‌ఫెక్షన్లు కలుగుతాయి.



- ఫార్మాల్డిహైడ్ వల్ల అలర్జిక్ రియాక్షన్లు వస్తాయి.
- ఎసిటోన్ తేమను దూరం చేస్తుంది.
- పారాబెంజ్ వల్ల కూడా కళ్ల అలర్జీలు వస్తాయి.
- కొన్ని రకాల గోళ్ల రంగుల్లో గ్లాసీలుక్ కోసం కర్పూరాన్ని వాడతారు. దీనివల్ల గోళ్లలోని తేమ ఆవిరైపోతుంది. ఆ వాసన పీల్చినా కూడా ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ఈ గోళ్ల రంగు వేసుకున్న దాదాపు పద్నాలుగు గంటల తర్వాత ఈ ప్రభావం ఉంటుంది. అందుకే గోళ్ల రంగులను ఎంచుకునేటప్పుడు గ్లాసీ లుక్ లేనివి ఎంచుకుంటే బాగుంటుంది.
- టీపీహెచ్ అనే మరో రసాయనం వల్ల హార్మోన్ల అసమతుల్యత, సంతాన సాఫల్యాలేమి బాధిస్తాయి. గోళ్ల రంగు వల్ల కూడా సంతానలేమి కలుగుతుందా.. అని ఆశ్చర్యపోనవసరం లేదు.. ఎందుకంటే ఎటువంటి రసాయనం, శరీరానికి ఏ రకమైన హాని చేస్తుందో తెలియదు కదా.. ★

దక్షిణ ధ్రువాన్ని చుట్టిన

తొలి మహిళా ఐపీఎస్





రక్తం గడ్డకట్టే మంచు..
వీపుపై 35 కిలోల బరువు..
111 కిలోమీటర్ల ప్రయాణం..

211 పర్వతాల అధిరోహణ.. కేవలం కాలినడక ద్వారా.. ఈ ఘనత సాధించి దక్షిణ ధ్రువాన్ని చేరుకున్న మొదటి ఐపీఎస్ ఆఫీసర్ అపర్ణా కుమార్. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 211 పర్వతారోహణలు చేయడమే కాకుండా ఆ పర్వత శ్రేణులను కొలిచి ఆమె రికార్డు సృష్టించింది ఆమె. ప్రస్తుతం అపర్ణ డీ ఐజీగా, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తోంది.

అపర్ణ బెంగళూరు, నేషనల్ లా కాలేజీలో డిగ్రీ చదివింది. తరువాత సివిల్స్‌కి హాజరై 2002 బ్యాచ్ ఉత్తరప్రదేశ్ క్యాడర్, ఐపీఎస్ ఆఫీసర్‌గా విధుల్లో చేరింది. అపర్ణ భర్త సంజర్‌కుమార్ ప్రభుత్వాధికారి కాగా, వీరికి ఇద్దరు పిల్లలు. చిన్నవయస్సు నుంచే అపర్ణా కుమార్‌కి పర్వతారోహణపై అమితమైన ఆసక్తి. ఇందులో శిక్షణ తీసుకున్న ఆమె పలు సాహసాలకు శ్రీకారం చుట్టింది. మహిళలు అన్ని రంగాల్లోనూ మగవారితో పోటీపడుతున్నారు. పోటీ పడడమే కాదు వారిని జయిస్తున్నారు కూడా.. ఆ రంగం, ఈ రంగం అనేది లేకుండా మహిళలు అన్ని రంగాల్లోనూ విజయఢంకా మోగిస్తున్నారు. ఇంతకుముందు పర్వతారోహణ అనేది కేవలం మగవారు మాత్రమే చేసేవారు. కానీ ఇటీవల కాలంలో మహిళలు కూడా పర్వతారోహణ చేస్తున్నారు. చేయడమే కాదు రికార్డులను కూడా సృష్టిస్తున్నారు. ఈ విధంగానే రికార్డు సృష్టించింది ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి.



ఇప్పటివరకూ అపర్ణ సాధించిన సాహసాలు

- 2015లో యూరప్‌లో 18,510 అడుగుల ఎత్తైన పర్వతశ్రేణి ఎల్‌బ్రస్‌ను కొలిచింది.. ఇది అత్యంత క్లిష్టమైన సాహసం.
- 2015లో దక్షిణ అమెరికాలో అతి ఎత్తైన అకోన్‌కాగ్వా, ఇండోనేషియాలో కార్‌స్టెన్జ్ పిరమిడ్, అలాగే టాంజానియాలోని కిలిమాంజారో వంటి పర్వతాలెన్నో ఎక్కి కొలిచింది.
- 2016లో మౌంట్ ఎవరెస్ట్ పర్వతాన్ని కొలిచిన తొలి మహిళా ఐపీఎస్ ఆఫీసర్‌గా కూడా పురస్కారం అందుకుంది అపర్ణ.
- 2017లో అంటార్కిటికాలోని 17వేల అడుగుల ఎత్తున్న విన్‌సన్ మాసిఫ్ పర్వత శిఖరాన్ని చేరుకుని అక్కడ మన జాతీయజెండా, ఉత్తరప్రదేశ్ పోలీస్ జెండాను ఎగరేసింది అపర్ణ.
- తాజాగా 2018 డిసెంబర్ 30న దిల్లీ నుంచి బయలుదేరిన అపర్ణ.. దుబాయ్ మీదుగా చిలీలోని పుంటాస్ అరెనస్ నుంచి శాంటియాగో వెళ్లి, అక్కడి నుంచి దక్షిణ ధ్రువానికి చేరుకోవడానికి యాత్రను ప్రారంభించింది. 111 మైళ్ల దూరం, మైనస్ 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ప్రయాణించి జనవరి 13న దక్షిణ ధృవాన్ని చేరుకుంది అపర్ణ.

అంటార్కిటికా ఉపఖండంలోని మౌంట్ విన్సర్ మానిఫ్‌ను అపర్ణాకుమార్ అధిరోహించింది. ఈ నెల 17న ఆమె తన సహచరులతో కలిసి 17వేల అడుగుల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించి మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసింది. అలా ఎత్తైన పర్వతాన్ని అధిరోహించిన మొదటి ఐపీ ఎస్ అధికారిణిగా అపర్ణ రికార్డు సృష్టించింది. అపర్ణ సాధించిన ఘనతకుగానూ ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ★



అతివ్యాయామం ముప్పే!



ఒత్తిడి, అతివ్యాయామం వంటివి రుతుక్రమంపై ప్రభావం చూపించవచ్చు. వాటివల్ల రక్తస్రావం తీవ్రంగా కావడం, లేదా కొద్దిగా కావడం, లేదా మొత్తానికి కాకుండా ఉండడం జరగవచ్చు. ఎందుకంటే శరీరం కఠిన శిక్షణను తీసుకున్నప్పుడు శరీరం ఒత్తిడికి గురవుతుంది. దీనివల్ల రుతుక్రమం రాకపోవచ్చు. దానికి కారణం ఏంటంటే.. శరీరం తగినంత ఈస్ట్రోజన్‌ను ఉత్పత్తి చేయలేకపోవడమే.. ఈస్ట్రోజన్ హార్మోన్ స్త్రీ జననేంద్రియాల ఆరోగ్యానికే కాదు, ఎముకలను బలంగా ఉంచడానికీ ఉపయోగపడుతుంది. అందుకే మహిళలకు రుతుక్రమం సరిగా రానప్పుడు, ఎముకలకు అవసరమైన పోషకాలు అందించడం కుదరదు. అలా.. మహిళలే తమ ఎముకలను బలహీనంగా మార్చేస్తారు. వారం పాటు ఏదైనా కఠిన శిక్షణ తీసుకోవడానికి బదులు వారంలో కొన్నిసార్లు చాలా తక్కువగా వ్యాయామాలు చేయాలని డాక్టర్లు చెబుతున్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి రోజూ తగినంత పోషకాహారం తీసుకోవాలి.. కంటినిండా నిద్రపోవాలి.

రుతుచక్రం సాధారణంగా 28 రోజులకు వస్తుంటుందని అందరూ భావిస్తారు. కానీ నిజానికి ఇది సగటు మహిళకు మాత్రమే జరుగుతుంది. బహుశా పది మందిలో ఒకరికి మాత్రమే ఇలా 28 రోజుల రుతుచక్రం ఉంటుంది. సాధారణ రుతుచక్రం ఎలా అయినా ఉండొచ్చు. అనేది మహిళలు వారి వారి నెలసరి తేదీలను అనుసరించి ఊహించుకోవచ్చు.

రుతుచక్రంలో వివిధ సమయాల్లో హార్మోన్ల స్థాయి పెరగడం, తగ్గడం జరుగుతుంటుంది. సరిగ్గా నెలసరి వచ్చే ముందు ప్రొజెస్టరాన్ స్థాయి శరీరంలో పెరుగుతుంది. అది మహిళల్లో చాలా లక్షణాలకు కారణం అవుతుంది. అంటే వక్షోజాలు పెద్దవి కావడం, నొప్పిగా ఉండటం, తలనొప్పి, వికారంగా ఉండటం, కోపంగా ఉండటం వంటి లక్షణాలు.. ప్రొజెస్టరాన్ అనేది ప్రొ-జెస్టేషన్ హార్మోన్ అంటే గర్భధారణకు అనుకూలంగా ఉండే హార్మోను.. అంటే సాధారణంగా ఈ హార్మోన్ వల్లే మహిళలు గర్భం ధరిస్తారు. అందుకే నెలసరి సమయంలో శరీరంలో ప్రొజెస్టరాన్ ఎక్కువగా విడుదలవుతుంది. అలా మహిళల్లో చాలా నీరు నిలువ ఉంటుంది. అదే వక్షోజాలు పెద్దగా అయ్యేలా చేస్తుంది. కొంతమంది మహిళల్లో ఐబీఎస్ (ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్) లక్షణాల్లా ఇవి చాలా ఉబ్బిపోతాయి. అంతే అదంతా మహిళల రుతు చక్రం సమయంలో రకరకాల హార్మోన్ల వల్లే జరుగుతుంది.



మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడు వారు తమ శరీరం ఏం చేస్తుంది అనేదానిపై వారు పూర్తి అవగాహనతో, జాగ్రత్తగా ఉండాలి. అంటే పరిస్థితులు సరిగా అనిపించనపుడు మహిళలు తెలుసుకోగలిగేలా ఉండాలి. వజైనల్ డిశ్చార్జ్ గురించి చాలామంది మహిళలు తీవ్రంగా ఆందోళనకు గురికావడం చూస్తుంటాం. మహిళల డిశ్చార్జ్ నెల, నెలా మారుతూనే ఉంటుంది. హార్మోన్లు ఏం చేస్తున్నాయనేదాన్ని అనుసరించి డిశ్చార్జ్ మారుతూ ఉంటుంది. మొత్తం నెల అంతా డిశ్చార్జ్ మారుతూ ఉంటే, అది ఆ సమయంలో శరీరంలోని హార్మోన్ల స్థాయిపై ఆధారపడి ఉంటుంది. కానీ డిశ్చార్జ్‌లో గణనీయ మార్పులు కనిపిస్తే వెంటనే ఆ మహిళ డాక్టర్ సలహాను తీసుకోవాలి. శరీరంలో ఎక్కడ, ఎలాంటి పొరపాటు జరిగిందో తెలుసుకునేముందు, అసలు సాధారణంగా డిశ్చార్జ్ ఎలా అవుతుంది అనే విషయం కూడా డాక్టర్‌ను అడిగి తెలుసుకోవాలి.

పురుషుల కంటే మహిళల్లో కొవ్వు శాతం ఎక్కువగా ఎందుకు ఉంటుంది అని చాలామంది అనుకుంటూ ఉంటారు. అది సర్వసాధారణం.. ఎందుకంటే మహిళల్లో హార్మోన్లు కొవ్వుతో తయారవుతాయి. కొలెస్ట్రాల్‌తో తయారవుతాయి. శరీరంలో విడుదలయ్యే హార్మోన్లు వాటి నుంచే వస్తాయి. జననేంద్రియాలు ఆరోగ్యంగా ఉండటానికి, ముఖ్యమైన అవయవాల రక్షణకు మహిళలకు శరీరంలో కొవ్వు శాతం అధికంగా ఉండడం చాలా అవసరం. కొవ్వు కణజాలంతోనే ఈస్ట్రోజన్ హార్మోన్ తయారవుతుంది. అందుకే తక్కువ కొవ్వు పదార్థాలు తీసుకోవడం వల్ల రుతుచక్రంపై ఆ ప్రభావం కనిపిస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే శరీరానికి కావలసిన పోషకపదార్థాలు అందించకపోతే.. అవి సరైన రీతిలో హార్మోన్లను తయారుచేసుకోలేవు.. హార్మోన్ల ప్రభావం శరీరం మొత్తంపై ప్రభావం పడుతుంది. కాబట్టి శరీరాన్ని అర్థం చేసుకుంటూ, దానికి సరైన రీతిలో పోషకాహారాన్ని అందిస్తూ, ఆరోగ్యంగా ఉంచుకుంటే ఆరోగ్యంతో పాటు ఆరోగ్యం, ఆనందంతో పాటు ఆనందం కలుగుతుంది. ★

దివ్యౌషధం.. తమలపాకు





తమలపాకు, తాంబూలం.. పూజలకు మాత్రమే వాడతారని మనందరికీ తెలుసు. కానీ తమలపాకు ఔషధంగా కూడా పనిచేస్తుంది. నిత్య జీవితంలో తమలపాకును ఉపయోగించడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు దాగున్నాయో ఒకసారి చూద్దాం..

★ కొన్ని తమలపాకులను ఉప్పుతో కలిపి ముద్దగా నూరి వేడినీళ్లతో తీసుకుంటే బోదవ్యాధి తగ్గడానికి దోహదపడుతుంది.

★ తమలపాకును పదిగ్రాముల మిరియం గింజలను కలిపి తిని, వెంటనే చల్లనీళ్లు తాగుతుంటే స్థూలకాయం తగ్గి సన్నగా, నాజూగ్గా తయారవుతారు.

★ తమలపాకులను వేడిచేసి వాపు, నొప్పి కలిగిన కీలు మీద కడితే నొప్పి తగ్గుతుంది.

★ తమలపాకు జ్యూస్ తీసుకుంటే బలహీనత దూరమవుతుంది.

★ తమలపాకు రసాన్ని టీ స్పూన్ మోతాదులో మూడు పూటలా మిరియం పొడి కలిపి తీసుకుంటే వైరల్ జ్వరం తగ్గుతుంది.

★ వైరల్ ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా ఉండి గొంతు పూడుకుపోతే తమలపాకు రసం తీసుకుంటే కంఠం పెగులుతుంది. మాట స్పష్టతను సంతరించుకోవడమే కాకుండా కఫం తెగి వెలుపలకు వచ్చేస్తుంది.

★ జలుబు చేసి చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్న సమయంలో తమలపాకును వేడిచేసి, దానిపై కొద్దిగా ఆముదాన్ని రాసి ఛాతిపై వేసి కడితే ఫలితం ఉంటుంది.

★ తమలపాకులను పేస్ట్‌లా చేసి తలకు పట్టించి ఓ గంటసేపటి తర్వాత తలస్నానం చేయడం వల్ల చుండ్రు సమస్య తగ్గిపోతుంది. ★



ఆరోగ్యానికి అక్రోట్లు



ఆల్ఫా లినోలిక్ ఆమ్లం అధికంగా ఉన్న గింజలు అక్రోట్లు మాత్రమే! ఇవి స్త్రీ, పురుషుల్లో సంతాన సామర్థ్యాన్ని పెంచుతుంది. అక్రోట్లలోని మెలటోనిన్ నిద్రపట్టేలా చేస్తుంది. ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు రోగ నిరోధకశక్తినీ, తెలివితేటల్నీ, జ్ఞాపకశక్తినీ పెంపొందిస్తాయి. డిప్రెషన్నీ నిరోధిస్తాయి. అందుకే ఇవి మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయనీ, గర్భిణులు రోజూ కాసిని అక్రోట్లను తినడం వల్ల పిల్లల మెదడు పనితీరు కూడా బాగుంటుందనీ హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన పోషక నిపుణుల పరిశీలనలో తేలింది. వీటిల్లోని బయోటిన్ (బి7) జుట్టు పెరుగుదలకు తోడ్పడుతుంది. ఇంకా ఫైటోస్టెరాల్స్ ఒత్తిడినీ, ప్రొస్టేట్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్నీ అడ్డుకుంటాయి.

వందగ్రాముల అక్రోట్లలో..

శక్తి: 654 కేలరీలు
ప్రొటీన్లు: 15.2 గ్రాములు
పిండిపదార్థాలు: 13.7 గ్రాములు
కొవ్వులు: 65.21 గ్రాములు
శాచ్యురేటెడ్: 6.1 గ్రాములు
మోనో అన్‌శాచ్యురేటెడ్: 8.9 గ్రాములు
పాలీఅన్ శాచ్యురేటెడ్: 47.1 గ్రాములు
కాల్షియం: 98 మిల్లీగ్రాములు
కాపర్: 1.59 మిల్లీగ్రాములు
ఐరన్: 2.91 మిల్లీగ్రాములు
మెగ్నీషియం: 158 మిల్లీగ్రాములు
పొటాషియం: 441 మిల్లీగ్రాములు
విటమిన్ ఇ: 0.7 మిల్లీగ్రాములు ★

శ్రీనరసింహ శతకము

సీ॥ ధీరతఁ బరుల నిందింపనేర్చితిఁగాని
తిన్నగా నినుఁ బ్రస్తుతింపనైతి
పొరుగు కామినులందు బుద్ధి నిల్పితిఁగాని
నిన్ననే సతము ధ్యానింపనైతి
పొరికి ముచ్చటలైన మురిసివింటిని గాని
యెంచి నీకథలాల- కించనైతి
కౌతుకంబునఁ బాతకము గడించితిఁగాని
హెచ్చు పుణ్యము సంగ్రహింపనైతి
తే॥ అవనిలో నేను జన్మించి నందుకేమి
సార్థకము గానరాదాయె స్వల్పమైన
భూషణవికాస! శ్రీ ధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: ఓ నరసింహ ప్రభూ! ధైర్యంగా ఇతరుల్ని తిట్టం నేర్చానే గాని నిన్ను పొగడుతూ ధ్యానించలేకున్నాను. అన్యకాంతలపై ఆసక్తి పెంచుకున్నానేగాని, ఎల్లప్పుడు నిన్ను స్మరించలేకపోయాను. కల్లబొల్లి కబుర్లపై మక్కువ పెంచుకున్నానేగాని, నీ కథల్ని చెవులార వినకపోయాను. ఎంతో ఉత్సాహంతో పాపాలు చేశానేగాని పుణ్యమార్జించలేకపోయాను. అందుకే ఈ లోకంలో పుట్టినందుకు నా జీవితానికి ఎలాంటి సార్థకత లేకుండాపోయింది.



అనంతం

43 -గోపరాజు నాగేశ్వరరావు

రాగ్యా వైపు చూస్తూ-

రాగ్యా దగ్గిరకి వెళ్ళాడు.

దేవర చెవిలో రహస్యంగా ఏదో చెప్పాడు.

''పరిత్తితి గ్రెహిచ్చే అడుగుతుండావు! సెప్పు సాఁవీ'' అని, దేవరకి మళ్ళీ దణ్ణం పెట్టాడు నగ్గూరాం.

''ఇనుకోండి రా...సెప్తుండాను.''

అందరూ దేవరవైపు ఆసక్తిగా చూస్తున్నారు!

''శలాకి పిల్ల! శందురుడి పేరుండ సక్కదనాల పిల్ల.''

''శాందినీ గాదు గదా''అన్నాడు నగ్గూరాం.

''అవ్రున్రారే.. నగ్గూరాంగా! శాందినీనే జోగిన్ని సెయ్యాల''అని దేవర తేల్చి చెప్పాడు.

''నా కూతుర్నా''

''అవ్రున్రారే.. ''అన్నాడు దేవర.

అంతే-

''దేవరా..!''అంటూ నగ్గూరాం గావుకేక పెట్టి,-

తరంగ తరంగాలుగా మార్మోగుతున్న ఆ ధ్వని అతని చెవుల్లోనే యింకి పోతోంటే- మొదలు నరికిన చెట్టులా నేలమీద కూలిపోయాడు నగ్గూరాం!

అందరి దృష్టీ నగ్గూరాం వైపుకు మళ్ళింది.

రాగ్యా హడావుడిగా దేవర దగ్గరికి వెళ్ళాడు. జేబులోనుంచి

విస్కీ సీసా బైటికి తీశాడు.. రహస్యంగా కనకయ్య చేతికి అందించాడు.

విస్కీ అంతగా గటగటా తాగి,

''చాంద్‌నీకి కన్నెరికం ఎవరు పెట్టాలో ఇప్పుడు చెప్తాను''అన్నాడు, ఖాళీసీసా రాగ్యాకిస్తూ.

దాన్ని ఎవ్వరికీ కనిపించకండా బొడ్లో దోపుకున్నాడు రాగ్యా.

గబగబా వెళ్ళి జనంలో నిల్చున్నాడు.

రాగ్యా ఆనందం అంతా యింతాకాదు!

అసలు కథ ఇప్పుడు మొదలౌతుంది!

చాంద్‌నీని జోగిన్ని చెయ్యగానే దానికి నన్నెరికం రాగ్యాపెట్టాలని దేవర చెప్తాడు... అది గరుడాచలం ఆర్డరు!

తండావాళ్ళు దేవర మాటకాదనరు!

అప్పుడు చాంద్‌నీ వశమౌతుంది. అనుభవిస్తాడు. తృప్తిగా అమర సుఖాలు పొందుతాడు. దాన్ని పట్నం తరలిస్తాడు. 'ఇల్లు'అనబడే పంజరంలో బంధించి ఆనందాలు జుర్రుకుంటాడు.

చాంద్‌నీ జోలికి ఎవ్వరూ రారు.

పేరుకుమాత్రమే అది జోగిని కానీ, తనకు తప్ప దాని శరీరంమ్మీద మరెవ్వరికీ అధికారం ఉండదు!

గత్యంతరం లేని పరిస్థితులు కల్పించి చాంద్‌నీని అలా తనకు అప్పగించేందుకే యీ నాటకం ఆడిస్తున్నాడు గరుడాచలం!

మనసులోనే గరుడాచలానికి కృతజ్ఞతలు చెబుతూ, తలెత్తి దేవరవైపు చూపాడు రాగ్యా.

మళ్ళీ తను అందించిన విస్కీ తాగి, కనకయ్య రెట్టించిన ఉత్సాహంతో చిందులు వేస్తున్నాడు.

ఎవ్వరో మొహంమ్మీద నీళ్ళు చల్లారు.

నగ్గూరాం తేరికొని లేచాడు.

ఖిన్న వదనంతో దిక్కులు చూస్తున్నాడు.

''అరే...బాణావతుగా..!'' పిల్చాడు దేవర.

''ఏంటి సాఁవీ.''

''శాందినీని జోగిన్ని శాత్తండారు గదూ''

''శాత్తన్నాఁవు.''

''కన్నెరికఁవ్ బెట్టేదెవురు.''

బాణావతు మౌనంగా నిల్చున్నాడు.

''తొందరగా సెప్పు సాఁవీ'' అన్నారెవరో.

'సెప్తాడుండు! తొందరంటే ఎట్టా...'' అన్నాడు రాగ్యా అసహనంగా.

'సెప్తున్నా.. సెప్తున్నా..''

''ఏంటి సాఁవీ- సరిగ్గా యినిపిచ్చలా! రాగ్యాగా డన్నావా సాఁవీ''అని ఆశగా అడిగాడు రాగ్యా.



నగ్గూరాం గొంతులోనుంచి మాటలు పెగలటం లేదు.

''నువ్వే సెప్పు సాఁవీ''అన్నాడు కాళీచరణ్.

రాగ్యాకి నరాలు తెగే ఉత్కంఠగా వుంది! సంతోషాన్ని బలవంతంగా నిగ్రహించుకొంటూ దేవర వైపే చూస్తున్నాడు!

తన పేరు చెప్పటమే తరువాయి.

దేవర పూనకం నటిస్తున్న కానిస్టేబులు కనకయ్య చెప్పే ఒక్క మాటతో జీవితం అద్భుతంగా మార్తుంది! రాగ్యా ఎదురుచూస్తున్నాడు!

''సెప్తున్నా.. సెప్తున్నా..''అన్నాడు దేవర.

''శాందినీకి కన్నెరికఁవ్ బెట్టేవోడు- గరుడాశులఁవ్'' అన్నాడు దేవర!

నిర్ఘాంతపోయాడు రాగ్యా.

మెదడు ఒక్క క్షణం స్తంభించిపోయింది.

కళ్ళముందు చీకట్లు క్రమ్మినట్లుంది!

''రాగ్యా'' అని చెప్పకుండా గరుడాచలం పేరు చెప్పాడేమిటి?

ద్రోహం గరుడాచలం చేశాడా? కనకయ్య చేశాడా?

గరుడాచలం ఆజ్ఞలేకుండా కనకయ్య స్వతంత్రించి అలా చెప్పడు!

అంటే-?

ఇదంతా చేసింది గరుడాచలమేనా? ఎంత నమ్మకద్రోహం!

కన్నీళ్ళ పర్యంతమయ్యాడు రాగ్యా!

అప్పటికీ ఆశ చావక-

''దేవరా! పెద్దంగ జెప్పు! ఎవరు బెట్టాలి కన్నెరికఁవ్?''అని అడగాడు రాగ్యా.

''ఎన్నిసార్లు సెప్పాల్రా...శబ్బర్నాకొడక! గరుడాశలఁవ్''అని గొంతు చించుకొని అరిచాడు దేవర.

ఆ ఆశకూడా చచ్చిపోయింది!

మరో ఆశ మొలకెత్తి-

'దేవరా! అడివి పిల్లకి అడివి పిల్లోడే తొలిపాలి కన్నెరికఁవెట్టాలి గానీ పట్నపోడు బెడితే ఎట్టా?'' అని అడిగాడు.

''తొలి రేత్తిరి కన్నెరికఁవెట్టేవోడు శాందినీకి సీర, రెయిక బెట్టాల. బంగారఁ వియ్యాల డబ్బులియ్యాల! అయ్యన్నీ ఇయ్యనీకి అడివి పిల్లోళ్ళకాడ ఏఁవుంది గోసీ..''అన్నాడు దేవర.

ఆ ఆశ కూడా చచ్చిపోయింది.

''తొందరగా యళ్ళండి. శాందినీ నెత్తకరాండి. జోగిన్ని సెయ్యండి'' అని దేవర ఆదేశ మయ్యింది!

కొంతమంది అడవిపుత్రులు చాంద్‌నీకోసం వెళ్ళారు.

రాగ్యాకి ఇక అక్కడ క్షణంకూడా ఉండబుద్ధికాలేదు. జనాన్ని తప్పించుకొంటూ దూరంగా వెళ్ళాడు.

అప్పటిదాకా మౌనంగా అంతా చూస్తున్న గోపీనాయక్ తండావాళ్ళ నమ్మకాల్ని కాదనలేక, తన అభిప్రాయం చెప్పలేక నలిగిపోయాడు.

ఇక తప్పదని, చాంద్‌నీని రక్షించేందుకు తండావైపుకు ముందుగానే సాగిపోయిన విషయం ఎవ్వరూ గమనించలేదు.

❊ ❊ ❊

నల్లకొండకి దూరంగా అడవిలో ఓ బండరాయి మీద కూర్చొని రాగ్యా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు!

ఇలా జరిగిందేమిటి?

నమ్మిన వాడ్ని వంచించటానికి గరుడాచలానికి మనసెలా ఒప్పింది?

నమ్మిన తన తప్పా? వంచించిన గరుడాచలం తప్పా?

చాంద్‌నీ పట్లగల వ్యామోహంతో చేసిన తప్పులకు అదే శిక్షా?

మనసావాచా కర్మణా అతను చాంద్‌నీని కోరుకున్నది నిజం..

ఆమే ప్రాణమై, జీవితమై, ఉచ్ఛ్వాస నిశ్వాసలై నియంత్రించింది నిజం!

అందులో ఆమె ప్రమేయం లేకపోవచ్చు.

వ్యసనాలు మరిగి వక్రమార్గం తొక్కినందుకే కదా, ఆమె అలా తిరస్కరించింది!

(ఇంకా ఉంది)

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
ఆకస్మిక ధనలాభముంది. రాజకీయరంగంలోనివారికి, క్రీడాకారులకు అద్భుతమైన అవకాశాలు లభించును. అన్నింటా విజయాన్నే సాధిస్తారు. బంధు, మిత్రులు కలుస్తారు. శుభవార్తలు వింటారు. వృత్తి ఉద్యోగరంగాల్లోనివారికి అభివృద్ధి ఉంటుంది.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు. గౌరవ మర్యాదలు లభిస్తాయి. శుభవార్తలు వింటారు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
అనవసరమైన భయాందోళనలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి. ఋణప్రయత్నాలు చేస్తారు. ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
ఆత్మీయుల సహకారం లభిస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. అనారోగ్య బాధవలన బలహీనులవుతారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త అవసరం. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృధా ప్రయాణాలు చేస్తారు. స్థానచలన సూచనలున్నాయి. సన్నిహితులతో విరోధమేర్పడకుండా మెలగుట మంచిది.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
అనుకోకుండా కుటుంబంలో కలహాలేర్పడే అవకాశముంటుంది. అశుభవార్తలు వినాల్సి వస్తుంది. ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్తపడుట మంచిది. మనస్తాపానికి గురిఅవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతన కార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
కుటుంబమంతా సంతోషంగా నుంటారు. గతంలో వాయిదావేసిన పనులన్నీ పూర్తిచేసుకుంటారు. సంపూర్ణ ఆరోగ్యమేర్పడుతుంది. స్థిర నివాసముంటుంది. వ్యవసాయ మూలకంగా లాభాలను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ ఫలిస్తాయి. సూక్ష్మవిషయాలను గ్రహిస్తారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా వుంటాయి. అనుకూల పరిస్థితులేర్పడతాయి.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముంటుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి వుంటుంది. ఆత్మీయులను కలియుటలో విఫలమవుతారు. అనవసర వ్యయ ప్రయాసలవల్ల ఆందోళన చెందుతారు. వృధా ప్రయాణాలెక్కువగా వుంటాయి. స్త్రీల మూలకంగా ధనలాభముంటుంది.


● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ఋణప్రయత్నాలు ఫలించును. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. స్త్రీలకు స్వల్ప అనారోగ్య బాధలుండును. బంధు, మిత్రులతో జాగ్రత్తగా ఉండడం మంచిది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంటుంది. వృధాప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో సహనం వహించక తప్పదు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. ఒక ముఖ్యమైన కార్యక్రమం పూర్తి అవుతుంది.

మాటాట

నిర్వహణ: సుధామ 1853



అడ్డం	ఆధారాలు	నిలువు
2. బంగారము		1. తలక్రిందయిన గ్రుడ్డు
5. హంస, మరాళము		3. సమూహము
7. వాలము		4. చిన్నకాలువ
8. ఆకలి		6. నేత్రము
9. నీడ		7. నీరు
10. మృతి		10. అందగత్తె, కుబేరుని భార్య
12. ముసలితనము		11. కుండలు చేయు వృత్తివాడు
14. బాలవిథవ, అనాథ		13. నింద, అపవాదము

మాటాట-1852 సమాధానాలు

అడ్డం		నిలువు	
1. నేస్తకాడు	9. హిక్క	1. నేతాజీ	7. మహిషి
4. ధాత్రిక	10. జ్యాని	2. కాకి	8. ధమని
5. జీడి	12. మనిషి	3. నకలు	11. జ్యావల్లి
6. చేవ	14. రాళ్ళపల్లి	4. ధావని	13. బిళ్ళ

మోక్షానికి మార్గం భగవద్గీత

డా॥ అక్కిరాజు సుందర రామకృష్ణ

దీని ఆవశ్యకత కలియుగంలోనే ఎక్కువగా ఉంటుందనే తలంపుతో అందించాడు. నిజంగానే గీతామృతాన్ని లోకానికి అందించాడు. సంసార సాగరంలో ఈదులాడేవాడు దీనిని తప్పక చదవాలి. ఈ సంసార సాగరంలో మునిగిపోయేవాడికి, లేదా మునిగిపోతున్నవాడికి నిస్సంశయంగా యిది ఒక నావే!

ఈ గీతాసారాన్ని విపరీతంగా అధ్యయనం చేసిన మహనీయుడు, గొప్ప నాటక కర్త కీ.శే. కాళ్ళకూరి నారాయణరావుగారు తమ భక్త చింతామణి నాటకంలో మొదటి రంగంలోనే నాయకుడైన బిల్వమంగళుని నోటిమీదుగా-

కష్టభరితంబు బహుళ దుఃఖ ప్రదంబు
సార రహితంబునైన సంసారమందు
భార్యయను స్వర్గమొకటి కల్పనము జేసె
పురుషుల నిమిత్తము పురాణ పురుషుండు!

అని అంటారు. తర్వాత వచ్చే 'పురాణ పఠన' ఘట్టంలో నిజంగానే భగవద్గీతా సారాన్ని కూడా అందించారనిపిస్తుంది. అజ్ఞానమే అన్ని దుఃఖములకు మూలం. ఈపరమ సత్యాన్ని బోధించేదే గీత- మహాభారతం 18 పర్వాలు. భగవద్గీతలో వున్నవి కూడా 18 అధ్యాయాలు. మహాభారత యుద్ధం జరిగింది కూడా 18రోజులు. పాల్గొన్న సైన్యం కూడా 18 అక్షౌహిణిలే! అక్షౌహిణి అంటే ఏమిటో, ఎన్ని ఏనుగులు, ఎన్ని రథాలూ, ఎన్ని గుర్రాలు, ఎంతమంది సైనికులు పాల్గొన్నారో, వాటి వివరణ తొలి మాటలోనే చాలా అందంగా వివరించారు శ్రీమొదలివారు. అంతేగాదు, మన దేహంలో ఉన్న ఇంద్రియాలు, వాటి గుణాలూ, వర్తనలూ ఇవన్నింటికీ అద్భుత వివరణతో అందించారు. శ్రీకృష్ణుడు చెప్పిన శ్లోకాలెన్నీ, అర్జునుడు చెప్పినవి ఎన్నో, సంజయుడు ఎన్ని చెప్పాడు అన్న విషయాన్ని చాలా వివరణాత్మకంగా అందించారు. మొత్తం 700 శ్లోకాలనీ, కొన్ని కొన్నిప్రతులలో ఈ సంఖ్య 701గా కనబడుతుందని కూడా వివరించారు శ్రీ సుబ్రహ్మణ్యం గారు.

ఈ గీతను కృష్ణుడు అర్జునునికి ఎప్పుడు ఏ సందర్భంలో చెప్పాడో అన్న అంశాన్ని కూడా వివరించారు. ఏ భీష్ముడికో, విదురుడికో చెప్పకుండా కేవలం అర్జునుడికే ఎందుకు చెప్పాడో అన్న విషయాన్ని ప్రతి పాఠకుడూ చదవాలి. అదిగూడా హాయిగా భోంచేసి, తాంబూలం సేవిస్తూ, ఉయ్యాల బల్లమీద ఊగుతూ అర్జునుడికి చెప్పలేదు. ఇంకా సేపట్లో యుద్ధం ప్రారంభమౌతున్నది అనే సమయంలో చెప్పాడు. అలా ఎందుకు చెప్పాడో కూడా 'మొదలి' వారి మాటలలోనే పాఠకుడు చదవాలి. మనస్సులో సంఘర్షణ తలెత్తినప్పుడు నివారణోపాయం 'భగవద్గీతా'పఠనం అన్నమాట. ఏడుస్తున్న అర్జునుడికి కన్నీళ్ళు తుడిచాడు. అమృతవాక్కులు వినిపించాడు. ఆత్మస్థైర్యం కలిగించాడు. యుద్ధానికి ఉద్యుక్తుణ్ణి చేశాడు. విజయలక్ష్మిని వరించేటట్లు చేశాడు. నిజంగానే ఈ వ్యాఖ్యాత సూచించినట్లు 'గీత' చదివితే పుణ్యం వస్తుందనీ, స్వర్గసుఖాలు సంప్రాప్తమౌతాయనీ, నేరుగా మోక్షం వస్తుందనీ చదువగూడదు. ఇది నిజంగానే మోక్షానికి మార్గం చూపుతుంది. విద్యార్థి దశనుండే భగవద్గీతను పాఠశాలలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలన్న మాటలు మనసుల్ని పులకించేలా చేస్తున్నాయి. ఒక పరిశోధనాంశంగా వ్యాప్తిలోకి తేవాలి. 'సత్యసాయి విద్యావిహార్' లాంటి పాఠశాలలలో మాత్రం నిత్యం భగవద్గీతా శ్లోకాలను విద్యార్థులకు గురువులు నేర్పడం, అంటే వారిచే పఠింపజేయటం జరుగుతున్నది. అపుడు నిజంగానే ప్రతి విద్యార్థిలో ఆత్మస్థైర్యం పెరుగుతుంది.

గంధర్వ గాయకుడు ఘంటసాల వారి గీతా పఠనశ్లోకాలను స్మశానం దగ్గర వినిపించడం బాధాకరం అంటూ వాపోయారు ఈ వ్యాఖ్యాత. ఈ వ్యాఖ్యానం అంతా ఒక యెత్తు, 16వ అధ్యాయం 'దైవాసుర సంపద్విభాగయోగం' మరో యెత్తు. దైవీ సంపద అంటే ముఖ్యంగా జ్ఞాన సంపద. సద్గుణాలు కలిగి ఉండడం. అలాగే 'ఆసురీ సంపద' అంటే దుర్గుణాలు కలిగి ఉండడం. హింసా ప్రవృత్తి, మత్తు పదార్థాలు సేవించడం, ప్రతిదానినీ ద్వేషించడం, అమితమైన కోరికలు కలిగి ఉండడం- వేటిని విడిచిపెట్టాలో, వేటిని అవలంభించాలో అనే శ్లోకాలకు 'మొదలి' వారి వివరణ నిజంగానే సరళ సుందరంగా ఉన్నది. అందుకే దీనిని 'దైవాసుర సంపద్విభాగం' అన్నారు.

831 పుటల ఈ భగవద్గీతా వ్యాఖ్యానాన్ని డాక్టర్ పబ్లికేషన్స్ వారు తెలుగు ప్రజానీకానికి అందించారు. ప్రచురణదాత శ్రీమతి సామ అమృతమ్మ. పీచుపల్లి గ్రామం, గన్నేరువరం మండలం, కరీంనగర్ జిల్లా. అన్నింటికన్నా ఆశ్చర్యకరమైన విషయం యిది అమూల్యం. మొదటి ముద్రణ మార్చి 2018. వేణుగ్రాఫిక్స్, నల్లకుంట, హైదరాబాద్‌వారు దీనిని వెలుగులోనికి తేవడానికి కారణభూతులు. దీని ముద్రణదాత సామ రామరెడ్డి, అమృతమ్మల దౌహిత్రుడు చి. విజయేందర్‌రెడ్డి కావడం, అతని చిత్తశుద్ధికి, భక్తి ప్రపత్తికి తార్కారణం. దౌహిత్రుడంటే యిలా వుండాలి. ఇటువంటి సత్కార్యాలను చేయడానికి నేటి తరం ముందుకు రావాలి.

కామ క్రోధ వియుక్తానాం యతీనాం యత చేత సామ్

అభితో బ్రహ్మ నిర్వాణం వర్తతే విదితాత్మనామ్- (కర్మసన్యాస యోగం- 26శ్లో.) అన్న శ్లోకానికి మొదలివారు చేసిన వ్యాఖ్యానం ముఖ్యంగా పఠితల్ని మరీ మరీ చదివించేలా చేస్తుంది.

(సమాప్తం)

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథలు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

కానీ, దాన్ని తెగేసి ప్రోత్సహిస్తూ శ్రీపాదవారు జూనియరూ కాదు, అల్లుడు అన్న కథ రాశారు. తహస్సీలుదారు గాదు -వర్తకుడు, వెలుగు-చీకటి నలుగుర్ని పోషిస్తున్నానిప్పుడు అన్న కథలు పాఠకులలో స్వతంత్ర వృత్తిమీద ఆసక్తిని, గౌరవాన్ని కూడా పెంపొందించాయని నాటికీ నేటికీ విజ్ఞులు వక్కాణిస్తున్నారు. వీరేశలింగం పంతులుగారు అన్నా, బంకించంద్ర ఛటోపాధ్యాయగారు అంటేనూ శాస్త్రిగారికి చెప్పనలవిగాని యిష్టం. వీరేశలింగం పంతులుగారినే తనకథలలో ఒక పాత్రగా ప్రవేశపెట్టి రంజుగా; సంఘ శ్రేయోభిముఖంగా కొన్ని కథలను ఆయన నడిపించాడు. స్త్రీ

వినమరుగైన..

వీరాజీ

జనోద్ధరణ మాత్రమే గాదు-స్త్రీల మీద అపారమైన ప్రేమాభిమానాలతో శ్రీపాదవారు ఎక్కువ భాగం కథలు రాశారు. అరికాళ్ల క్రింద మంటలు అన్న కథలో ఒక బాల వితంతువు తన సవతి తల్లీ, అక్కలూ పెట్టే బాధలు తట్టుకోలేక అట్టి అరికాళ్ల క్రింద మంటలు భరించలేక అర్థరాత్రి వేళ రాజమండ్రి పారిపోతుంది. ఒక బండివాడు ఎక్కడికమ్మా వెళ్తారూ అనడుగతాడు. ''దానవాయిపేటకు వెళ్ళాలబ్బీ'' అంటుంది. దానికా బండివాడు సంగతి గ్రహించి ''అమ్మా, పంతులుగారి తోటకే అయితే డబ్బులివ్వక్కరలేదులే, తొందరగా బండెక్కండి, రేపీ పాటికి పెళ్లిచేయిస్తారు'' అని చెబుతాడు. ఈ కథలో బండివాని పాత్రకూడా మరపురానిదే. వితంతు పునర్వివాహ ఆవశ్యకతపై ఆయన రాసిన కథలన్నీ అతి సహజసిద్ధంగా అపూర్వ శీర్షికలతో సంస్కరణలు స్ఫూర్తినిస్తాయి. శైలీ, శిల్పాలతో సజీవ చిత్రణలుగా భాసించాయి ఆ కథలు.

శ్రీపాదవారు మొదట్లో పద్యం నుంచి గద్యంలోకి మారగానే నేరుగా వాడుక భాషను ఎత్తుకొనలేదు. సరళ గ్రాంథికంలో రాశారు. అటు తరువాత, తన కథనమంతా సరళ గ్రాంథికంలో నడిపిస్తూ పాత్రలయొక్క సంభాషణలను మాత్రం నిత్య నూతన వాడుక భాషలో నడిపిస్తూ వచ్చారు. అదీ వదలి 1925తరువాత మాత్రం అనితరసాధ్యమైన వ్యవహారిక భాషా ప్రయోగాలతో సంవాదనా శైలిలో కథలను తీర్చిదిద్ది చదువరులను వాటి వెంట గ్రుక్క తిప్పుకోకుండా పరుగెత్తించారు. గులాబీ అత్తరు, రాచపీనుగ తోడులేనిదే వెళ్లదు, కొత్తరికం, ముళ్లచెట్టూ - కమ్మని పువ్వూ లాంటికథలు పదే పదే చదివించే కథలు!

శ్రీపాదవారి కథలకు బీజం, క్షేత్రం కూడా నాటి సంఘమే. అగ్రహారీకులలో రావాల్సిన మార్పులనూ భ్రష్టుపట్టిపోయిందనుకున్న బ్రాహ్మణ సమాజాన్ని ఉద్ధరించే లక్ష్యంతోనూ ఆయన పుంఖానుపుంఖాలుగా రాశారు. అయితే కేవలం బ్రాహ్మల బాగోగులను గుర్తించి వారందుకే అంకితం అయిపోయారు అనుకోవడానికి వీలు లేదు. సంఘంలో నవీన యుగపు పోకడలు యిల్లాలితోను, యింటితోను మొదలవ్వాలని దానికి అన్నికులాలలోను వివాహ వ్యవస్థలో సరళమైన మార్పులు రావాలని కోరుతూ ఆయన తన దృష్టిని అన్ని కులాలు, మతాలూ వర్గాలమీద కేంద్రీకరించారు.

- సశేషం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

హిందూమత దివ్యత్వం

డా॥ గరికపాటి ఆనంద్
9966059562



మతపరమైన ఘర్షణలు మరియు యుద్ధాలు, మత మార్పిడులు మరియు మత ప్రచారము సమాంతరంగా సాగే కలియుగంలో ప్రస్తుతం మనము జీవిస్తున్నాము. మత విశ్వాస ప్రచారం చేయడానికి టీవీ, సమావేశాలు మరిఅయు ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేయడం వంటి సాధనాలు అన్నీ ఉపయోగించబడుతున్నాయి. ''ఎందుకీ ఘర్షణలు మరియు యుద్ధాలు జరుగుతున్నాయి'' అని ప్రశ్నిస్తే, వారి మతం శాంతియుతమైనదని పేర్కొంటూ ఇతర మత విశ్వాసాలను నిందిస్తారు. వేలాది సంవత్సరాలుగా కొనసాగుతూ ఉన్న మతపరమైన యుద్ధాలకి సంబంధించిన కారణాలను మరియు పైన ప్రస్తావించిన అతి ముఖ్యమైన ప్రశ్నకు ఏ ఒక్కరూ కూడా సమాధానం కనుక్కోవడములో ఎందుకు విజయం సాధించలేదన్న విషయాలను పరిగణలోకి తీసుకొని మనం పరిశీలిస్తే బహుశా ఇతర మతాలు అసలు ప్రయత్నించలేదన్న నిర్ధారణకి రావలసి వస్తుంది.

పైన ప్రస్తావించిన వాస్తవము చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఎందుకంటే ఈ సమస్యకి కారణాలను వెలుగులోకి తీసుకురావాలన్న ప్రయత్నంలో ఆధ్యాత్మికంగా ఆలోచించే ఏ వ్యక్తి అయినను ఈ విషయం గురించి పరిశీలించి, విశ్లేషించి వారి భావాలను వ్యక్తం చేస్తారు. సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించినప్పుడు ఆ సత్యం మనకు అనుకూలముగా ఉండకపోవచ్చని మనము గుర్తుంచుకోవలసిన విషయం. ఇతర మతాలవారు సత్యాన్ని తెలుసుకోవడానికి భయపడుతున్నారా ?

ఎప్పుడైతే సత్యం మనకు అనుకూలముగా లేదని తెలుసుకుంటామో అప్పుడు రాజకీయ సంబంధిత పరిణామాలు ఉంటాయి. అంటే ప్రజలలో ఆవిశ్వాసం మీద నమ్మకం తగ్గుతుంది. అదే మతపరమైన యుద్ధాల వెనుక ఉన్న నిజమైన కారణాలను ప్రజలు తెలుసుకోనీకుండా నివారించటమే నిజమైన కారణం. ఈ యుద్ధాలకు అంతం లేదన్న బాధాకరమైన నిజం ఈ అభిప్రాయానికి వచ్చేలా చేస్తుంది.

భగవద్గీత పై ఎన్నో వ్యాఖ్యానాలు ఉన్నా ఇప్పటికీ సూక్ష్మమైన, సున్నితమైన ప్రశ్నలకు సమాధానాలు మిగిలి ఉన్నాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలు దొరికేంతవరకు ఈ దివ్య సందేశం సంపూర్ణంగా అర్థం కాదు. కనుక గీత, మహాభారతం మరియు వేదాలపై ఉన్న కొన్ని ప్రముఖమైన ప్రశ్నలకు పరిగణలోకి తీసుకొని వాటికి సమాధానాలు ఇచ్చాము. ఈ వ్యాసాలు గీతలో ఉన్న ప్రతి శ్లోకానికి గాని లేక పరిగణలోకి తీసుకొన్న యితర గ్రంథాలపై గాని వ్యాఖ్యానం కాదు. ఇతర మత విశ్వాసాల పద్ధతులు పోలిక కోసమై చేర్చబడ్డాయి.

ప్రశ్నలకి సమాధానం మరియు వివరణ కోరుకుంటున్న ఏ పాఠకునికైనా ఈ వ్యాసాలు ఉపయోగకరంగా ఉంటాయి . తల్లిదండ్రులు తమ పిల్లలు లేక మరి ఎవరైనా అడిగే క్లిష్టమైన ప్రశ్నలకు సమాధానం యివ్వడానికి సహాయపడుతుంది. పరమత మూలాధారమైన సిద్ధాంతాలు మరియు పద్ధతులు పరిశీలించనిదే భౌతికవాదం, మతం పేరిట మూలాధారమైన సిద్ధాంతాలు, కప్పిపరచి ఉన్న రాజ్యకాంక్షకు అడ్డుగోడగా కనబడే ఆధ్యాత్మికతని అర్థం చేసుకోవడం మరియు వాటి మధ్య తేడాలు తెలుసుకోవడం కష్టం.

గీతలో శ్రీకృష్ణుడు తనను తాను అర్థం చేసుకోవడానికి అర్జునునికి సహాయపడతాడు. అనుసరించేవారికి వారి విశ్వాసాన్ని అర్థం చేసుకోవాలంటే క్లిష్టమైన ప్రశ్నలను ఎదుర్కోవలసి ఉంటుంది. అటువంటి ఆత్మ శోధన లేకుండా, అవగాహన ఎప్పుడూ సంపూర్ణం కాజాలదు.

ఈ ప్రశ్నలు ఎదుర్కోకుండా ఇతర మత విశ్వాసాల గురించి వ్యాఖ్యానించడం సరైనది కాదు. ఈ ప్రశ్నలు హిందువులకు వారి స్వంత మతాన్ని అర్థం చేసుకొని ప్రశంసించడానికి సహాయ పడతాయి. మత మార్పిడులకై అన్ని సాధనాలు అందుబాటులో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు, స్నేహితులకు మరియు తెలుసుకోవాలనుకునే వారికెవరికైనా వివరించడానికి యువత మరియు పెద్దలు హిందూమత గొప్పతనం గురించి తెలుసుకోవడం ఎంతో ప్రధానం. ఈ విధంగా ఒక తరం నుంచి మరో తరానికి జ్ఞానం అందింపజేయవచ్చు.

ఈ పరిస్థితులలో భాష, మత విశ్వాసం మరియు వేర్వేరు ఖండాలలో ఉన్న సంస్కృతి గురించి తెలుసుకోవడానికి సమాజ సేవలో నిరంతరం కృషి చేస్తున్న ప్రొఫెసర్ డి. నికొలస్ వంటి మేధావుల అభిప్రాయాలు గొప్ప ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. ఎందుకంటే అవి వారి మూల విశ్వాసం యొక్క జ్ఞానముతో పరిశీలించబడి ఉంటాయి. కనుక పండితుడు మరియు పలు గ్రంథాల రచయిత అయిన ప్రొఫెసర్ డి.నికొలస్ యొక్క అభిప్రాయాల ద్వారా గీతా అవగాహన ప్రయాణం ప్రారంభిద్దాము.

పరిచయం

హిందూమతం యితర భారతీయ మతాలైన భౌద్ధమతం, జైనమతం మరియు సిక్కు మతం యొక్క విశ్వాసాల మీద అపారమైన ప్రభావం కల దివ్యమతం. భగవద్గీతలోని కొన్ని సూత్రాలపై తీవ్రమైన అపోహలు ఉన్నాయి.

అదృష్టవశాత్తు పాశ్చాత్యులతో సహా పలువురు పండితులు భగవద్గీతపై పరిశోధనలు చేశారు. పాశ్చాతులు కుల సంబంధితమైన లక్షణాలకు లోబడకుండా ఆలోచిస్తారు. యితర మతాల విశ్వాసాల పట్ల విస్తృత దృక్పథం కలిగియుంటారు. కనుక మనము పాశ్చాత్య దేశాలలో ఉన్న పిన్న, పెద్దలకు ఆసక్తి కలిగిస్తున్న యోగాతో ప్రారంభిద్దాము.

పాశ్చాత్య దేశాలలో హిందూమత సంప్రదాయాలు

పాశ్చాత్య దేశాలలో హిందూ సంప్రదాయాలు, తత్వ శాస్త్రం మీద ఆసక్తి పెరుగుతోంది.

యోగా

ప్రశ్న. యోగా అంటే ఏమిటి ?

''యోగా 'యుజ్ అనే సంస్కృత పదం నుండి వచ్చింది. యుజ్ అనగా చేరిక, ఐక్యం అని అర్థం. దీని అర్థం

వ్యక్తి యొక్క శరీరం మనసుతో, మనసు ఆత్మతో చేర్చి పరమాత్మలో ఐక్యం చేసి సంతోషకరమైన, నియమబద్ధమైన సమతుల్యమైన జీవితాన్ని గడపడానికి చేసే సాధన.''

ఫోర్బ్స్ పత్రికలోని నివేదిక ప్రకారము

''2012 సంవత్సరంలో యోగా పత్రిక తరపున క్రీడా క్రయ విక్రయాల సమీక్ష చేసిన పరిశోధన ద్వారా తేలినదేమిటంటే 2008 సంవత్సరంలో 15.8 మిలియన్ల మంది యోగా సాధన చేస్తే, అదే గత సంవత్సరం దాదాపు 20 మిలియన్ల మంది అమెరికన్లు, దాదాపు 8.7% శాతం వయోజన జనాభా అంటే 18 సంవత్సరాలు పైబడినవారు, యోగా సాధన చేశారు''.

''రహదారి ప్రక్కన తమ రంగు రంగుల చాపలు పరిచి యోగా గురువు తమేక లాసన్ శిష్యులు ఆమె చేసిన బోధనలను అనుసరించడానికి ప్రయత్నిస్తున్నారు. శ్వాస మీద ఏకాగ్రత పెట్టమని మరియు వారి పరిసరాల సౌందర్యంపై దృష్టి కేంద్రీకరించమని. ''ఈ ప్రయత్నం పోలీసు వారి దృష్టిని కూడా ఆకట్టుకొంది. హింసని అరికట్టేందుకు ఆ ప్రాంతంలోని యువత కోసం నిర్వహించే హింసావ్యతిరేకపు కార్యక్రమములో భాగంగా ఒక రక్షణాధికారి లాసన్ క్లాస్‌ను చేర్చాడు.

పిల్లలకు యోగా వలన ప్రయోజనాలు

''పిల్లలకు యోగాద్వారా విస్తృతమైన ప్రయోజనాలు కలుగుతాయి. శారీరకంగా, ఇది దృఢత్వాన్ని, చురుకుదనాన్ని, సమన్వయమును, శరీర అవగాహనను పెంచుతుంది. పైగా వారిలో ఏకాగ్రత, ప్రశాంతత, సడలింపు లక్షణాలను పెంచుతుంది. యోగా ద్వారా పిల్లలకు వ్యాయామం, క్రీడలు, ఆత్మావలోకనం మరియు పరిసర సహజ ప్రపంచంతో సన్నిహిత బంధం కలుగుతుంది. పిల్లల్లో అంతర్గతంగా ఉన్న ఆత్మ జ్యోతిని యోగా వెలికి తీస్తుంది.

ఇల్లినాయిస్‌లో పరిశోధన

యోగా ద్వారా మెదడులో చురుకుదనము పెరుగుతుందని విశ్వవిద్యాలయం వారుచేసిన అధ్యయనంలో కనుక్కున్నారు. ''ఇల్లినాయిస్ విశ్వ విద్యాలయపు పరిశోధకులు 30 మంది యువ స్నాతక విద్యార్థినులను నియమించుకుని రోజు వారి చేత ఒక విడత 20 నిమిషాల పాటు యోగాభ్యాసం మరియు వేరే సమయంలో 20 నిమిషాల పాటు తీవ్ర మోతాదులో ఏరోబిక్ వ్యాయామ శైలిలో నడక లేదా వారి గరిష్ట గుండె కొట్టుకొనే వేగం 60 నుండి 70 శాతంలో ట్రెడ్ మిల్‌పై చిన్నపాటి పరుగు అభ్యాసం చేయించారు. ప్రతి చర్య తరువాత వారి ధారణశక్తి యొక్క వేగాన్ని లేదా ఖచ్చితత్వాన్ని మరియు స్పందన నిరోధక నియంత్రణను పరీక్షించారు.6

''ఇతర అధ్యాయనాలతో పోలిస్తే తీవ్ర మోతాదులో ఏరోబిక్ వ్యాయామం చేసిన తరువాత కంటే యోగాభ్యాసం చేసిన తరువాత మానసిక పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థినులు గణనీయంగా మెరుగుతనం చూపడం పరిశోధకులను ఆశ్చర్యపరిచింది.

కాయవ్యోపాఖ్యానము

మహాభారతంలో ఉపాఖ్యానాలు

107



డాక్టర్ ముదిగొండ ఉమాదేవి



పూర్వం కాయవ్యుడు అనే ఎరుకలవాడు ఉండేవాడు. అతను వృత్తి చేత దోపిడీదొంగ. కాని నిజజీవితంలో అతను బుద్ధిమంతుడు, శూరుడు, చదువుకున్న వాడు, క్రూరత్వం లేనివాడు. అతనికి నాలుగు వర్ణాశ్రమాలలో ఉన్న ధర్మాల గురించి క్షుణ్ణంగా తెలుసు. బ్రహ్మజ్ఞానం కలవాడు. గురువులను పూజించే వాడు. అతను ఒక క్షత్రియునికి, నిషాదికి జన్మించాడు. కనుక క్షత్రియ ధర్మాలను చక్కగా నిష్ఠతో పాటించే వాడు. కనుక అతను దస్యుడయినా సిద్ధి పొందాడు. అతను ప్రతిదినం ఉదయం సాయంత్రం సమయాలలో అరణ్యమృగాలను ఉత్తేజపరిచేవాడు. అతనికి వివిధ జాతుల మృగాల స్వభావాలన్నీ చక్కగా తెలుసు. అందరి ఆటవికులలో అతను నిపుణుడు. అతనికి ఆ అరణ్యంలో అన్ని ప్రదేశాలు వాటి మార్గాలు క్షుణ్ణంగా తెలుసు. అన్ని ప్రాణుల ధర్మాలు తెలుసు. అతను వందలకొద్దీ సైన్యాన్ని ఒక్కడే గెలువగలడు. అతను అరణ్యంలోనే ఉన్న వృద్ధులైన తన తల్లిదండ్రుల సేవ, పూజ చేసేవాడు. వారికి రకరకాల మాంసాలు, పండ్లు, తేనె ఆహారంగా పెట్టేవాడు. వారితో పాటు ఇంకెవ్వరైనా పెద్దలు ఉంటే వారినీ ఆదరించేవాడు. వారికీ పరిచర్యలు చేసేవాడు. అరణ్యంలో ఉండే తాపసులు, సన్యాసుల దగ్గరికి వెళ్ళి వారినీ సేవించేవాడు. ఎవ్వరైనా అతను దొంగ కనుక అతని సొమ్ము తమకి అక్కర్లేదని తీసుకోకపోతే, రాత్రిపూట వారి గృహాలలో ఆహారపదార్థాలు పెట్టి వెళ్లిపోయే వాడు.

అతని గుణగణాలకు ముచ్చటపడి ఎంతోమంది దొంగలు అతన్ని నాయకునిగా ఎన్నుకున్నారు. వారు అతనితో ఇలా అన్నారు ''దేశ, కాల, పరిస్థితుల గురించి నీకు క్షుణ్ణంగా తెలుసు. నీవు శూరుడవు. నీవు మాకు నాయకునిగా ఉండి మమ్మల్ని తల్లీ దండ్రి లాగా కాపాడు. మేము ఎలా నడుచుకోవాలో మాకు చెప్పు!''.

అప్పుడు కాయవ్యుడు వారితో ఇలా అన్నాడు ''స్త్రీలను, భయపడినవారిని, చిన్నపిల్లలను, తాపసిని, మనతో యుద్ధం చెయ్యని వానిని చంపకూడదు. ఎప్పుడూ బ్రాహ్మణుల హితం కోరాలి. వారి కోసం పోరాడాలి. ఎక్కడ దేవతలు, పితృదేవతలు, అతిథులు పూజింపబడుతారో అక్కడ పూజార్హమైన ద్రవ్యాలను అపహరించి ఆ కార్యాలకు విఘ్నం కలిగించ కూడదు. అన్ని ప్రాణులలోను బ్రాహ్మణుడు బ్రహ్మజ్ఞాని కనుక మోక్షార్హత కలవాడు. వారికి మన దగ్గర ఉన్నది అంతా ఇచ్చి అయినా అభివృద్ధి కలిగించాలి. బ్రాహ్మణులను నిందిస్తూ వారి నాశనాన్ని కోరేవాడు తప్పక పరాభవం పొందుతాడు. వారు ఎవరినైనా కోపిస్తే వానిని ఎవ్వరూ రక్షించలేరు. ఎవ్వరైనా మనకు ఇవ్వవలసింది ఇవ్వకపోతే వారి ఇంటిపై దాడి చేయవచ్చు. దండోపాయం ద్వారా సంపద పెంచుకోకూడదు. తమ ఉన్నతి కోసం దేశం యొక్క అభివృద్ధిని ఎవ్వరైతే అడ్డుకుంటారో వారు శవంలోని పురుగుల్లాగ నశిస్తారు. దొంగలు అయినా ఎవరు ధర్మశాస్త్రం ప్రకారం నడుచుకుంటే వారు తప్పక సిద్ధి పొందుతారు''.

నాయకునిగా కాయవ్యని ఆదేశాలను ఆ దొంగలు అందరూ ఆచరించారు. దాని వలన వారు అభివృద్ధి పొందారు. పాపకర్మలను మానివేశారు. కాయవ్యుడు నాయకునిగా ఈ కార్యాలలో సాధు జనులకు క్షేమాన్ని కలిగిస్తూ తన అనుచరులైన దొంగలను పాపం నుండి నివారిస్తూ గొప్ప సిద్ధిని పొందాడు. ఇదీ కాయవ్య చరిత్ర.

-ఇంకావుంది

పరమహంస బోధామృతము



153. సమారాధనకు పలువురు ఆహ్వానింపబడినపుడు వారు చేయు గోల విశేషముగా వినవచ్చును. కాని యా గందరగోళము అంతయు వారు భోజనము ఆరంభించునంతవరకే. వడ్డన అయిన భోజనము ప్రారంభించుసరికి శబ్దము ముప్పాతిక పాలు అణిగిపోవును. ఇక బూరెలు వచ్చును- వడ్డన సాగిన కొలది శబ్దము క్షీణించుచుండును. మజ్జిగ దగ్గరకు జ్రరుకొను శబ్దముదక్క మరేదియు వినబడదు. భోజనములు అయినంతనే ఇక వారు చేయు పని నిద్రపోవుటయే.

దైవసాన్నిధ్యమును బొందినకొలదియు ప్రశ్నలందును హేతువాదములందును నీకు రుచి తగ్గిపోవుచుండును. ప్రత్యక్షముగ దైవమును దర్శించినంతనే ఈ వాదోపవాదములన్నియు, ఈ గందరగోళము అంతయు పూర్తిగా అణిగిపోవును. అపుడు నిద్రా సమయము, అనగా సమాధి స్థితి యందు బ్రహ్మానందమును బొందు సమయము వచ్చును.

154. తేనెటీగ పుష్ప దళములలోనికి బ్రవేశించి యందలి మకరందమును చవిచూడకుండునంతవఱకు బయటనేయుండి దాని చుట్టును ఝంకారము చేయుచు దిరుగుచుండును. కాని యది పూవులోనికి ప్రవేశించినంతనే నిశ్శబ్దముగా మకరందమును గ్రోలనారంభించును. వాదములను గూర్చియు సిద్ధాంతములను గూర్చియు చర్చించుచున్నంతవఱకు మానవుడు తత్త్వామృతమును రుచి చూడనివాడే. దానిని రుచి చూచెనా, వాదోపవాదాదమలకు స్వస్తి చెప్పును.

155. క్రొత్త భాషను నేర్చుకొన మొదలిడినవాడు తన సంభాషణలందు ఆ భాషా పదములను తఱచు వాడుచు, తన ప్రజ్ఞను ప్రదర్శింపజూచుచుండును. కాని దానిని బాగుగా నేర్చినయతడో, మాతృభాషను మాటలాడునపుడు ఆ నూతన భాషా పదములను ఉపయోగింపనే ఉపయోగింపడు. ఆధ్యాత్మిక సాధనలలో అభివృద్ధి పొందిన వారి విషయము కూడ నిట్టిదే.

156. సంతకు దూరమున్న నున్నప్పుడు 'హోహో'యను పెద్దగోల వినబడును. సంతలో బ్రవేశించిన పిమ్మట ఆ శబ్దము వినబడదు. కాని యచట జరుగుచున్న బేరసారములు తెలియవచ్చును. అటులనే భగవంతుని దూరముగానున్నంత వఱకు నరుడు నిరర్థక వాదోపవాదములను గందరగోళములో నిమగ్నుడై యుండును. కాని భగవంతుని సమీపింపగనే యుక్తులును వాగ్వాదములును అన్నియు శాంతింప భగవల్లీలలను స్పష్టముగా గాంచును.

157. కాగుచున్న నేతిలో అప్పచ్చులను వేయునపుడు సలసలమని ధ్వని పుట్టును. కాని యవి వేగినకొలదియు ధ్వని తగ్గుచుండును. పూర్తిగా వేగినంతనే శబ్దము అణగిపోవును. అల్పజ్ఞానియైయున్నంతవఱకు నరుడు ప్రసంగములను బోధోపదేశములను అదే పనిగా సాగించుచుండును; కాని బ్రహ్మజ్ఞానము లభించెనేని ఈ పటాటోపము అంతయు అణగిపోవును.

158. ఈశ్వరానుగ్రహము లభించునపుడెల్లరును తమ దోషములను గుర్తెఱుంగుదురు; దీనిని గ్రహించినవాడు వాగ్వాదములలోనికి దిగడు.

పాండిత్యమునకు నిజమైన ప్రయోజనమేమి?

159. భగవంతుని బొందు మార్గమును జూపుటయే ధర్మశాస్త్రములు చేయు పని. మార్గమును గ్రహించిన పిమ్మట పుస్తకములతో పనియేమి? ఇక నేకాంతముగా సాధన చేయవలసి యుండును. తనబందుగులకు ఏవో కొన్ని వస్తువులను బంపుమని యింటినుండి ఒకనికి ఉత్తరము వచ్చినది. ఆతడా వస్తువులను కొనబోవునపుడు ఉత్తరములో ఏ వస్తువులు పంపుమని వ్రాయబడెనో నిర్ధారణగా దెలియగోరెను. ఉత్తరముకోసము చూడగా అది కనబడలేదు. అందుచే చాలసేపు వెదకినాడు. తుదకది యెట్లో కన్పించినది. మహానందముపొంది దానిని ఆత్రముతో జదువనందిట్లున్నది: ''ఐదు సేర్ల మిఠాయి, వంద నారింజపండ్లు, ఎనిమిది ధోవతులు పంపుడు.''

సంగతులు తెలియగనే ఉత్తమమును ఆవలబెట్టి కావలసిన వస్తువులు కొనరారంభించినాడు.

ఇంకావుంది...

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల
శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము -
అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

సుందరకాండ

అశోక వనం కనబడింది. అంటే సుఖ స్వరూపం కనబడింది. దాని వలన తాను చూడనిదేదో చూడవలసినదేదో తెలిసింది. ఇంతకంటె ఏం కావాలి. కనుక. రహస్యమేమిటంటే- స్వామి సీతను వెదుకలేదు. సీతే స్వామికి కనబడింది వెదుకుతున్నానని అనుకొన్నంత సేపు ఆవిడ కనబడలేదు. మహాకవుల కావ్యాలలో 'మరణం' అని ఒక అవస్థ ఉంటుంది. మరణం అంటే చావు కాదు. మూర్ఛ. మరణ స్థితి వంటి స్థితి. అప్పుడు తన శరీరం తన వశంలో ఉండదు. తన యింద్రియాలు తన అదుపులో ఉండవు. తన మనస్సు తన స్వాధీనంలో ఉండదు. ఇట్టి స్థితి అందులో ఉన్న నాయికకు కలుగుతుంది. ఆ క్షణంలో నాయిక దర్శనం కలుగుతుంది. తిరిగి ఆమె జీవిస్తుంది. అంటే- తిరిగి ఆమె యింద్రియాలుఆమె ఆధీనమవుతాయి. ఆమె మనస్సు ఆమె యిష్టాన్ననుసరించి ఉంటుంది.

ఈ స్థితి భక్తునికి కూడా వస్తుంది. సాధకునకు వస్తుంది. ఆ స్థితి వచ్చే వరకు భగవంతుడు కల్పించుకోడు. సాధన సిద్ధించదు. స్వామికి అశోక వన దర్శనం కలుగగానే ఒక్కసారి తన శక్తి పునఃతనకు వచ్చినట్లయింది శక్తిని కలిగింపవలసిన దైవం జ్ఞాపకానికి వచ్చేడు. సమస్త దేవతా నమస్కారం చేసేడు. ముహూర్త కాలం ధ్యానం చేసేడు. వెంటనే-

నమో స్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యైచ తస్యై జనకాత్మజాయై
నమో స్తు రుద్రేంద్రయమాని లేభ్యో
నమో స్తు చంద్రార్క మరుద్గణేభ్య: అని చేతులు జోడించేడు.

అహంకార నిరాసనమైంది. తనను పంపినవాడు జ్ఞాపకం వచ్చేడు.

ఆయన తమ్ముడు జ్ఞాపకం వచ్చేడు. లంకలో చేరినప్పటినుండి ఇంతవరకు స్వామి రామధ్యానమెరుగడు. ఇప్పుడు జ్ఞాపకం వచ్చేడు రామచంద్రా! ఇది నా పని కాదు నీ పని. నాచేత చేయించుకొని అనుగ్రహించు. నీకు నమస్కారం. నీ సేవకుడైనప లక్ష్మణునకు నమస్కారం. అంతేకాదు-

జనకుని కుమార్తెయు నీకు దేవియు అయిన సీతకు నమస్కారం ఎందుకని-

జనకుని ప్రయత్నం లేకుండగానే ఆయనకు దర్శనమిచ్చి అనుగ్రహించినట్లు నన్ననుగ్రహంపవలసి తల్లి.

నా ప్రయత్నం ఏమీలేదు. అందుకని ఆ తల్లికి నమస్కారం నాకంటె ముందు ఆ తల్లి. అనుగ్రహాన్ని పొంది కృతార్థులైనవారు కనుక- ఆ దారిలో నన్ను నడిపించి కృతార్థుని చేయవలసినదిగా- రుద్రాదులకు నమస్కారం. మానసిక ఉత్సాహం ఉరకలు వేసింది.

సగత్వా మనసా పూర్వం అశోక వనికా శుభాం.

అప్పుడే మనసా అశోక వనానికి వెళ్ళిపోయేడు. ఇది ఆంజనేయస్వామి ప్రకృతి. మనం కూడా ఇలా ఉండాలి. వెంటనే-

జ్యాముక్త ఇవ నారాచః పుప్లువే వనవాటికం.

ధనుస్సు నుండి విడిచిపెట్టబడిన బాణంలా అశోక వనానికి ఎగిరేడు. ఇలా ఎగరటం ఇది రెండవసారి. మన ప్రకృతి అల్పమయినది. కనుక మనకేమి కావాలో నిజంగా మనకు తెలియదు. భగవంతుణ్ణి కూడా మనం అడిగేటప్పుడు కూడా తెలియకే నష్టపోతాం. ఎందుకంటే - ఆయన ఎక్కువే ఈయదలచుకొన్నా అది తెలియక మనం తక్కువే అడుగుతాం. అలాగే-

స్వామి సముద్ర తరణానికి సిద్ధపడుతూ నేను రాముడు విడిచిన బాణంలా లంకను చేరతాను అని అనుకొంటాడు. లంకను చేరేడు. అలాకాక, అప్పుడే- నేను రాముడు విడిచిన బాణంలా సీతా సామీప్యాన్ని పొందుతాను అని అనుకొంటే ఇంత అవస్థలేకుండా అప్పుడే చేరి ఉండేవాడు. అజ్ఞానం ఇప్పుడు కలిగి విడిచిపెట్టబడిన బాణంలా ఎగిరేడు.

ఇది భౌతికంగా.

ఆ ఉత్సాహం ఈ వేగం సుందరకాండ పారాయణ దీక్షాదక్షులకు కావాలి. ఇలా ఎగురడానికి ముందే స్వామి తాను చూడవలసిన స్వరూపాన్ని ధ్యానం చేసేడు. ఆ స్వరూపం ఎలా ఉండాలి!

తదున్నసం పాండురదంత మవ్రణం
శుచిస్మితం పద్మపలాశలోచనం
ద్రక్ష్యే తదార్యా వదనం కదాన్వహం
ప్రసన్న తారాధిపతుల్య దర్శనమ్.

ఎత్తైన ముక్కు కలది. ఏ వ్రణాలు లేనిది. చిరునవ్వుతో ఉండేది. పద్మ పత్రాలవంటి కండ్లు కలది. అయిన ఆ ఆర్య అందే పూజ్యురాలి ముఖాన్ని ఎప్పుడూ చూడగలనోకదా! ఇదీ శ్లోకం.

సీత అనబడే స్త్రీ స్వరూపాన్ని అన్వేషించడానికి వచ్చిన తనకు ఆ స్వరూపం ఎలా ఉంటే ఎందుకు అంటే- అలాకాదు.

ఇంకావుంది...

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ తెలుగు అనువాదం:
డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

201

ఆచార్యుడే ఉత్తముడయితే బాలుర జీవితమే సమున్నతస్థాయి నందుకొంటుంది. అంతేకాదు తల్లిదండ్రులవలన సంక్రమించిన కుసంస్కారాలు కూడ ఆ బాలురనుండి తుడిచిపెట్టుకుపోతాయి.

దురదృష్టవశాత్తు తల్లిదండ్రులు- ఆచార్యుల నుండి మంచి క్రమశిక్షణ బాల్య, కౌమార, యౌవన దశలలో ఏ సందర్భంలోనూ అందక ఆ బాలుడు దుష్టుడుగా మారిపోయిన సంఘటనలు లోకంలో కనబడుతూ ఉంటాయి. అట్టివారి పూర్వజన్మ సుకృత విశేషంవలన వారికి ఏ దివ్యమహాపురుషుని సంసర్గమో కలిగితే వారిలో ఆశ్చర్యజనకమైన ఒక గొప్ప పరివర్తన ఏర్పడుతుంది. ఫలితంగా పాపపు ఊబిలో కూరుకుపోయిన వారి మదిలో ప్రాయశ్చిత్త మహాశ్రుజలం పెల్లుబికివచ్చి పాపపం కిలమంతా ప్రక్షాళితమై నిర్మల ప్రశాంత చిత్తులవుతారు. అంటే వారు పునర్జన్మను ఎత్తినట్లే. అట్టి పునర్జన్మను పొందినవారికి ఆ మహాత్ముడు తండ్రియే అని వేదం 'అవంతు నః పితరః సుప్రవాచనాః' ''ఉత్తమ ప్రవచనం ప్రబోధం చేసేవారు పితరులై (తల్లి-తండ్రి) మమ్ము రక్షించెదరుగాక'' అని వచించింది. అంటే తల్లిదండ్రి సాక్షాత్తుగా గాకున్నా తమ హితోపదేశం వలన దుర్మార్గులను సహితం సత్ప్రవర్తనులుగా తీర్చిదిద్దే మహాపురుషులు కూడ మాతాపితలేనని వేద మనోగతం. అట్టి ఉత్తమ ప్రవచనకర్తలలో ఒక అనిర్వచనీయమైన మహత్తరశక్తి ఉంటుంది. వారి ప్రవచన ప్రభావం ఏ విధంగానూ సంస్కరించేందుకు సాధ్యంకానంత సంస్కార భ్రష్టుని సహితం సంస్కారవంతునిగా చేయగల మహత్తరమైనది. వారి మహత్తరశక్తిని ప్రస్తుత వేదమంత్రం వివరిస్తూ ఎగుడుదిగుడుగా చిత్తడి చిత్తడిగా ప్రయాణ అననుకూలమైన రహదారులలోనుండి నిపుణుడైన రథచోదకుడు చాతుర్యంతో ప్రమాద రహితంగా నడుపుతూ రథాన్ని మంచి మార్గానికి ఎలాతీసుకొని వస్తాడో అట్లే ఈ మహాత్ములు తమ ప్రవచనం చేత కుసంస్కారులను సహితం సంస్కారవంతులుగా తీర్చిదిద్దగలరని సోపమానంగా వర్ణించింది. ఈ మహాపురుషులు ఎంతటి ప్రతిభావంతులో వివరిస్తూ తల్లిదండ్రులవలన కుసంస్కారులుగా మారిన సంస్కారహీనులను సహితం సంస్కారవంతులుగా చేయగలరని అథర్వణవేదం ఇలా వివరిస్తూంది.

యదేనసో మాతృకృతాచ్ఛేషే పితృకృతాశ్చ యత్।
ఉన్మోచనప్రమోచనే ఉభే వాచా వదామి తే॥

''మాతాపితల అపరాధం వలన పాపిగా అయితే మహాత్ములు ఆ పాపం నుండి అతడు విముక్తుడు కావడానికి ఉపాయాన్ని తమ ప్రవచనం ద్వారా వినిపించగలరు.''

వ్యక్తి జీవితంలో ఆచార్యుని ప్రాధాన్యమెంతో ఉంది. జన్మతః వ్యక్తి కుసంస్కారిగా జన్మించినా అదృష్టవశాత్తు వానికి మహాగురువులతో సంయోగమేర్పడితే ఆ వ్యక్తి సంస్కారికాగల అవకాశమెంతో ఉంది. వైదిక సంస్కృతిలో ఆచార్యుడికి మహోన్నత స్థానముంది. అందుచేతనే ఆచార్యులు, గురువులు, ప్రవచన మహాపురుషులు, సన్యాసులు రాజుకంటె మరియు రాజునకుకూడ వందనీయులగుచున్నారు.

న్యాయమార్గం నుండి ధీరులు వెనుకంజ వేయరు

హయో న విద్వా అయుజి స్వయం ధురి తాం
వహామి ప్రతరణీమవస్యువమ్ నాస్య వశ్మి
విముచం నావృతం
పునర్విద్వాన్‌పథః పురఏత ఋజునేషతి

భావం: విద్వాంసుడైన నేను గుఱ్ఱంవలె నాకు నేనే కాడికి కట్టుకొన్నాను. రక్షించేది, లక్ష్యాన్ని చేర్చేది అయిన ఆ కాడి కొయ్యను మోస్తూనే ఉన్నాను. చిరకాలం మోస్తూ ఉన్నా ఆకాడి నుండి విడుదల పొందలాని గాని తాత్కాలికంగానైనా దానినుండి వెనుతిరగాలని గాని కోరుకోవడంలేదు. ఎందుకంటే మార్గాన్ని లేదా లక్ష్యాన్ని బాగా తెలిసిన నా యజమాని నన్ను నేరుగా అచటకు చేర్చగలడు.

వివరణ: మానవుని జీవన సాఫల్యం అతని కార్య నిమగ్నత మీద ఆధారపడి వుంది. ఈ సత్యాన్ని వేదం గుఱ్ఱంరథపు కాడికి కట్టబడిన రీతిగా మనిషి కార్యనిమగ్నుడు కావాలని సోపమానంగా వర్ణించింది. ఈ సందర్భంలో గుఱ్ఱానికి మనిషిగల భేదాన్ని కూడా గుర్తించవలసియుంది. ఏమంటే గుఱ్ఱం రథపు కాడికి తనంత తానుగాకట్టబడదు.

దానిని యజమాని కడతాడు. కాని మనిషి అలా కాక తనకు తానుగా కార్యనిర్వహణ నిమగ్నుడు కావలసియుంటుంది. అలా స్వేచ్ఛగా మనిషి కార్య నిమగ్నుడు కావాలని వేదం 'హయో న విద్వాన్ అయుజి స్వయం ధరి'-గుఱ్ఱం వలె మనిషి తనకు తాను కార్యనిర్వహణ అనే కాడికి జోడింపబడాలి, అంటే నిమగ్నుడు కావాలని సూచించింది. మనిషికి ఈ స్వేచ్ఛను వేదమెందుకు ఇచ్చింది? అని విచారిస్తే మనిషి తన జీవిత లక్ష్యమూ జీవనోద్దేశ్యమూ తనకు తానే నిర్ధారించుకోవాలిగాని గుఱ్ఱంవలె ఇతరులు నిర్ధారించేది కాదు.

ఇంకావుంది...

పోలీస్ అధికారిగా



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన పేట చిత్రం ఇటీవల విడుదలై 100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఇక ఈ చిత్రం తరువాత రజనీ, మురుగదాస్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ చిత్రంలో తలైవా పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించనున్నారని వార్తలు వస్తున్నాయి. ఇక ఇదిలా ఉంటే రజనీ ఇప్పట్లో సినిమాలకు గుడ్‌బై చెప్పేలా కనిపించడం లేదు. ఎందుకంటె తనను పేటలో స్టైలిష్‌గా చూపించి మంచి మార్కులుకొట్టేసిన దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్‌కు రజనీ మరో ఛాన్స్ ఇవ్వనున్నాడని టాక్. అలాగే తన గత చిత్రాల్లో కొన్ని సినిమాలకు సీక్వెల్ చేసే ఆలోచనలో కూడా ఉన్నట్లు తెలుస్తుంది తలైవా. సో మరో 5 సంవత్సరాలపాటు ఆయన సినిమాల్లో కొనసాగే అవకాశం ఉందన్నమాట. ఇక మరోవైపు రజనీ పొలిటికల్ పార్టీని కూడా స్థాపించిన విషయం తెలిసిందే. మరి ఈ రెండింటిని ఎలా బ్యాలన్స్ చేస్తారో చూడాలి.



అక్కినేని చిన్నోడు అఖిల్, నిధి అగర్వాల్ జంటగా తొలిప్రేమ ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం -మిస్టర్ మజ్ను. జనవరి 25న సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో అఖిల్ మీడియాకు చెప్పిన ముచ్చట్లు.

మజ్ను.. మా ఓన్

కథ నచ్చింది: ఓ పాత్ర నేపథ్యంలో సాగే కథ కావడంతో బాగా నచ్చేసింది. క్యారెక్టరైజేషన్ ఇంపాక్ట్ ఎగ్జైటింగ్, ఛాలెంజింగ్ అనిపించింది. ఇంతకుముందు చేసిన రెండు చిత్రాలకి ఇది భిన్నం. ఆడియన్స్‌కి ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్ రెండూ అందుతాయి.

దర్శకుడి గురించి..: వెంకీ గుడ్ డైరెక్టర్. గుడ్ రైటర్ కూడా. నాన్నకు అతను పెద్ద ఫ్యాన్. నిన్నే పెళ్లాడుతా, మన్మధుడు లాంటి సినిమాల ప్రేరణతోనే ఇదీ చేశాడు. కామన్ ఫ్రెండ్ ద్వారా కలిసిన వెంకీ చాలాకాలంగా తెలిసినా, మజ్ను నుంచి దగ్గరైపోయాడు.

స్పీడ్‌గా జరిగింది..: 'హలో' స్క్రిప్ట్‌కి ఎక్కువ వర్క్ చేశాం. ఆ సినిమాకీ షూటింగ్‌కీ ఎక్కువ డేస్‌పట్టాయి. అఖిల్‌కీ అంతే. కానీ మిస్టర్ మజ్ను ఫుల్ స్క్రిప్ట్‌తో వెంకీ సిద్ధంగా ఉండటంతో, వేగంగా పూర్తైంది.

గత సినిమాల నుండి..: బాడీ లాంగ్వేజ్, డిక్షన్, యాక్షన్ అంతా కొత్తగా చూపించే ఉద్దేశ్యంతో వెంకీ, నేనూ చాలా వర్క్ చేశాం. ఎప్పటికప్పుడు పనిలో ఆత్మవిమర్శ చేసుకుంటాననంటూ మజ్ను ఆడియో ఈవెంట్‌లో తారక్ అన్న ప్రస్తావించింది అందుకే.

టైటిల్ విషయంలో..: మిస్టర్ అని పెట్టడానికి ప్రత్యేకమైన కారణాలేమీ లేవు. కాకపోతే ఓన్లీ మజ్ను పెడితే ట్రాజెడీ ఫీలింగ్ ఉంటుందన్న ఆలోచనతో మిస్టర్‌ను తగిలించాడు వెంకీ. దీనివల్ల మోడ్రన్ మజ్నును చూపించబోతున్నాడనే సెన్స్ కూడా హైలెట్ అవుతోంది.

మజ్ను ఫ్యామిలీ..: మజ్ను టైటిల్ బాగా కలిసొచ్చింది మా ఫ్యామిలీకి. లైలామజ్నుగా తాతగారు, మజ్నుగా నాన్న.. ఇప్పుడు మిస్టర్ మజ్నుగా నేను.

లవ్‌తోపాటు..: ఒక్కమాటలో చెప్పాలంటే సినిమాలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. యాక్షన్ పార్టూ ఉంది. మూడు ఫైట్లు ఉన్నాయి. అలాగే సినిమాలో నాకూ, నా బాబాయ్‌కి, నా పిన్నికి మధ్య వచ్చే ట్రాక్ కూడా బాగుంటుంది.

ఎన్టీఆర్ నుంచి ఏదో..: ఏదోకాదు, మాస్ నేర్చుకోమన్నారు. అదే ఎలా నేర్చుకోవాలో తెలియట్లేదు. ఇక ఎలా నేర్చుకోవాలో నాన్నను అడగాలి.

మ్యూజిక్ సూపర్..: ఒక లవ్‌స్టోరీకి మ్యూజిక్ ఎంత ఇంపార్టెంటో అందరికీ తెలుసు. కచ్చితంగా తమన్ మ్యూజిక్ 'మజ్ను'ను మరో లెవల్‌కి తీసుకెళ్తుంది. ఈమధ్య తమన్ చేస్తున్న సినిమాలన్నీ మ్యూజికల్ హిట్లే.

మల్టీ స్టారర్స్..: గతంలోనే ఓ మల్టీస్టారర్ చెయ్యమని అడిగారు. కానీ అప్పుడు చెయ్యటం కరెక్ట్‌కాదని చెయ్యలేదు. కథ నచ్చితే మాత్రం ఫ్యూచర్‌లో చేస్తాను. అలాగే స్పోర్ట్ నేపథ్యంలో సినిమా కూడా అడుగుతున్నారు. తప్పకుండా మంచి కథ కుదిరితే చేస్తా.

తదుపరి చిత్రాలు..: ప్రస్తుతం నా దృష్టి అంతా పూర్తిగా 'మిస్టర్ మజ్ను'పైనే ఉంది. ఈ సినిమా విడుదలైన తరువాతే నా తదుపరి చిత్రం గురించి ప్రకటిస్తా. ఈసారి నెక్స్ట్ సినిమా దసరాకు ముందే వచ్చేలా ప్లాన్ చేస్తా.

-శ్రీ

ఇస్మార్ట్‌గా.. పూరీ, రామ్



నిన్నటి వరకూ ఊరించిన పూరీ మొత్తానికి మొదలెట్టేశాడు. రామ్ పోతినేనితో ఇస్మార్ట్ శంకర్‌ని ప్రకటించిన పూరీ, ఫస్ట్‌లుక్‌తో హడావుడి లేపాడు. మంచి మాస్ లుక్‌లో రామ్‌ను చూపించిన పూరీ, ఇస్మార్ట్.. షూటింగ్‌ను బుధవారం గ్రాండ్‌గా లాంచ్ చేశాడు. గురువారం నుంచి నాన్‌స్టాప్‌గా రెగ్యులర్ షూటింగ్ నిర్వహించేందుకు చిత్రబృందం ఏర్పాట్లు చేసుకుంది. లాంచింగ్‌కు యూనిట్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. చార్మీ క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభిస్తే, స్రవంతి రవికిషోర్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మాస్ గెటప్‌లోవున్న రామ్, పిస్టల్‌తో వరుస బుల్లెట్లు షూట్ చేయడాన్ని ముహూర్తపు షాట్‌గా తీశారు. చాలాకాలంగా హిట్టుకు దూరంగా ఉండిపోయిన పూరి, రామ్‌లు, ఈ సినిమాతో సక్సెస్‌ను మరోసారి రుచి చూడాలన్న కసితో కనిపిస్తున్నారు. పూరి దర్శకుడిగానే కాదు నిర్మాతగానూ ఈ చిత్రానికి పని చేస్తున్నారు. చార్మీ సహ నిర్మాత. అన్నీ సెట్టయినా హీరోయిన్ కోసం వెతుకుతున్న టీం -మొత్తానికి లీడ్ రోల్‌నూ కన్ఫర్మ్ చేసుకుంది. రామ్‌కు జోడీగా అను ఇమ్మాన్యుయేల్‌ను ఓకే చేసినట్టు టాక్. మరో హీరోయిన్‌ను కన్ఫర్మ్ చేసుకోవాల్సి ఉంది. మాస్ కంటెంట్‌తో పూరి జగన్నాథ్ ఈ చిత్రాన్ని కమర్షియల్ ఫార్మాట్‌లో తెరకెక్కించనున్నట్టు సమాచారం.



కల్యాణ్‌తో విరించి?

'ఉయ్యాల జంపాల' చిత్రంతో వెండి తెరపై ఎంట్రీ ఇచ్చి విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడంతోపాటు 'మంచి కలెక్షన్స్ కూడా రాబట్టాడు దర్శకుడు విరించివర్మ. అయితే రెండవ సినిమా 'మజ్ను' మాత్రం పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. దాంతో కాస్త గ్యాప్ తీసుకుని తదుపరి చిత్రాన్ని చేసేందుకు సిద్ధంఅయ్యాడు. ఈయన మూడవ సినిమాను నందమూరి కళ్యాణ్‌రామ్‌తో చేయబోతున్నాడట. ఇటీవలే విరించివర్మ చెప్పిన కథకు కళ్యాణ్‌రామ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడని-త్వరలోనే సినిమాను పట్టాలెక్కించేందుకు ఏర్పాట్లుకూడా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ కథాంశంతో చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లుగా సమాచారం. ఇప్పటికే ఒప్పుకున్న సినిమాలను పూర్తిచేసిన తర్వాత కళ్యాణ్‌రామ్ ఈ సినిమాను మొదలుపెట్టే అవకాశం ఉంది. త్వరలోనే కళ్యాణ్‌రామ్ '118' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆ సినిమాలో చాలా స్పెషల్‌గా కనిపిస్తాడట.



మొదలైన సింహనాదం


శ్రీ లలిత మూవీ మేకర్స్, శ్రీ వైష్ణవ స్పిరిట్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా పి.శ్రీనివాస్ దర్శకత్వంలో నిర్మిస్తున్న భక్తిరస ప్రధాన చిత్రం 'సింహనాదం' (శ్రీ నరసింహస్వామి వారి వైభవం). సుమన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. హైదరాబాద్ భారతీయ విద్యాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు స్వామీజీల ఆశీస్సులతో ఈ చిత్రం టైటిల్ లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సింహయాజి స్వామి, కామిశెట్టి శ్రీనివాస్, రామానుజాచార్యులు, విశ్రాంత న్యాయమూర్తి మాల్యాద్రి, బిజెపి నాయకురాలు గీతామూర్తి, ప్రముఖ నిర్మాత బెక్కెం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. శ్రీ నరసింహస్వామి వైభవాన్ని చాటి చెబుతూ రూపొందుతున్న సింహనాదం ఘనవిజయం సాధించాలని వీరంతా అభిలషించారు. ఈ సందర్భంగా శ్రీ అహోబిల నరసింహస్వామిపై తాళ్ళపాక అన్నమాచార్యులు రచించిన కీర్తనలతో కూడిన సర్వం సింహమయం ఆడియో సీడీని ఆవిష్కరించారు. సుమన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం కోసం ప్రస్తుతం ఇతర నటీనటుల ఎంపిక జరుపుతున్నామని, త్వరలో సెట్స్‌కు వెళ్లనున్నామని దర్శకుడు పి.శ్రీనివాస్ తెలిపారు.



బంపర్ ఆఫర్లో

'అర్జున్‌రెడ్డి' చిత్రంలో హీరోయిన్‌గా నటించి, మొదటి సినిమాతోనే టాలీవుడ్‌లో స్టార్ స్టేటస్‌ను దక్కించుకున్న ముద్దుగుమ్మ షాలిని తెలుగులో మాత్రం మంచి ఆఫర్లను దక్కించుకోలేక పోతుంది. చిన్న పాత్రలు సెకండ్ హీరోయిన్ పాత్రలే ఈమెకు దక్కుతున్నాయి. తమిళంలో '100% లవ్' చిత్ర రీమేక్ '100% కాదల్' చిత్రంలో నటిస్తోంది. షాలినికి దక్కిన పెద్ద ఆఫర్ ఇప్పటివరకు అదే. మంచి ఆఫర్స్‌కోసం ఎదురుచూస్తున్న ముద్దుగుమ్మ షాలిని పాండేకు బాలీవుడ్‌లో మంచి ఆఫర్ దక్కింది. ప్రస్తుతం కళ్యాణ్‌రామ్ నటిస్తున్న '118' చిత్రంలో షాలిని పాండే ఒక హీరోయిన్‌గా నటిస్తుంది. చిన్నా పెద్ద అనే తేడాలేకుండా మూడునాలుగు సినిమాలు చేస్తున్న షాలిని పాండే తాజాగా బాలీవుడ్‌లో పరేష్‌రావల్ కుమారుడు ఆదిత్య హీరోగా పరిచయం కాబోతున్న 'బాంఫాడ్' చిత్రంలో హీరోయిన్‌గా ఎంపిక అయ్యింది. ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న కారణంగా అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమాతో షాలిని పాండే బాలీవుడ్‌లో మంచి విజయంతో ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉందని సినీ వర్గాల వారు అంటున్నారు.

కిలాడీ కాంచన



లారెన్స్ బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నాడు. స్టార్ హీరో అక్షయ్‌ని డైరెక్ట్ చేయబోతున్నాడు. హారర్ కామెడీల స్పెషలిస్టు అనిపించుకున్న లారెన్స్, కాంచన ఫార్ములాని బాలీవుడ్‌కి ఎగుమతి చేస్తున్నాడట. బాలీవుడ్ కిలాడీ అక్షయ్ కుమార్ హీరోగా 'కాంచన', 'ముని' చిత్రాల రీమేక్‌కు లారెన్స్ సన్నాహాలు చేస్తున్నాడని టాక్. ఇద్దరి మధ్యా ఇప్పటికే చర్చలు సాగాయని, రెండు చిత్రాల రీమేక్‌లా కాకుండా కాంచన, ముని చిత్రాల్ని కలిపి ఓ హారర్ కామెడీ చేసే అవకాశం ఉందని మేకర్స్ చెబుతున్నారు. అంటే అక్షయ్‌కుమార్ దెయ్యం పాత్రలో భయపెట్టబోతున్నాడన్నది కన్ఫర్మ్ అయ్యింది. కాంచన కథలో హిజ్రా (శరత్‌కుమార్) ఆత్మ లారెన్స్‌లో ప్రవేశిస్తుంది. తర్వాత ఏం జరిగింది? అన్నది ఉత్కంఠగా సాగే కథనం. లారెన్స్ పనితనానికి క్రిటిక్స్‌నుంచి ప్రశంసలు దక్కాయి. అందుకే అక్షయ్ సైతం ఈ సినిమాలో నటించేందుకు ఆసక్తి చూపిస్తున్నాడట. 2020లో సినిమా విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది. ఆరు నెలలపాటు స్క్రిప్ట్ వర్క్ చేసి, వచ్చే జూన్ జూలైలో షూటింగ్ ప్రారంభిస్తారని అంటున్నారు. ఏడాది చివరినాటికి సినిమా పూర్తి చేయాలన్నది ప్రణాళిక.



విజయ్‌తో వెంకీ

గతేడాది టాక్సీవాలా, గీతగోవిందం సక్సెస్‌లను ఖాతాలో వేసుకుని జోరుమీదున్న విజయ్ దేవరకొండ ప్రస్తుతం డియర్ కామ్రేడ్ పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నాడు. మైత్రి సంస్థ నిర్మిస్తున్న ఈ మూవీ స్టూడెంట్ పాలిటిక్స్ బ్యాక్‌డ్రాప్‌తో రూపొందుతోందని టాక్. దీంతోపాటు క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్‌పై క్రాంతిమాధవ్ దర్శకత్వంలో మూవీ చేస్తున్న విజయ్, మరో క్రేజీ ప్రాజెక్ట్‌కూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయట. గత ఏడాది వరుణ్‌తేజ్ తొలిప్రేమతో ఇండస్ట్రీని ఆకర్షించిన దర్శకుడు వెంకీ అట్లూరి తాజాగా తెరకెక్కించిన మిస్టర్ మజ్ను శుక్రవారం విడుదలవుతోంది. ఆ సినిమా తరువాత వెంకీ అట్లూరి మూడో సినిమా విజయ్ దేవరకొండతోనే అని టాక్. విజయ్ దేవరకొండ మైత్రికి రెండు ప్రాజెక్టులకు సైన్ చేసాడట. ఒకటి ఇప్పుడు నిర్మాణంలోవున్న డియర్ కామ్రేడ్. రెండో దానికోసం వెంకీ అట్లూరి కాంబినేషన్‌ని విజయ్ కోసం సెట్ చేస్తున్నారట మైత్రి నిర్మాతలు.

మహా శోభిత

శోభిత ధూళిపాళ.. ఈ పేరు తెలియని ఈ జెనరేషన్ తెలుగు ఆడియన్స్ దాదాపు ఉండరు. 'గూఢచారి'లాంటి హిట్ సినిమాలో హీరోయిన్‌గా నటించడమే కాకుండా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తరచూ హాట్ ఫొటోలు పోస్ట్ చేయడం శోభితకు నెట్‌తో పెట్టిన విద్య. ప్రస్తుతం శ్రీలంక ట్రిప్‌లో ఉన్న ఈ భామ అక్కడ ఒక బీచ్‌లో ఎంజాయ్ చేస్తున్న ఫొటోను పోస్ట్‌చేసింది. ఆ ఫొటోకు 'లంక యూ బ్యూటీ' అనే క్యాప్షన్ ఇచ్చింది. శ్రీలంకలోని ఊరో.. ఆ బీచ్ పేరేంటో చెప్పలేదుగానీ బీచ్ నిజంగానే బ్యూటిఫుల్‌గా ఉంది. కానీ ఫొటోలో బీచ్‌కాదు అమ్మడి హాటు పోజు కదా హైలైట్ అయ్యేది!

